# కథా మంజరి



నవంబరు 2020

# దీపావళి ప్రత్యేక సంచిక

# కథా మంజరి

పది కథల సమాహారం



కథా మార్గదర్శి



జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకట రావు
ప్రచురణ కర్త


**దీపావళి ప్రత్యేక సంచిక**

**నవంబర్ 2020**


© Copyright 2020 - Editorial Board Kathamanjari


దీపావళి సంచికకు
సాదర స్వాగతం

# ఇదీ వరస


| సంఖ్య | విషయం | | పేజీ సంఖ్య |
|---|---|---|---|
| I | మా జట్టు | | i |
| II | కృతజ్ఞతలు | | ii |
| III | దీపావళి కథల పోటీ ఫలితాలు | | iii |
| IV | కథా కీయం | | iv |
| V | ఈ నెల విశిష్ట అతిథి | | vi |
| VI | కథా మార్గదర్శి | | ix |
| | **కథలు** | | |
| సంఖ్య | కథ పేరు | రచన | పేజీ సంఖ్య |
| 1. | జీవన పోరాటం | జాస్తి రమాదేవి | 1 |
| 2. | దిశా నిర్దేశం | గంటి రమాదేవి | 7 |
| 3. | ఘోష | పొత్తూరి విజయలక్ష్మి | 17 |
| 4. | ఒకరికి ఒకరు | పక్కి శివప్రసాద రావు | 22 |
| 5. | ప్రాప్తమున్న తీరానికి | ఎం. ఏ. పద్మనాభ రావు | 28 |
| 6. | సబ్ కో సన్మతి దే భగవాన్ | రాపాక కామేశ్వర రావు | 33 |
| 7. | అప్పగింతలు | యమున చింతపల్లి | 38 |
| 8. | అమ్మ మడి చీర | భాగవతుల భారతి | 43 |
| 9. | తూరుపు సింధూరం | కోయిలాడ రామ్మోహన రావు | 46 |
| 10. | కవచం | పి వి ఆర్ శివకుమార్ | 52 |
| 11. | దాతే ఓ విధాత | గంగాధర్ వడ్లమన్నాటి | 59 |
| 12. | మూడో కోణం | పి యస్ ఎం లక్ష్మి | 63 |
| 13. | మలి సంధ్య | పెనుమాక నాగేశ్వర రావు | 66 |
| 14. | జారుడు బండ | గండ్రకోట సూర్యనారాయణ శర్మ | 74 |
| 15. | పాము చచ్చింది | పి రాజేంద్ర ప్రసాద్ | 80 |
| | | | |
| VII | కాళీపట్నం రామారావు గారి కథాకథనం పరిచయం | | xii |

# ఇంకా మా జట్టు




సాంకేతిక సహకారం

AgradootWeb
Thought. Design. Commitment.


బొమ్మలు

శ్రీ కోయిలాడ రామ్మోహన రావు

కథా మంజరి
పది కథల సమాహారం



# కృతజ్ఞతలు



## SPONSORS

## ఈ సంచికకు ఆర్ధిక సహకారం

## OF THE ISSUE

- ✡ శ్రీమతి & శ్రీ బాడిశ హనుమంతరావు గారు
- ✡ శ్రీ సూరిభట్ల కె ఆర్ కె ప్రసాద్(రాంబాబు) గారు
  మరియు శ్రీమతి రాధా రమణి గారు
- ✡ శ్రీ పున్నమరాజు శ్రీ హరనాథ్ గారు మరియు
  శ్రీమతి సరోజ గారు
- ✡ జయంతి వారి కుటుంబం



# కథామంజరి

## దీపావళి కథల పోటీ : బహుమతులు పొందిన కథలు

| బహుమతి | మొత్తం | కథ | రచన |
|---|---|---|---|
| మొదటి బహుమతి | 5,000/- | జీవన పోరాటం | జాస్తి రమాదేవి |
| రెండవ బహుమతి | 3,000/- | దిశా నిర్దేశం | గంటి రమాదేవి |
| మూడవ బహుమతి | 2,000/- | ఘోష | పొత్తూరి విజయలక్ష్మి |
| ప్రత్యేక బహుమతి | 500/- | ఒకరికి ఒకరు | పక్కి శివ ప్రసాద రావు |
| ప్రత్యేక బహుమతి | 500/- | ప్రాప్తమున్న తీరానికి | ఎం.ఎ. పద్మనాభరావు |
| ప్రత్యేక బహుమతి | 500/- | సబ కో సమ్మతిదే భగవాన్ | రాపాక కామేశ్వరరావు |
| ప్రత్యేక బహుమతి | 500/- | అప్పగింతలు | యమునా చింతపల్లి |
| ప్రత్యేక బహుమతి | 500/- | అమ్మ మడి చీర | భాగవతుల భారతి |
| ప్రత్యేక బహుమతి | 500/- | తూరుపు సింధూరం | కోయిలాడ రామమోహనరావు |
| ప్రత్యేక బహుమతి | 500/- | కవచం | పి.వి.ఆర్. శివకుమార్ |
| ప్రత్యేక బహుమతి | 500/- | దాతే ఓ విధాత | గంగాధర్ వడ్లమన్నాటి |
| ప్రత్యేక బహుమతి | 500/- | మూడో కోణం | పి.ఎస్.ఎం. లక్ష్మి |
| ప్రత్యేక బహుమతి | 500/- | మలి సంధ్య | పెనుమాక నాగేశ్వరరావు |
| ప్రత్యేక బహుమతి | 500/- | జారుడు బండ | గండ్రకోట సూర్యనారాయణ శర్మ |
| ప్రత్యేక బహుమతి | 500/- | పాము చచ్చింది | పి. రాజేంద్రప్రసాద్ |

ఇవికాక మరో 20 కథలు సాధారణ ప్రచురణకు తీసుకోబడ్డాయి. ఆయా రచయితలకు నేరుగా మెయిల్ ద్వారా తెలియచేయడం జరుగుతుంది.

ఈ కథల పోటీలో ఉత్సాహంగా పాల్గొని, కథల పోటీని అనూహ్యంగా జయప్రదం చేసిన రచయిత(త్రి)లకు కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాం.

**కథామంజరి బృందం**

# దీపావళి కథాకీయం....



దీపావళి అనగానే పాతరోజులు గుర్తుకు వచ్చి, దీపావళి ప్రత్యేక సంచికలు కళ్ల ముందు మెదలాడాయి. ఎంతోమంది ఆనాటి ప్రఖ్యాత కథకుల కథలతో, రంగు రంగుల పేజీలతో సర్వసుందరంగా ముస్తాబై వచ్చే ఆ సంచికలను, భద్రంగా దాచుకునేవారు. దీపావళి పండగకి టపాసులతో పాటు, ఈ ప్రత్యేక సంచికలకు ప్రత్యేక స్థానం ఉండేది. ఆ సంచికలను ముందుగానే ఏజెంట్ల దగ్గర బుకింగ్ చేసుకునేవారు. ఆ స్ఫూర్తితోనే "కథా మంజరి" దీపావళి ప్రత్యేక సంచిక తీసుకురావాలని అనుకుని, ఆ సందర్భంగా "దీపావళి కథల పోటీ" నిర్వహించాలాని అనుకుని, ఆ ప్రయత్నాలు మొదలుపెట్టాం. పోటికి ఊహించిన స్పందన కంటే, ఎక్కువ స్పందనే వచ్చింది. రచనా వ్యాసంగంలో ఉన్న అన్ని తరాల రచయితలు ఉత్సాహంగా పాల్గొనడం ఆనందాన్ని ఇచ్చింది. అయితే రాసిలో ఉన్నా, వాసిలో లేవనే ఓ చిన్ని అభిప్రాయాన్ని .. ఈ కథలను ఎంపికలో సహకరించిన పెద్దలు వ్యక్తపరచడం నిజమే అనిపించింది. కథల ఎంపిక ప్రక్రియలో కాస్త ఇబ్బంది పడటం మాట ఎలావున్నా, తెలుగు కథకులకు, కథలకు లోటు లేదనే విషయం మాకు ఉత్సాహం ఇచ్చింది. ఎన్ని కథలు వచ్చాయనే విషయం ప్రస్తావించడం లేదు గాని, నూటఏభై మంది కొత్తా, పాతా రచయిత (త్రి)లు ఈ కథాయజ్ఞంలో పాల్గొనడం ఆనందాన్ని ఇచ్చింది.

ఈ యజ్ఞంలో కొన్ని ఇబ్బందులు కూడా అంతర్జాల విషయంలో చూసాం. చాలామంది రచయితలు వారి కథల్ని డిటిపి సెంటర్లో టైపు చేయించడం, ఆ సెంటర్లో ఉన్న నిపుణులు, వారికి వచ్చిన, నచ్చిన రీతుల్లో, ఫార్మేట్ లలో టైపు చేయడం, తప్పులు కూడా దిద్దకుండా అలాగే ఆ సెంటర్ వారి ఈ-మెయిలు ద్వారానే మాకు పంపడం జరిగింది. ఇక కథలలో శిల్పం మాట అలావుంచితే, కథల రూపమే కనబడని కథలు, కామాలు ఫుల్ స్టాపులు వగైరాలు లేకుండా వచ్చాయి. ఒకవేళ అవన్నీ సరి చేసి పంపినా సరే, మాకు చేరేసరికి వాటి రూపాలు అంతర్జాల మాయలో మారిపోవడాలు .. వంటి ప్రధానమైన ఇబ్బందులు కనబడ్డాయి. ఇక న్యాయనిర్ణేతలు అన్నట్టు .. ఎత్తుగడ, కథనం, శైలి, చాలా కథల్లో చదివించేటట్టు లేవు. కొండకచో .. కథ చెప్పినట్టు రాయడం, కథ ద్వారా ఏం చెప్పాలో చెప్పలేక పోవడం, సహజత్వానికి దూరంగా ఇతివృత్తాలు, పేలవంగా సాగిన వర్ణనలు, సంభాషణలే లేకుండా కథ చెప్పడం .. వంటి విషయాలు న్యాయనిర్ణేతల దృష్టిలో పడ్డాయి. అయితే వచ్చిన వాటిలో బహుమతులు ఇవ్వడం ఓ సాహసమే అయినా,

తెలుగు కథని నిలబెట్టి మంచి కథలని రేపటి తరానికి అందించాలనే మా సంకల్పంలోమరో ఆలోచనకి తావివ్వలేదు.

అందుకే, ఉత్సాహంగా కథలు రాస్తున్నవారికి, రాయదలచుకున్న వారికీ ఉపయోగకరంగా ఉంటుందనే ఆలోచనతో, ఈ సంచికలో కథలతో పాటు దీపావళి కానుకగా .. కారా మాష్టారి "కథాకథనం" వ్యాసాల్లోంచి కొన్ని భాగాల్ని అందిస్తున్నాం. ఇవి తప్పకుండా ఉపయోగకరంగా ఉంటుందని ఆశిస్తూ, వీటిని మా పత్రికలో ప్రచురించడానికి అనుమతి ఇచ్చిన 'కథానిలయం' నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం.

టపాసులలో .. కొన్ని రంగుల హరివిల్లులతో నేత్రానందం కలిగిస్తాయి, మరికొన్ని శబ్దాలతో కర్ణకఠోరంగా ఉంటాయి. ఇంకొన్ని టపాసులు చురకలు పెడతాయి, కొన్ని కేరింతలు కొట్టిస్తాయి. అయితే వీటన్నిటిని కలిపి ఆస్వాదించడమే మన కథా దీపావళి ప్రత్యేకత. చెయ్యి కాలిందని దీపావళి పండగని మానేస్తామా! మన పండగల ప్రత్యేకత అదే!! అదే స్ఫూర్తితో మరో అడుగు ముందుకు వేస్తూ...

**పాఠకులకు, రచయితలు, రచయిత్రులకు, శ్రేయోభిలాషులకు, అభిమానులకు..**

## దీపావళి శుభాకాంక్షలు!

కథా మంజరి
పది కథల సమాహారం

## ఈ నెల విశిష్ట అతిథి



## శ్రీ ఆదూరి వెంకటసీతారామ మూర్తి

"జీవిత రహస్యం శోధించడంలో నాలుగో పరిణామం సాహిత్యం అని మన పెద్దలు చెప్పేరు. అలా..  బాహ్యా అంతరంగ జగత్తుల సమన్వయం ద్వారా జీవిత వైచిత్రిని శోధించి వ్రాయగల కథకుడు .. చిన్ని కథతోనే ఒక్కొక్క జీవిత సత్యాన్ని మనస్సుకు హత్తుకునే విధంగా, పుస్తకం మూసినా ఆలోచించే విధంగా వ్రాయగలగే రచయిత.." అంటూ మన ఆనాటి దేశ ప్రధాని కీ.శే. పి.వి. నరసింహారావు గారికి సమాచార కార్యదర్శిగా, తిరుపతి దేవస్థానం ఇ.ఓ.గా పనిచేసిన కీ.శే. పి.వి.ఆర్.కె. ప్రసాద్ IAS గారు మెచ్చుకున్న రచయిత శ్రీ ఆదూరి వెంకట సీతారామ మూర్తి.   “శ్రీ ఆదూరి కథలలో కనిపించేది.. రచయిత నిజాయితి. ఏ కథా తనకు తెలియని విషయం మీద రాయలేదు. ప్రతి కథా ఇంచుమించు ఒక నాటిక చూస్తున్నట్టే .. పాత్రలు మన కళ్ళ ఎదుట కనబడతాయి. ఎటువంటి భాషా భేషజాలకూ పోకుండా స్పష్టంగా కథలు రాయగలడం అయన ప్రత్యేకత!” అంటూ ప్రఖ్యాత కథకుడు కీ.శే. బలివాడ కాంతారావు గారు కితాబు ఇచ్చారు.  ఇలా ఎందరో మహానుభావుల ప్రశంశలు అందుకోడానికి ప్రధాన కారణం .. కథ ఎత్తుగడ నుంచి ముగింపు వరకు  పాఠకుల్ని కదిలించే మద్యతరగతి కుటుంబ కథలను హత్తుకునేలా రాయడమే శ్రీ ఆదూరి వారి ప్రత్యేకత.

“మీకు కథలు రాయాలనే తలపు రావడానికి స్ఫూర్తి ఎవరని” అని అడిగితే “ఏవరు లేరు. మా ఇంట్లో పుస్తకాలు పుష్కలంగా ఉండేవి.  వాటిని చదివే అలవాటు తల్లితండ్రులకు ఉండేది. ఆ అలవాటే నాకు

వచ్చింది. రెండోది, నేను పెరిగిన వాతావారణం. మధ్యతరగతి కుటుంబాలలో ఎదురుగా జరుగుతున్న సంఘటనలకు చలించి, ఎవరికీ చెప్పుకోవడానికి మనసు రాక, వాటికి అక్షర రూపం ఇవ్వడం అలవాటు చేసుకుని, పంతొమ్మిదవ ఏటనే రచయితగా అడుగు పెట్టాను!" అంటూ మధ్య తరగతి కుటుంబంలో పుట్టడం ఓ అదృష్టం అంటారు శ్రీ ఆదూరి.

"కథా సాహిత్య ప్రపంచంలో ఒక ఆరాధనా భావంతో అడుగు పెట్టి, సాహిత్యమూ, జాతి, సంస్కృతీ అవిభాజ్యాలనే ఒక వెన్నెల బాటలో పయనిస్తున్న పాదచారి" అంటారు తెలుగు కథలకు రారాజు శ్రీ మునిపల్లె రాజు గారు.

"కథలు ఎలా రాయాలో చెప్పే పాఠ్యపుస్తకాలు ఏమి ఉండవు. మన మధ్య, మన ఎదురుగా జరిగే విషయాల్లోనే కథాంశాలు కోకొల్లలుగా ఉంటాయి. అందులోనూ .. ఏ కాలంలో చూసినా, మధ్య తరగతి కుటుంబాల్లో మనసుల్ని కుదిపే విషయాలు కనబడతాయి. కారణం అతను ఎవరితోనూ చెప్పుకోలేడు. అలా అనీ ఊరుకోనూ లేడు. కారణం ఒక్కటే .. ఏం చేయలేని నిస్సహాయ స్థితిలో పెరుగుతూనే ఉంటాడు. ఓ రకంగా అడకత్తెరలో పోకచెక్కలాంటి వాడు మధ్య తరగతి మనిషే!" అంటారు శ్రీ ఆదూరి వారు. మధ్య తరగతి మనిషంటే ఆర్కె లక్ష్మణ్ గారికి చాలా ఇష్టం, అందుకే ఆయన కార్టూనులలో 'కామన్ మాన్' ఉంటాడు. అలా శ్రీ ఆదూరి వారి కథలలో "కామన్ మాన్" జీవితాలే మనకు సాక్షాత్కారిస్తాయి. మన చూట్టూ కనబడే సంఘటనలే కనబడతాయి. సగటు మనషుల జీవితాలు గురించి స్వచ్ఛంగా, స్వేచ్ఛగా, కుడి ఎడమలకు జారిపోకుండా మానవతా విలువలను చాటిచేప్పే శైలితో శ్రీ ఆదూరి వారు 'రాసి'లో కాకుండా 'వాసి' గానే కథలు రాసారు. శ్రీ సీతారామ మూర్తి గారికి రావిశాస్త్రి, మధురాంతకం రాజారాం, మునిపల్లి రాజు, ముళ్ళపూడి వెంకటరమణ గార్ల రచనలంటే ఇష్టం ఒక్కటే కాదు, గౌరవం కూడాను! నూటాఎనభై కథలు, నలభై కవితలు, రెండు నవలలు, రెండు నవలికలు, ఓ నాటకం, పాతిక రేడియో నాటికలు శ్రీ మూర్తి గారి కలం నుంచి జాలువారాయి. వాటిలో చాలా కథలు హిందీ, ఇంగ్లీషు, తమిళం, ఒరియా భాషల్లో కూడా అనువదింపబడ్డాయి. ఇక ఐదు కథాసంపుటాలు, నాలుగు నవలలు పుస్తకాలుగా వెలువడ్డాయి. అలనాటి "యువ" మాసపత్రిక నుంచి దాదాపు అన్ని పత్రికలలో వీరి కథలకు బహుమతులు వచ్చాయి. వీరి నవల "తీపి గురుతు" మీద పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఎమ్.ఫిల్. పట్టా కోసం పరిశోధన జరిగింది. అలాగే మద్రాసు విశ్వవిద్యాలయం, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం ఆధ్వర్యంలో వీరి కథలపై పరిశోధనలు జరిగాయి. అన్నింటికన్నా మిన్నగా చెప్పుకోవలసిన విషయం ఏమిటంటే .. శ్రీ ఆదూరి వారికి చక్రపాణి అవార్డు తెచ్చిన "శిల్పి" కథను మహరాష్ట్ర స్టేట్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ వారి ఐదవ తరగతి "కుమారభారతి" లో పాఠ్యాంశంగా వేసుకున్నారు. ఈ పుస్తకంలో అలనాటి ఎర్రాప్రగడ మొదలు, కందుకూరి వీరేశలింగం, బోయి భీమన్న, దివాకర్ల వేంకటావధాని, గోపీచంద్, సినారె.. మొదలగు విశ్వవిఖ్యాత పండితుల పాఠాల నడుమ, ఈ 'శిల్పి' కథ కూడా స్థానం పొందడం ముదావహం.

కథా మంజరి
పది కథల సమాహారం

ప్రముఖ గేయ, కవిత, కథా రచయిత్రి కీ.శే. ఆదూరి సత్యవతీదేవిగారు సీతారామమూర్తి గారి సతీమణి. ఆవిడ రచించిన పలు గేయలు, కవితలు, కథలు సంపుటాలుగా వెలువడ్డాయి. సత్యవతీదేవి గారు లలిత గీతాలు రాయడమే కాకుండా స్వయంగా స్వరపరిచి, లలితసంగీత అభిమానులలో మంచి పేరు గడించారు. వారి పాటలు నేటికి అజరామాలే!

శ్రీ ఆదూరి వారు విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ లో అకౌంట్స్ ఆఫీసరుగా పదవి విరమణ చేసి, పూనే, హైదరాబాదులలో ఉంటున్న వారి అబ్బాయిలతోనే కాకుండా, విశాఖతో ఉన్న అనుబంధాన్ని కూడా వదలక, అటూ ఇటూ ప్రయాణాలు చేస్తుంటారు.

మా అభ్యర్ధనని కాదనక, దీపావళి కథలపోటికి న్యాయనిర్ణేతగా వ్యవహరించి, ఎంతో కాలాన్ని వెచ్చించి, అనూహ్యంగా వచ్చిన కథలను ఓపిగ్గా ఎంపిక చేయడంలో మాకు సహకరించి, అమూల్యమైన సలహాలు అందచేసినందులకు "కథామంజరి" కృతజ్ఞతలు తెలుపుకుంటూ... వారి సహాయ, సహకారాలు తెలుగు కథకులకు ఎల్లప్పుడూ ఉంటాయాని ఆశిస్తూ .. స్వస్తి!

**కథా మంజరి**

***0***

కథా మంజరి
పది కథల సమాహారం

# కథా మార్గదర్శి



## శ్రీ మునిపల్లె రాజు గారు

తెలుగు కథ అంతర్జాతీయ ఖ్యాతిని పొందిన సంగతి తెలిసినదే. అటువంటి ప్రత్యేక గుర్తింపు లేకపోయినా, ఆ స్థాయిలో మనం గర్వంగా చెప్పుకోదగ్గ కథలు తెలుగులో మరికొన్ని కూడా లేకపోలేదు. ఏటా అటువంటి కథల్ని నిష్పాక్షికంగా ఎంచి ఆంగ్లంలోకి, ఇతర భారతీయ భాషలలోకి అనువదించి పదిలపరచే ప్రచురణ కర్తలు తగినంత మంది మనకు లేకపోవడం మన దురదృష్టం.

దాదాపు నాలుగు దశాబ్దాలుగా తెలుగు కథతో నాకున్న కొద్దిపాటి పరిచయాన్ని బట్టి చూస్తే, కథకుండవలసిన లక్షణాలతో బాటు పాఠకుల్ని ఆలోచింపచేయగల ఎన్నో మంచి కథలు, కొన్నయినా గొప్ప కథలు నా దృష్టికి వచ్చినవి ఉన్నాయి.

కథ సాంఘిక సమస్యలను ప్రతిబింబింప చేయగలదేమో గాని, పరిష్కరించి సమూల మార్పులు చేయగలదో లేదో చెప్పడం కష్టం. అయితే, సగటు మనిషి వ్యక్తిగత వికాసానికి, అభ్యున్నతికి, మానసికానందానికి కొంత వరకు తోడ్పడగలదని నమ్ముతాను. మంచి కథ మనసును చక్కదిద్ది, అలోచింప చేయడంలో పదిమంది మంచి మిత్రులకు సమానం కాగలదని విశ్వసిస్తాను.

నా కథారచనకు నాకు నా చుట్టూ ఉన్న సమాజం, మనుషులే నాకు స్ఫూర్తి. వివిధ వర్గాలకూ, వర్ణాలకూ చెందిన మనుషులూ, వారి వారి సంక్లిష్ట జీవితాలు – ఆయా వ్యక్తుల పట్ల నాలో కలిగిన భావాలూ, పేదరికం, ఆకలి, అవినీతి మొదలగు సమస్యలూ నన్ను ప్రేరేపించి రచనలు చేయడానికి దోహదపడ్డాయి.

గుప్పెడు గింజల కోసం, కాసిన్ని పైసల కోసం ఏరాడ కొండెక్కి, దిగి, పడవలో సముద్రపు పాయను దాటి, పట్నం వచ్చి, కరివేపాకు అమ్ముకునే ఆడపిల్లల జీవితాలు చూసి, ఎన్నాళ్ళో గమనించి నేను రాసిన కథలాంటి రచన "బ్రతుకు" నా తొలి రచన. అచ్చులో వచ్చిన మూడో కథ. కృష్ణా పత్రికలో అచ్చయ్యింది . ఆ రోజుల్లో తెలుగులో వచ్చే వార, మాస పత్రికలూ, ఇతర కథాసాహిత్యం కొని చదివే స్తోమత లేని మావంటి మధ్య తరగతి వారికి విశాఖలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం ఒక వరమయ్యింది.

1936-45 మధ్యకాలంలో వెలువడిన తొలినాటి కథలు రాసిన చలం, శ్రీపాద, బుచ్చిబాబు, పాలగుమ్మి పద్మరాజు నుండి నా ముందు తరం రచయితలయిన రావిశాస్త్రి, లత, ముళ్ళపూడి, మధురాంతకం రాజారాం, వాకాటి, బలివాడ, మునిపల్లె రాజు, కేశవరెడ్డి వరకూ ఎంతో మంది గొప్ప రచయితల కథలను చదివే అవకాశం నాకు కలిగింది మా విశాఖ గ్రంథాలయం లోనే.

నేను చదివిన రచయితలలో నాకు నచ్చిన రచయితలు ఎందరో ఉన్నారు. వారంతా నాకు గురుతుల్యులు, మార్గదర్శకులూనూ. అలా నాకు నచ్చిన గొప్ప రచయితలలో కొందరితో నాకు వ్యక్తిగత పరిచయాలున్నాయి. అది నా అదృష్టం.

అటువంటి రచయితలలో మాట్లాడే మనోనేత్రంగా పేర్కొనదగిన మునిపల్లె రాజు గారు ఒకరు. వారి కథ అక్షర శిల్పాలు. చక్కని శైలి తో సృజన కథనా చిత్రాలు చిత్రించారాయన. వారు రాసిన యశోద కొడుకు, వారాల పిల్లాడు, కస్తూరి తాంబూలం, విశాఖ కనకమహాలక్ష్మి, సవతి తమ్ముడు, ఒక బాకీ తీరలేదు వంటి కథలను మంచి, గొప్ప కథలుగా చెప్పుకోవచ్చును.

"తెలుగు కథాసాహిత్యంలో మునిపల్లె రాజు గార్ని ఎరుగని వారుండరు. కొన్నేళ్లపాటు కథా రచనకు దూరంగా తెరమరుగున ఉండిపోయిన ఉత్తమ శ్రేణి కథారచయిత ఆయన. పాశ్చాత్యకథా శిల్పాన్ని కరతలామలకం చేసుకుని, భారతీయ తాత్విక చింతనా శైలిలో గొప్ప సంయమనంతో తెలుగు కథను మలిచారాయన. వారి కథల్లో ఏ కథ చదివినా అందులో విస్తృతమైన జీవిత చిత్రణ కనిపిస్తుంది. భాషపై సాధికారత, అపారమయిన జీవితానుభవం, కథానాకౌశలం, కథాశిల్పమర్మజ్ఞత – ఈ సుగుణాలన్నీ ఒక

చోట చేరితే ఎటువంటి రచనలు రావడానికి వీలుంటుందో ఆయన కథలు చెబుతాయి" అన్నారు సుప్రసిద్ధ కథకులు మధురాంతకం రాజారాం గారు ఒక సందర్భంలో.

రాజు గారు గొప్ప మానవతావాది. ఇజాలకన్నా ఆయనకు మనిషి ముఖ్యం. మానవత్వం ఆయన ధ్యేయం. విశ్వజనీనత ఆయన కథలకు ప్రాణం.

"ఒక బాకీ తీరలేదు" అనే కథలో మనిషి అంచెలంచెలుగా ఎన్ని సోపానాలెక్కి, ఎన్ని శిఖరాలను అధిరోహించినా తనకు దారి చూపి, ఆసరాగా నిలచిన తొలి మెట్లను మరిచిపోకూడదని హృద్యంగా చెప్పాడు. ఈ కథ .. డాలర్ నోట్ల చప్పుళ్లలో మునిగి, ముసలి తల్లితండ్రుల పిలుపులనీ, తోడబుట్టిన వారి ఎదురు చూపులనీ మనసులోకి రానీయక, తమ విజయానికి తామే కారణమనుకుంటూ, విద్యాధికులు విర్రవీగిపోతున్న ఈ రోజుల్లో, తడి ఆరని ప్రేమాభిమానాలతో, కొన్నేళ్ళ క్రితం తనను ఆదరించిన ఒక సోదరి సమానురాలయిన కమలమ్మను కలుసుకోవటం కోసం మురళి అనే డాక్టర్ పడిన తపన, ఆమెపై చూపిన కృతజ్ఞతా భావం, నిజాయితీ పాఠకుల్ని ఆలోచింపచేస్తుంది.

ఇతివృత్తం చిన్నదే అయినా కథ చెప్పే తీరు గొప్పగా ఉంటుంది. రచయిత చెప్పిన దానికన్నా పాఠకుడి ఆలోచనకు విడిచిపెట్టిందే ఎక్కువ.

మునిపల్లె వారు సాంప్రదాయవాది. మూఢాచారాలకు వ్యతిరేకి. తాత్వికుడు. లోకాన్ని కాచి వడబోసిన లోకజ్ఞుడు. 'అస్తిత్వనదం ఆవలి తీరాన' శీర్షికతో ప్రసిద్ధికెక్కిన వారి 'మాజికల్ రియలిజం కథలు' 2006 సంవత్సరపు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును అందుకున్నాయి.

'మునిపల్లె రాజు కథలు', 'పుష్పాలు-ప్రేమికులు-పశువులు', అస్తిత్వనదం ఆవలి తీరాన, దివో స్వప్నాలతో ముఖాముఖీ; జర్నలిజం లో సృజనరాగాలు; సాహితీ మంత్ర నగరిలో సుస్వరాలు – వంటి రచనలు వర్ధమాన కథారచయితలకు మార్గదర్శకాలు.

**ఆదూరి వెంకటసీతారామ మూర్తి**

***0***

## మొదటి బహుమతి



# జీవన పోరాటం

### జాస్తి రమాదేవి

## మొదటి బహుమతి



# జీవన పోరాటం

## జాస్తి రమాదేవి

శేషయ్య దిగులుగా ఇంటి చూరువైపు చూస్తున్నాడు. అక్కడ కొన్ని రోజులుగా రెండు పిచ్చుకలు, ఒక్కో పీచు మోసుకొచ్చి గూడు కట్టుకుంటున్నాయి.

తాత కట్టించిన ఇల్లు. ఆ ఇంట్లో తన బాల్యం ఆనందంగా గడిచింది. ఆ ఇంటితో ఎన్నో జ్ఞాపకాలు పెనవేసుకుని ఉన్నాయి. అన్న,అక్క తర్వాత పుట్టిన వాడుగా  గారాబంగా పెరిగాడు. తాత వీరాచారికి తన తండ్రి ఒక్కడే సంతానం. అందుకే మనవల్ని ప్రేమగా చూసుకునేవాడు. తనంటే మరీ గారాబం చేసేవాడు. ఎప్పుడూ తను ఆయన తొడపైనే కూర్చొని, ఆయన కబుర్లు వినేవాడు. ఊళ్ళో ఉన్న మగ బడిలో ఐదు వరకూ చదివేడు. అప్పటికే అన్నలు ముగ్గురూ, వృత్తిలో జొరబడ్డారు. తనకీ నేర్చుకోవాలని ఉండేది.

"నీకప్పుడే ఏం తొందరొచ్చిందిరా! బంగారం పనంటే ఎన్ని మెలుకువలు తెలుసుకోవాలి. సున్నితమైన పని మనది. మనసు పెట్టి నేర్చుకోవాలి. ముందు నువ్వు ఏ పనిముట్టు దేనికి వాడాలో నేర్చుకోవాలి. కుంపట్లో బొగ్గు రాజెయ్యడం నేర్చుకో ... తర్వాత నెమ్మదిగా నేర్చుకుందువుగాని!" తాత తనని ముద్దు పెట్టుకుని చెప్పాడు.  తర్వాత ఏ పనిముట్టు దేనికి వాడాలో రోజూ పాఠంలా నేర్పేవాడు.

తమ కుటుంబం అంటే ఊళ్ళో గొప్ప పేరుండేది. పనిలో నిజాయితీ, వస్తువులో నాణ్యత, వస్తువు పాతదై పోయినా రాళ్ళ మెరుపు తగ్గదని, ఆభరణాలు చిన్నవైనా, పెద్దవైనా చెప్పిన సమయానికి అందిస్తారని, మనుషులకు కాలం చెల్లిపోవచ్చు గానీ, వీరాచారి బంగారం చేతలో తేడా రాదని ... అంత గొప్పగా చెప్పుకునే వారు.  బంగారంలో ఎంతవరకూ రాగి కలపితే, ఆ వస్తువు బాగుంటుందో తాత దగ్గర నేర్చుకున్నాడు తను. ఏ వృత్తి కైనా నిజాయితీ, మెలుకువ ఉండాలి అనేవాడు.

చంటిబిడ్డ చెవులు కుట్టడానికి తాత దగ్గరకే వచ్చేవారు. ఆ వేడుక ఓ పండగలా జరిగేది. పెళ్ళి కుదిరి తాళి బొట్టుచేయాలన్నా తాత చేతుల మీదే జరిగేది. మంగళ సూత్రం తీసుకెళ్ళడానికి, తమింటికి మేళతాళాలతో

పెళ్ళివారు వచ్చి, నాయనమ్మకి, తాతకి బట్టలు పెట్టి, తీసుకెళ్ళేవారు. బంగారు వస్తువు నాణ్యతని తాత చూడగానే చెప్పేసేవాడు. పాత బంగారం కొనాలన్నా, అమ్మాలన్నా తాత దగ్గరే చూపించుకునేవారు. చేతి నిండా పనుండేది. కొట్టు ఎప్పుడూ తెరిచే ఉండేది.

తనకి పద్దెనిమిది ఏళ్ళు వచ్చేసరికి, పనిలో మెలకువలు నేర్చుకున్నాడు. తాత 'అబ్బే ఇంకా సరిగ్గా రాలేదు' అనేవాడు. తను పౌరుషంతో ఇంకా బాగా నేర్చుకున్నాడు. తాత, తండ్రి, అన్న అసలు ఖాళీ అంటే ఏంటో ఎరగనంతగా పని చేసేవారు. అన్న లాగానే తనకీ ఇరవై ఏళ్ళు వచ్చేసరికి పెళ్ళయిపోయింది. అన్న అత్తగారింటికి ఇల్లరికం వెళ్ళాడు.

స్వర్ణకారుల వృత్తి సున్నితమైనది. ఏ మాత్రం అతుకు పడక పోయినా, ఆ ఆభరణం ముక్కలైపోతుంది. ఓ రాయిని ఆభరణంలో మలచడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోకపోతే, అది పగుళ్ళు వచ్చి ముక్కలై, రాళ్ళలో రాయిలాగే మిగిలి పోతుంది. అలాగే బంగారం సరిగ్గా కాల్చడం, కడ్డీగా మారిన బంగారాన్ని, తీగ తీసి చుట్టడం, వస్తువుకో ఆకారాన్ని ఇవ్వడంలో పని ముట్లను సున్నితంగా ఉపయోగించడం, ఎప్పటికప్పుడు కొత్తకొత్త డిజైన్లు తయారు చెయ్యడంలో అందరి మన్ననలు పొందడానికి, ఎంత కష్టపడాలో నేర్చుకున్నాడు.

తాతను, తండ్రిని మించిన పనోడని పేరు తెచ్చుకున్నాడు. శేషయ్య వస్తువు చేస్తే తిరుగేలేదు అనుకునే స్థాయిని అందుకున్నాడు. కృష్ణ ఒక్కడే తన సంతానం. వాడిని తనంతటి వాడిని చెయ్యాలని ఆశ పడ్డాడు. భార్య అనసూయ తన కొడుకు చదువుకుని ఉద్యోగం చెయ్యాలి అనేది.

"మన పని ఉండగా ఎవరి ముందో చేతులు కట్టుకుని నిలబడి, నెల జీతం తీసుకునే గతి నా కొడుక్కి లేదు!" అన్నాడు తను. చిన్న చిన్న గొడవలు పెద్దవిగా మారి, కొడుకుని తీసుకుని పుట్టింటికి వెళ్ళిపోయింది అనసూయ. ఊళ్ళో నలుగురు నాలుగు రకాలుగా అనుకోడం ఇష్టంలేక, కృష్ణని చదివిస్తానని కాపురానికి తీసుకొచ్చాడు.

నెట్టుకుంటూ నెట్టుకుంటూ కృష్ణ పది చదివేసరికి, నా వల్ల కాదని చతికిల పడ్డాడు. తన దగ్గర చిన్న చిన్న పనులు నేర్చుకుంటూ, కాలం గడిపేవాడు. వాడికి చదువుతో పాటు పని కూడా అబ్బలేదు. కృష్ణకి పెళ్ళి చేసాడు. ఏడాది తిరిగే సరికి వాడికీ ఓ కొడుకు పుట్టాడు. రెండో ఏడాదిలో కూతురు పుట్టింది. కుటుంబం పెరిగింది. ఖర్చులు పెరిగాయి. తరతరాలుగా వృత్తిని దైవంగా భావించారు తప్ప, ఏనాడూ రూపాయి వెనకేసుకోవాలని అనుకోలేదు. కాలం అలాగే గడిచిపోతుంది అనుకున్నారు. ఇప్పుడు తనకే పని లేదు. కొడుకుకి ఏం పని చూపించగలడు. రోజులు గడవడం కష్టమైపోతోంది.

కథా మంజరి
పది కథల సమాహారం

జనం పాత తరం ఆభరణాలు కాదని, కొత్త డిజైన్లు అంటూ బస్తీల్లో బంగారం షాపుల్లో వస్తువులు బాగున్నాయంటున్నారు. మిషన్ చెక్కుళ్ళ నాజూకుతనం ఇష్టపడుతున్నారు. జ్యూయలరీ షాపుల వర్తకులు, తమకి పని లేకుండా చేస్తున్నారు. ఎక్కడెక్కడో ఆర్డర్లు ఇచ్చి ఆభరణాలు చేయించకుంటున్నారు. పని తెలిసిన వాళ్ళు ఆ షాపుల ముందు కూర్చుంటున్నారు.

ఏనాడూ మూతపడని బంగారం కొట్టు, ఎవరొస్తారా అని ఎదుచూస్తోంది. పనిముట్లు దిగులుతో చూస్తున్నాయి. అనసూయ కాలం చేసింది. భార్య మరణం తన ఉనికిని మార్చేసింది. కోడలు కమల నోటికి ఎంతొస్తే అంతా అనేసేది. మనవడిని తన దగ్గరికి రానిచ్చేది కాదు. ఎక్కడ పనికి అలవాటు చేస్తాడో అని. కృష్ణని చేతకాని వాడనేది. వాడిని వెనకేసుకొస్తే ఆమెకు నచ్చేది కాదు. కృష్ణ కుటుంబ భారాన్ని మోయలేక, పట్నందారి పట్టాడు. చూస్తూ ఉండటం తప్ప, తను ఏమీ చెయ్యలేక పోతున్నాడు. ఊరు పలచబడి పోతోంది. పిల్లల చదువులనీ, ఉద్యోగాలనీ, పట్నాల వెంట పరిగెడుతుంటే, రైతులు వ్యవసాయం చెయ్యలేక పోతున్నారు. ఒకప్పుడు రెండొందల గడపలున్న ఊరు, ఇప్పుడు యాభై గడపలుగా మిగిలింది. వృత్తులకు వారసులు లేకుండాపోయారు. ఏదో అప్పుడప్పుడూ తప్ప తన చేతికి పని రావడంలేదు. కృష్ణ కొడుకు హైదరాబాద్ లో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. అక్కడికి వెళ్ళిపోదాం అంటున్నాడు కృష్ణ .

తన బాల్యం యవ్వనం గడిపిన ఆ ఇంటిని, ఆ జ్ఞాపకాలను వొదిలి రాలేనన్నాడు. "ఇల్లు అవసాన దశలో ఉంది. ఊరు పేరుకు మాత్రమే ఉంది. ఈ శ్మశానంలో మళ్ళీ వెనకటి రోజులు వస్తాయని కలలు కంటూ కూర్చుంటావా?" అంటూ తన కొడుకు ఎద్దేవా చేస్తున్నాడు.
ఇల్లు ఓ పక్కనుంచి పడిపోతూ ఉంది. గోడల్లోంచి మొక్కలు మొలుచుకొస్తున్నాయి. తాత ఉన్నప్పుడు కళకళలాడుతూ ఉన్న ఇల్లు ఇప్పుడు కళావిహీనంగా ఉంది.
రోజూ కొట్టు తీసి కూర్చుంటాడు. పనిముట్లని శుభ్రం చేస్తాడు. పూజిస్తాడు. కళ్ళ కద్దుకుంటాడు. ఎవరో ఒకరు వచ్చి, పాతబడిన వస్తువుకు మెరుగు పెట్టమనో, అతుకు ఊడింది సరి చెయ్యమనో, వస్తువులు తాకట్టు పెట్టాలి తూకంవెయ్యమనో, పని చేయించుకుని పదో పరకో చేతిలో పెడతారు. ఒకప్పటి ఆదరణా లేదు. కూలీ లేదు.

కొడుకు తనతో ఉండలేక, వెళ్ళలేక ఇబ్బంది పడుతున్నాడు. కోడలు అవకాశం దొరికినప్పుడల్లా మాటలతో గుండెని తూట్లు పొడుస్తుంది . తను వాళ్ళకో అడ్డు అయిపోయాడు.
వారం క్రితం ఇద్దరు మనుషులు వొచ్చి, ఇల్లు చూసి వెళ్ళారు. ఎందుకో తనకి అర్థం కాలేదు .
"ఇల్లు పడిపోతోందని అమ్మకానికి పెట్టాను. కలప కోసం కొనుక్కుంటాం అన్నారు. ఇల్లు పడేసి కలప తీసుకుంటారు!" అన్నాడు కృష్ణ.

ఇల్లు పాతబడి పోయినా, గుమ్మాలు, తలుపులు, పైన సరంబీ,  అంతా టేకు చెక్కతో చేయించాడు తాత. సింహద్వారం తలుపులపై లక్ష్మీ దేవి తామరపువ్వులో కూర్చున్న బొమ్మ నగిషీలు చెక్కించాడు.  ద్వారంపై రెండు ఏనుగులు తొండాలతో నీళ్ళు చిమ్ముతున్నట్టుండేవి. కొత్తవాళ్ళు ఎవరు వచ్చినా ఆగి అబ్బురంగా చూసి వెళతారు.  జ్ఞాపకాల పొదరిల్లు కూలిపోతోందంటే, ముద్ద గొంతు దిగటం లేదు. కంటికి నిద్ర రావడం లేదు.  ఏదో మూల తాత, అమ్మ, నాన్న, అన్న నిలబడ్డట్టే ఉండేది. భార్యతో గడిపిన జ్ఞాపకాలు, కృష్ణ అడుగులు, పరుగులు, అల్లరి,  మనవడి ముచ్చట్లు,  నిత్యకల్యాణం పచ్చతోరణంలా ఉండే ఇల్లు పడేస్తారంటే, బతికి ఉండగానే చితిమీద పడేసినట్టుంది.

తను ఉన్నన్నాళ్ళయినా ఉంచమని వేడుకున్నాడు. ఆ ఇల్లంటే తనకెంత ఇష్టమో కృష్ణకి తెలుసు.  వాడికేం తక్కువ చేసాడు. తనని పోషించమన్నాడా! తరాలు గడిచిన  ఇంట్లో చివరి రోజులు గడపాలనుకున్నాడు. కొడుకు ఆ కోరిక  తీర్చలేనంటున్నాడు. "ఇల్లు అమ్మేస్తే వస్తానను కుంటున్నావేమో నేను ఈ ఊరు దాటి రాను!" అని పౌరుషం బెదిరించాడు.  'నీ ఇష్టం' అన్నాడు కొడుకు.
వారం రోజులుగా కంటి మీద కునుకు లేదు.  నువ్వెళ్ళిపోతే మా గతేంటి? అన్నట్టు పనిముట్లు దిగాలుగా చూస్తున్నాయి.  పాపం గూడు కట్టుకుంటున్న పిచ్చుకలకి గూడు పడిపోతోందని తెలిదు! ఎన్ని కష్టాలొచ్చినా  కంట తడి పెట్టని శేషయ్య కళ్ళలో నీళ్ళు,  పోటెత్తిన సముద్రపు కెరటాల్లా పొంగుతున్నాయి. అన్నవాటా సగం తనే డబ్బిచ్చి కొనుక్కున్నాడు. తన తర్వాత కృష్ణ ఉంటాడని అనుకున్నాడు. తమ వంశం ఆ ఊళ్ళో ఎప్పటికీ ఉంటుందని కలలు కన్నాడు.  అంతా పగటి కలలా మిగలబోతోంది.

కొన్నవాళ్ళు ఇవాళో రేపో వచ్చి మెడ పట్టుకుని గెంటక ముందే, ఇల్లు దాటాలి. ఊరు దాటి పోవాలి. తను డబ్బును నమ్ముకోలేదు. వృత్తిని నమ్ముకున్నాడు. మనుషుల్నీ, విలువలను నమ్ముకున్నాడు. దైవంకంటే ఎక్కువగా  పనిముట్లని పూజించాడు.   కొడుక్కి ఇవేం పట్టవు.
ట్రంకు పెట్టెలో పనిముట్లు సర్దాడు.   పైన తనకున్న నాలుగు గుడ్డలు సర్దుకున్నాడు.   కొడుకూ కోడలు మంచి నిద్రలో ఉన్నారు. ప్రతి గోడని తాకి కన్నీళ్లు పెట్టుకున్నాడు.  కాలగర్భంలో కలిసి పోయిన పెద్దలకి కన్నీళ్ళతో దణ్ణం పెట్టాడు. తలుపులు దగ్గరేసాడు.  ఇంక ఆ గూడు తనది కాదు. పిచ్చుకల గూడు గుర్తుకొచ్చి దిగులేసింది.  పాపం తనలాగే కష్టపడి గూడు ఏర్పరుచుకుంటున్నాయి.  కళ్ళ ముందు కూలిపోతుంటే ఎంత గోల పెడతాయో!  'ఎగిరి పోండి పాడయిపోయింది గూడు..'  అని చెప్పాలని ఉంది. తన కళ్ళ ముందు తన గూడు పడిపోతుంటే తను చూస్తూ ఊరుకోలేడు.  అందరూ తనవైపు జాలిగా చూసే చూపు భరించలేడు. అందుకే గడప దాటి పోతున్నాడు.

ఊరు దూరమైపోతూ ఉంది. వెనక్కి తిరిగి చూస్తే, ఊరు మధ్యలో తన ఇల్లు ఉరి కొయ్యకి వేళ్ళాడుతున్నట్టు కన్పించింది. కళ్ళలో నీళ్ళు ఉప్పెనలా పొంగుతున్నాయి. మనిషికే అనుకున్నాడు నూరేళ్ళు నిండటం అని... ఇంటికి కూడా ఉంటుందని ఇప్పుడే తెలిసింది.

'శేషూ!' తాత వెనకనుంచి పిలుస్తున్నట్టు వినిపించింది. వెనక్కి తిరిగి చూసాడు. తాత కోపంగా చూస్తున్నాడు.

"ఎక్కడికి బయలుదేరావు శేషూ!"

"గూడు పాడయిపోయింది. రేపోమాపో కూలిపోతుంది. నా కళ్ళముందు ఎవరో ఇంటిని పడేస్తుంటే చూడలేక వెళ్ళి పోతున్నాను!" దిగులుగా అన్నాడు శేషయ్య.

"అది నీ గూడు. దాన్ని బాగు చేసుకునే హక్కు నీకుంది. ఎవరో వచ్చి పడేస్తారని వెళ్ళిపోతావా? అలాంటి వాడివి అన్నకి డబ్బు ఇచ్చి ఎందుకు కొన్నావు? అది నీ ఇల్లు. అమ్మే హక్కు ఐనా, పడేసే హక్కు ఐనా నీకే ఉంటాయి. నీ కడుపున మొన్న పుట్టిన వాడు అమ్మేసానంటే, పిరికోడిలా ఇల్లొదిలి పారిపోతావా? ఎక్కడో కాలం గడిపేస్తావా? ఒక్కసారి పోరాడలేవా? ఇంటి చూరులో గూడు కట్టుకునే పిచ్చుకలని చూడు . గూడు కష్టపడి కట్టుకుంటాయి. ఎవరైనా తీస్తుంటే అరిచి గోలచేస్తాయి. చిన్న పక్షులు అవి. ఆమాత్రం కూడా నువ్వు నీ హక్కుని కాపాడుకోలేవా? నీ గూడు ఎవరో వచ్చి కూలగొడతారని ఇల్లే వొదిలి పోతున్నావు. మన కోసం మనమే పోరాడాలి. అమ్మినా, పడేసినా అది నీహక్కు. ఎన్నోఒడిదుడుకులు భరించావు. ఇప్పుడు పోరాడకుండానే పారిపోతున్నావు. నాకే సిగ్గుగా ఉంది నువ్వు నా మనవడివి అనుకోడానికి.."

"వాడు నా కొడుకు తాతా!" నిస్సహాయంగా అన్నాడు శేషయ్య.

"నీ మాట నీ కొడుకు వినడా?!" అడుగుతున్న తాతకి సమాధానం ఇవ్వలేక పోతున్నాడు.

"నాన్నా! ఎక్కడికి బయలుదేరావు?" తండ్రి చేతిలో పెట్టె అందుకుంటూ అడుగుతున్నాడు కృష్ణ.

తన చెయ్యి వాడి చేతిలో ఉందేంటి. తాత మాటలు గుర్తొచ్చి చెయ్యి లాక్కున్నాడు.

"నిజంగా ఇల్లు అమ్మేస్తున్నానని వెళ్ళిపోతున్నావా?"

"నా ఇల్లు నువ్వు ఎలా అమ్ముతావు?" బింకంగా అన్నాడు శేషయ్య .

"నీకీ ఇల్లు అంటే ఎంతిష్టమో నాకు తెలుసు నాన్నా! ఎన్ని ఇబ్బందులు వచ్చినా అమ్మలేదు నువ్వు. మొన్న వచ్చిన వాళ్ళు కొనడానికి కాదు వచ్చింది. పడిపోతున్న చోట గోడ కడితే మంచిదని, ఇంకా చిన్నచిన్న రిపేర్లు చెయ్యాలని తీసుకొచ్చాను." అంటున్న కొడుకు వైపు నమ్మలేనట్టు చూసాడు శేషయ్య.

"నాన్నా! నా కోసం నువ్వెన్నో ఇచ్చావు. నీకోసం ఈ ఇంటిని కాపాడలేనా! పద నాన్నా! ఇంకెప్పుడూ నన్ను వొదిలి పోకు .. ఒంటరివాడినై పోతాను నాన్నా!" తండ్రి భుజాలు రెండు చేతులతో పొదివి పట్టుకుని, లోపలికి నడక నేర్పిస్తున్న తండ్రిలా నడిపిస్తుంటే, తడబడుతున్న అడుగుల్ని కూడదీసుకుంటూ కొడుకుతో నడిచాడు శేషయ్య.

***

మంచంలో పడుకున్న శేషయ్య గూడు కోసం కష్టపడుతున్న పిచ్చుకలను చూస్తున్నాడు. కొన్నాళ్ళకి గూడు తయారవుతుంది. తర్వాత పిల్లలు ఆ గూడులో సందడి చేస్తాయి. ప్రకృతి మనిషికి ఎన్నో నేర్పిస్తుంది. ఎగరడం వరకూ పిల్లల్ని కాపాడ్డం పక్షుల ధర్మం. కడవరకూ బంధాలను కాపాడుకోవడం మనుషుల ధర్మం. ప్రతి జీవికి చిన్నదో పెద్దదో గూడు అనేది కావాలనుకోవడం సామాజిక, మానసిక ధర్మం. ఇప్పుడు శేషయ్యకి నిశ్చింతగా ఉంది.

"శేషయ్య గారంటే మీరేనాండీ?" ఆరాగా అడుగుతున్న అతని వైపు చూసాడు శేషయ్య.

"ఈ జడ నాగరం చేసింది మీరేనంట కదండీ .. ఇలాంటిదే ఇంకోటి చేస్తారా?" తన చేతిలో ఉన్న నాగేంద్రుడి ఆకారంలో ఉన్న నాగరాన్ని చూపిస్తూ అడిగాడతను.

"అవన్నీ పాత కాలం నాటి వస్తువులు కదా!" ఆశ్చర్యంగా అడిగాడు శేషయ్య.

"ఇది మా అమ్మగారు నా భార్యకి ఇచ్చేరు. అది మా పెద్దమ్మాయికి ఇచ్చింది. చిన్నమ్మాయి తనకీ అలాంటిది కావాలని అడిగింది. ఎప్పటికి ఇవ్వగలరూ?" అడ్వాన్స్ ఇవ్వడానికి జేబులోంచి డబ్బు తీసి లెక్క పెడుతూ అడిగాడు.

"పది రోజుల్లో ఇస్తాను" ధీమాగా చెప్పాడు శేషయ్య.

"సరేనండీ .. తర్వాత మా చిన్నమ్మాయి పెళ్ళికి కొన్ని నగలు చెయ్యాలి మీరు. ఇప్పుడు పాతవే ట్రెండు!" నవ్వుతూ అడ్వాన్స్ ఇచ్చి వెళ్ళాడతను.

పనిముట్లని కళ్ళకద్దుకుని పని మొదలు పెట్టాడు శేషయ్య. ఓ వైపు ఇంటి పని మొదలయ్యింది!

***0***

కథా మంజరి
పది కథల సమాహారం

## రెండవ బహుమతి



# దిశా నిర్దేశం

గంటి రమాదేవి



## రెండవ బహుమతి

# దిశా నిర్దేశం

### గంటి రమాదేవి

రాత్రంతా వర్షం పడుతూనే వుంది. ఏడు గంటలకి 'హింగన్ ఘాట్' స్టేషన్ కి రావలసిన రైలు ఇంకా ఎక్కడో వుంది. తొమ్మిదిన్నరకి నాగపూర్ చేరుకోవాలి. కృష్ణప్రసాద్ కి ఆందోళనగా వుంది. 'న్యూఢిల్లీ' చేరేసరికి ఈ రైలు ఎన్ని గంటలు ఆలస్యం అవుతుందో తెలియదు.

హెచ్ డి బ్యాంకు హెడ్ క్వార్టర్స్ లో 'ఆఫీసర్ క్యాడర్' కి ఇంటర్వ్యూ వుంది. కొన్ని రోజులుగా ఆఫీసు పనుల వత్తిడి వల్ల తీరిక చిక్కక, ఈ "మౌఖిక పరీక్ష" తయారీకి కావలసిన సమయం దొరకలేదు కృష్ణ ప్రసాద్కి! ఆ 'వెలితి' కృష్ణప్రసాద్ ని తేలుముల్లులా గుచ్చుతూనే వుంది. బ్యాంకు రూల్స్ ప్రకారం ఇది చిట్టచివరి అవకాశం! ఈ "ప్రమోషన్" రాకపోతే ఇక జీవితాంతం గుమాస్తాగానే వుండిపోవాలి! చాలీచాలని జీతంతో ప్రతిరోజూ జీవన్మరణ సమస్యే! ఒక సర్వే ప్రకారం .. మనిషి జీవితంలో “డబ్బుకు” సంబంధిన సమస్యలే అత్యధికం! రోజు వారి మాటల్లో "డబ్బు" అనే పదం ఎక్కువ సార్లు ప్రస్తావనకి వస్తుందట!

తనకి ఢిల్లీ లో ఎవరూ తెలియదు. అదో సమస్య! బాంక్ లో ఒక సహోద్యోగి చెప్పాడు. 'రైల్ దిగి, తిన్నగా "కరోల్ బాగ్" వెళ్ళు! అక్కడ 'సౌత్ ఇండియన్ లాడ్జ్' లు ఉంటాయి. అక్కడే మన తెలుగు భోజనం దొరుకుతుంది. అక్కడ నుంచి నీ ఇంటర్వ్యూ కి వెళ్ళచ్చు. దగ్గరే!'

'బాగా ప్రిపేర్ అవ్వు కృష్ణా! ఈ ప్రమోషన్ నీకు ఎంతో అవసరం! ఇప్పుడు నువ్వు చేస్తున్న ఈ"అసిస్టెంట్" ఉద్యోగంలో ఎదుగూ బొదుగూ లేదు. ఈ ప్రమోషన్ వస్తే .. నీ కష్టాలూ.. మీ ఇంటి కష్టాలూ తీరి పోతాయి!' అంది కళ్యాణి మూడు రోజుల ముందు.

కళ్యాణి 'క క్లెరికల్ క్యాడర్' లో అసిస్టెంటుగా కొత్తగా జాయిన్ అయింది. కృష్ణ ప్రసాద్ దగ్గర పని నేర్చుకుంటోంది. తొందరగానే వ్యక్తిగత విషయాలు చర్చించుకునే చనువు ఏర్పడింది ఇద్దరి మధ్యా! బాంక్ లో అడిగిన సెలవు ఇవ్వలేదు.

కృష్ణ ప్రసాద్, మేనేజర్ ను అడిగాడు .. 'కొత్త స్థలంలో ఇంటర్వ్యూ సార్! ఢిల్లీ మహానగరంలో నాకు ఎవరూ తెలియదు. రెండు రోజుల ముందు వెళ్లి, బాగా ప్రిపేర్ అయి "ఇంటర్వ్యూ" ఇవ్వాలని అనుకున్నాను. ఇక్కడ చదువు కుదరలేదు!'

'సీ మిస్టర్ ప్రసాద్! మన బాంక్కి కొన్ని రూల్స్ వున్నాయి. అవి పాటించాలిగా! ఒక్క రోజు ఇంటర్వ్యూకి అయిదు రోజులు సెలవు ఎలా ఇస్తాను? నువ్వు కూడా రూల్స్ 'స్ట్రిక్ట్' గా ఫాలో అవుతావు కదా!'

మేనేజర్ 'స్ట్రిక్ట్' అన్న పదాన్ని వత్తి పలికాడు. ఆయన మాటల్లో వ్యంగం కృష్ణప్రసాద్ కి అర్థమైంది.

'లోన్ ప్రాసెస్' చేసేటప్పుడు .. 'ప్రసాదూ! కొన్ని చూసీచూడనట్టు పోవాలి! మరీ శాస్త్ర ప్రకారం వెడితే.. ఏదో అయినట్టు.. సరే! ఈ బాంక్ బ్రాంచ్ లోనే ఇలా 'రూళ్ళ' కఱ్ఱలతో కొడతామని, నీ వల్లే మనకి ''మాంఛీ'' పేరు వచ్చేసింది. ఈ సంవత్సరం మన 'టార్గెట్' పూర్తవడం అసాధ్యం! దానికి ఎవరు కారణమో నేను చెప్పనక్కరలేదు!'

బాంక్ మేనేజర్ అన్న నిష్ఠూరమైన మాటలకు కృష్ణప్రసాద్ మనసు గాయపడింది. "టార్గెట్" పూర్తి కాకపోవడానికి ''తనొక్కడే'' కారణం అని నర్మగర్భంగా చెబుతున్నాడు ఈయన!

"బాంక్ రూల్స్ పాటించడం తప్పా సార్? అలాటప్పుడు ఎందుకు సార్ ఈ "రూల్ బుక్స్?" మనం ఎవరికంటే వాళ్లకి అప్పులు ఇచ్చేసి, బ్యాంకుని దివాళా తీయించేద్దాం సార్! ఇప్పటికే ఈ 'క్రోనీ క్యాపిటలిజమ్' వల్ల మన దేశం చాలా నష్ట పోయింది. నా చేత ఎందుకు చెప్పిస్తారు సార్? ఇచ్చిన అప్పులు తిరిగి రాక బ్యాంకింగ్ పరిశ్రమ, ఇప్పుడు ఎంత సంక్షోభంలో వుందో తెలియదా సార్! మన ''టార్గెట్'' అప్పుడు పూర్తవుతుంది సార్!" కృష్ణ ప్రసాద్ తనకి తెలియకుండానే కరుక్గా మాట్లాడుతాడు. అది అతని సహజ ధోరణి!

"నీతో ఇదే చిక్కు! ఒక మాటకి పది మాటలు. ప్రతీ దానికి ఒకటే వాదన! ఆవేశం! నువ్వు ఎప్పుడు ఎలా మాట్లాడతావో ఎవరికీ తెలియదు .. ఆఖరికి నీకు కూడా! .. సరే! వెళ్ళు!" అన్నాడు.

'వీడు బాగుపడడు' అని మేనేజర్ గొణుక్కోవడం కృష్ణప్రసాద్ విన్నాడు. వెనక్కి తిరిగి వాడి నోరు మూయించాలన్న తన ఆవేశాన్ని అదుపులో పెట్టుకున్నాడు.

అది కళ్యాణ హిత బోధ ఫలితం!

'చూడు కృష్ణా! వాదన వల్ల సాధించేది ఏం వుండదు! ఈ మూర్ఖుడి మనసుని రంజింప చేయలేము. ఎలా అంటే .. రాయి మీద వేసిన విత్తనంలా! అది మొలకెత్తదు. ఎవరికీ ఉపయోగపడదు. వదిలెయ్యి అనవసర ప్రసంగం! ఈ ఒక్క మాట దురుసు వల్ల, నీకున్న మంచి గుణాలన్నీ మరుగున పడిపోతున్నాయి. బాంకుల పని తీరుపై నీకున్న అవగాహన, ఆ మేనేజర్ కి లేదు. కానీ అదంతా "అడవి కాచిన వెన్నెలలా"

మిగిలిపోతోంది. ఎందుకు? ఆలోచించు! నీ అనవసర ఆవేశం వల్ల కదా? నీ మాట తీరుతో ఎంతో మంది శత్రువులను సృష్టించుకున్నావు! నీ నిబద్ధతకీ, నూటికి నూరు శాతం నిక్కచ్చిగా చేసే నీ పనితనానికి గుర్తింపు లేదు! ఎప్పుడూ ఒకటే పని .. పని .. అలా చేస్తూ పోతావు. ఇలా పనిలో కునారిల్లి పోవడం తప్ప ఏమైనా ప్రయోజనం ఉందా? నీ సాటి వాళ్ళు చూడు. ఏ పని సరిగా చేయరు! అయినా ఎంత హాయిగా వున్నారో చూసావా? సాయంత్రం కాగానే దస్త్రం కట్టేసి, ఇంటికి చెక్కేస్తారు! వాళ్ళకి లేని నిజాయితీ నీకు ఎందుకు? ఎందుకీ గొడ్డు చాకిరీ? చేస్తే చేసావు .. అది నీ వ్యక్తిత్వం! కానీ, వాదనలు వద్దు. అది తగ్గించు!' అంటూ కళ్యాణి చాలాసార్లు హితభోధ చేసింది.

"లేదు కళ్యాణీ! నేను తినే తిండీ, కట్టుకున్న బట్టా, నేనుండే గూడూ ఈ బాంక్ ఇచ్చినదే! ఆ విషయంలో నాది ఒకటే మాట! అన్నం పెట్టినవాడే 'నా ఆత్మా, శరీరం!' నువ్వు జూనియర్ గా చేరావు, ఈ రకమైన ఆలోచన నీకు మంచిదా కళ్యాణీ! ఇక్కడ జరిగే అవినీతి నీకు తెలియదు!" కృష్ణ ప్రసాద్ అన్నాడు.

కళ్యాణి కృష్ణ ప్రసాద్ చేతి మీద చెయ్యి వేసి అంది. 'నాకు అన్నీ తెలుసు! ఇవన్నీ మామూలే!'

'నాకున్న హితురాలూ, స్నేహితురాలూ నువ్వు ఒక్కత్తెవే! జల జలా పూలు రాలినట్టు, చల్లని మెల్లని పిల్ల తెమ్మెరలా, మలయ సమీరంలా హాయిగా ఉంటుంది నీ సాన్నిధ్యం! .. నా కున్న సమస్యల ఆలోచనలో అతలాకుతలమైన నా మనసుకు సాంత్వన లభించేది నీ సమక్షంలోనే!'

'కృష్ణా! వ్రాత పరీక్షలో పాసవుతావు .. ఇంటర్వ్యూలో ఎందుకు ఫెయిల్ అవుతున్నావు? అయినదేదో అయింది. ఈ సారి శాంతంగా సమాధానాలు చెప్పు. విష్ యూ లక్!' అంటూ చెప్పి పంపింది.

***

రైల్ నాగపూర్ దాటి పోయింది. వాన ఆగిపోయింది. వేడి మొదలయింది. కిటికీలో నుంచి చూసిన కృష్ణప్రసాద్ కి వ్యత్యాసం కనపడుతోంది. వెంటాడిన వర్షం మాయమయింది. తెల్ల ఉమ్మెత్త పువ్వులా చెమ్మలేని మేఘాలు! వేడెక్కిన అభ్రకపు మేలి ముసుగు వేసుకున్న కొండలు!! దుమ్ము కొట్టుకుపోయిన నిప్పుకు కాలిన చిళ్లపెంకుల్లా మారిన పంట భూములు! అగ్ని గోళంలా మారిపోతోంది భూగోళం! అక్కడక్కడ పొలాల్లో పైకెగసిన మంటల కొనలు!! పొగతో ఆకాశం నిండిపోయింది! దాహం మొదలయింది. ఎంతలో ఎంత మార్పు!

అదే మార్పు కళ్యాణి లో కూడా! ఒక్క సారి ఎలా మారిపోయింది! ఒక్క రోజులో!

మర్నాడు కృష్ణప్రసాద్ ఢిల్లీ ప్రయాణం!

ఆ రోజు .. "లోటస్ కంపెనీ లోన్ అప్లికేషన్ నీ దగ్గరికి వచ్చిందా? దాని పరిశీలన అయిందా?' అంటూ కళ్యాణి అడిగింది.

కృష్ణ ప్రసాద్ ఆశ్చర్యపోయి అన్నాడు. 'కళ్యాణీ! ఎందుకు అడుగుతున్నావు? ఆ లోన్ అప్లికేషన్ ఓ మోసం!

లాభం లేకపోయినా  ఆదాయపు పన్ను కట్టి .. లేని ఇన్వాయిస్ లు సృష్టించి, పెద్ద లోన్  కావాలని అప్లై చేసాడు.  నేను వెరిపై చేసాను. అన్నీ ఫేక్!'

కొన్ని నిమిషాల  మౌనం  తర్వాత కళ్యాణి అంది.

'కృష్ణా! నేను  ఇంతవరకు  నిన్ను ఏదీ అడగలేదు. ఈ ఒక్కసారి నా మాట విను. ఈ కంపెనీ యజమాని మా దగ్గర బంధువు. ఈ 'లోన్'  రాకపోతే, ఆయన ఆత్మహత్య చేసుకుంటాడు. నువ్వే సాయం చెయ్యాలి!'

'కళ్యాణీ! నువ్వు కూడానా!  ఈ లోన్ ఫ్రాడ్! నేను ఏమీ చేయలేను.  ఏమీ అనుకోకు!'  ముందు ఆశ్చర్యపోతు కృష్ణప్రసాద్ తన అభిప్రాయం చెప్పేసాడు.

కల్యాణి  గబుక్కున  కృష్ణ ప్రసాద్ బుగ్గమీద ముద్దు పెట్టి .. 'ప్లీజ్ బంగారం!  .. ఈ ఒక్క సారి ..!  నువ్వు వూరికే చెయ్యక్కరలేదు. ఆయన నీకు అయిదు లక్షలు బహుమతిగా ఇస్తాడు. దీనితో నీ కష్టాలు తీరిపోతాయి!' అంది.

'అయిదు లక్షలు!'

'ఆలోచించు కృష్ణా!  ఇది లంచం కాదు.  నీ శ్రమకి ప్రతిఫలం.  ఆపదలో వున్న ఆ పెద్దమనిషికి సాయం చేస్తే నీకు వచ్చే ప్రతిఫలం!  నాకు తెలుసు నీకు డబ్బు అవసరం వుంది.  మీ  ఇంటి మీద అప్పు  వుంది.  అది తీర్చకపోతే అది పోతుంది. ఈ నెలాఖరు లోపల కొంత సొమ్మైనా తీర్చాలి. మీ నాన్నగారి గుండె జబ్బు! కరోనరీ హార్ట్ డిసీస్ ..  ఆ వైద్యానికి డబ్బు కావాలి. ఇంకా మీ తమ్ముడు చదువుకి కావాలి డబ్బు!  నువ్వు ఒక్క సంతకం పెడితే,  చాలు .. నీకు వస్తాయి  అయిదు లక్షలు.. ఎవరికీ తెలియదు.  ఒక్కసారి ఆలోచించు. మీ ఇంటికి రాబోయే లక్ష్మిని  కాదనకు.  నువ్వు  చేసే ఈ చిన్నసాయం వల్ల,  మా బంధువు ప్రాణం నిలుస్తుంది, ఒక కంపెనీ దివాళా తీయకుండా కాపాడగలవు.  ఆయన అడిగినది పెద్ద మొత్తం కాదు, అయిదు కోట్లు.  మన బాంక్ అనే సముద్రంలో అది చిన్న కాకి రెట్ట!  దీనివల్ల  'మైటీ హెచ్.డి.  బాంక్ ' దివాళా తీయదు!'

'కల్యాణీ!  మోసం,  అబద్ధం,  తాత్కాలికంగా  సుఖాన్నిస్తాయి.  అది  కొండపై  నుండి  పడుతున్నప్పుడు తేలికపడ్డ  శరీరం  అనుభవించే అనుభూతి. నేలకి  తాకిన ఆ  శరీరం నరక  యాతన  పడుతుంది. నాకీ సుఖానుభూతి తాత్కాలిక సుఖం అక్కరలేదు. మా ఇంటి అప్పు తీరక పొతే  పోనీ... అద్దె ఇంట్లో ఉంటా! మా నాన్న చికిత్స కోసం కొన్ని స్వచ్చంద సంస్థల సహాయం కోరుతున్నాను. అది దొరుకుతుంది. లేకపోతే, విధి ఎలా ఉంటే అలా అవుతుంది! కానీ నేను ఆత్మద్రోహం చేసుకోలేను!' కృష్ణప్రసాద్ కుండబద్దలు కొట్టినట్టు చెప్పేసాడు.

'నువ్వు మూర్ఖుడువని అందరూ అంటూ ఉంటే, ఏమిటో అనుకున్నాను. నీ మాట వాడి అయిన బాణం! అదే  నీ బాధలన్నిటికీ కారణం! నీ లాటివాడిని ఎవ్వడూ బాగు చెయ్యలేడు.. నీ ఖర్మ!'  అని  కళ్యాణి కోపంతో బుసలు కొడుతూ వెళ్ళిపోయింది.

కథా మంజరి
మన తెలుగు కథల సమాహారం

ఉన్న ఒక 'నిజమైన' స్నేహితురాలు దూరమైపోయింది. "గుడ్ లక్" అని చెప్పిన కళ్యాణి అప్పటి నుంచి మాట్లాడడం మానేసింది.

***

రైలు ప్రయాణం సాగి పోతూ వుంది .. కృష్ణ ప్రసాద్ ఆలోచనల్లా!

ఎందుకు తనకే ఈ సమస్యలు? రాజీకి తావులేని తన నియమాలవల్లా? తాను నమ్మిన తన ప్రాణస్నేహితురాలు కళ్యాణి కూడా ఎలా దిగజారిపోయింది. కారణం డబ్బు! అదే.. నాగరికత, ఊపిరి, దేహం, ఆత్మ, గమ్యం అని భావిస్తోంది! ఆ డబ్బే సత్యం, అదే నిత్యం అయినప్పుడు మనుషుల్ని, రక్తసంబంధీకులైనా, ప్రాణ స్నేహితులైనా, రూపాయలూ, పైసలలో తప్ప విలువ కట్టలేమన్న సంగతిని ఆమె నర్మగర్భంగా చెప్పిందా? ఎందుకిలా మారిపోయింది? '

క్రమంగా చీకటి విస్తరిస్తోంది. వేయి నాలుకలతో లోకాన్ని మింగేస్తోంది. రైల్ హెడ్ లైట్ కాంతి మొదటి నక్షత్రపు కాంతిరేఖలా చీకటిని చీల్చే ప్రయత్నం చేస్తూ వుంది. తన ప్రయాణగమ్యం తెలిసినది, జీవంలేని ఈ రైలు కేనా? పంచ భూతాత్మకమైన ఈ మానవశరీరం, పంచ కర్మేంద్రియాలు, పంచ జ్ఞానేంద్రియాలు, మనసు, బుద్ధి వున్న ఈ నాగరీకులకు, ఈ ఇనప మొద్దు రైలు పాటి నిబద్ధత లేదా? మన ఆకాంక్ష ఎంత బలగానైనా ఉండవచ్చు. కానీ, ప్రతీ దాన్ని రూపాయలూ, పైసలతో కొలిచే ఒక వర్గానికి చాలా సార్లు ఆ నియమం ఎంత మాత్రమూ నచ్చదు.

ఆ రాత్రి కంటికి మీద కునుకు లేదు కృష్ణ ప్రసాద్ కి.

ఆయాసపు ప్రయాణం ముగింపుకు వచ్చింది. ఢిల్లీ స్టేషన్ లో నుంచి బయట పడగానే, కుండపోత వాన స్వాగతం పలికింది.

***

రేపే ఇంటర్వ్యూ!

కరోల్ బాగ్ లో సూర్యదేవ్ లాడ్జ్ లో వసతి సులువుగానే దొరికింది. ఆ సాయంత్రం భోజనం అయిదనిపించాడు. దిగులు .. రాత్రి ఎర్ర జీరగా మారి కళ్ళలో నిలిచింది. కనురెప్పల బరువు నిద్రని దూరం చేసింది. సమయం ఘనీభవించి ఆగిపోయిందా అనిపించింది. కల్యాణి ఎందుకలా ప్రవర్తించింది? ఇక తను ఒంటరి!

***

పది గంటలకి ఇంటర్వ్యూ! కృష్ణప్రసాద్ తొందరగానే బయలుదేరాడు. రాత్రి కురిసిన వాన వల్ల రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఆగకుండా కురిసే జల్లులా, రోడ్లపై నిరంతర వాహన వాహిని.. మన దేశరాజధాని.. ఇలా వుంటుందా అని విస్తుపోయాడు కృష్ణ ప్రసాద్!

బాంక్ హెడ్ క్వార్టర్స్ భవనం చేరుకునేసరికి, పది గంటలు దాటి పది నిమిషాలు అయింది. ఎనిమిదో అంతస్తులో వుంది ఇంటర్వ్యూ హాలు! అందులో ఇంటర్వ్యూ సభ్యులు కూచుని వున్నారు! పాల రాతి

ఫ్లోరింగ్ మిల మిల మెరుస్తూ వుంది. పెద్ద మెహగానీ టేబుల్... కోట్లతో, నెక్టైలతో బోర్డ్ సభ్యులు ఎలా ఉండాలో అలానే వున్నారు.

వాళ్ళందరి ముందు ఒక రైటింగ్ పాడ్, దాని మీద ఇంటర్వ్యూ కి వచ్చిన 'నిర్భాగ్యుల' వివరాలు. తెల్లగా, ఎత్తుగా, పెద్ద బొజ్జతో వున్నతను, మేనేజింగ్ డైరెక్టర్, జుగల్ కిషోర్ మెహ్రా! రెండవ వ్యక్తి, పల్లికల్ రామచంద్రన్, మార్కెటింగ్ శాఖాధిపతి. .. గాయకుడు, 'జేసుదాస్' లా వున్నాడు.. ముఖ కవళికల రీత్యా! మూడో మనిషి జగదీశ్వరప్రసాద్ .. సూటి కళ్ళతో, తెలివైన ముఖంతో వున్నాడు. అతను తెలుగువాడని అప్పుడే కృష్ణప్రసాద్ కి అనుమానం వచ్చింది! ఇక ఆ నాలుగో వ్యక్తి బ్యాంకు ప్రెసిడెంట్.. కుష్వంత్ సిన్హా. గోధుమ రంగు శరీరం, నిండైన వెడల్పు మొహం. ఆయన కళ్ళలో గాని, ముఖంలో గాని ఏ భావమూ వ్యక్తం కావడంలేదు. ఈయన సైకాలోజిస్ట్, పబ్లిక్ రిలేషన్ బాస్! వీళ్లంతా ఆ బ్యాంకు హయ్యర్ మేనేజ్మెంట్! లక్షల కోట్ల ఆస్థి గల బాంకుకి అధికార్లు, ధర్మకర్తలూ!

లేటు రావడం.. తడిసిన బట్టలు! పెద్ద యోధాన యోధులులాటి బోర్డు మెంబెర్స్ ను చూడగానే, కృష్ణప్రసాద్ లో టెన్షన్ మొదలైంది. బూట్లు తడిసి పోయాయి. పాంటు కూడా మోకాళ్ళ వరకు తడిసి పోయింది.

“యూ! మేస్సీ ఫెలో.. హాలంతా నీ కాళ్ళ బురదతో పాడు చేసావు! నీటుగా రావాలని తెలియదా?'” అని కోపంగా అరిచాడు. కృష్ణ ప్రసాద్ కీ చిర్రెత్తుకొచ్చింది. ఆ హఠాత్ కోపం తగ్గించుకోమని కళ్యాణి చాలా సార్లు చెప్పింది.

'ఇంత పెద్ద బ్యాంకుకి మేనేజర్లు. హు.. హిందూస్తాన్ డెవలప్మెంట్ బ్యాంకు గుమ్మం ముందు ఒక డోర్ మేట్ పెట్టాలని తెలియదా సార్ ?' అన్నాడు.

మిగిలిన ముగ్గురూ ఆశ్చర్యంగా చూసారు. ఇంతవరకు ఏ ఉద్యోగీ ఇలా మాట్లాడలేదు.

'స్ట్రేంజ్ ఫెలో' అన్నాడు రామచంద్రన్.

మిగిలిన' ఇంటర్ వ్యూ' అంత జగదీశ్వర ప్రసాద్ దే!

'అవినీతి గురించి నీ అభిప్రాయం? ఈ రోజుల్లో గాంధీఇజం ఈ దేశానికి పని చెయ్యదు అని నేనంటే నువ్వేమంటావు? గాంధీ ఒక ఫెయిల్డ్ లీడర్.. అని నేనంటే నీ రియాక్షన్ ఏమిటి?' ఆయన అడిగాడు టీజింగుగా.

ఆ మాటలకి, అదే విసురులో కృష్ణ ప్రసాద్ జవాబు చెప్పాడు. “అవినీతికి అలవాటు పడ్డట్టే... ఇలాటి ప్రశ్నలకు మనం అలవాటు పడి పోయాం సార్! అవినీతి వుండాలని ఎవరైనా చెప్పారా... అసలు చెప్తారా? అందరూ నీతి మాత్రమే కావాలని అంటారు. అయినా అవినీతి జరుగుతూనే వుంది! మన బాంకులో లేవా పని చేయని ఆస్తులు? అదే "ఎన్. పీ.ఏ" లు! నిరర్ధక ఆస్తులు, మన బాలన్సు షీట్ చూస్తే, మీకె తెలుస్తుంది. ఇవి ఎలా వచ్చాయి? మన అధికారుల అవినీతి వల్లే కదా! కాదు పొరబాటున అంటే, అవి

ఎందుకు పెరుగుతున్నాయి ప్రతీ సంవత్సరం?  ఈ పరిస్థితికి కారణం ఎవరు?" నిరర్ధక ఆస్తులని, కృష్ణా ప్రసాద్  తమని 'అన్యాపదేశంగా అంటున్నట్టు వాళ్ళు భావించారు!

కృష్ణప్రసాద్ మళ్ళీ  తనే అన్నాడు.

"మన  బాంక్ అతి పెద్ద ప్రైవేట్ బ్యాంకు సార్! లక్షా నలభై రెండు వేల ఉద్యోగులు,  అయిదువేల ఒక వంద బ్రాంచ్ లు, రెండు లక్షల డెబ్బై కోట్ల మార్కెట్ క్యాపిటలైజెషన్!   అయినా ఎప్పుడూ నష్టాలే! ఎందుకు సార్! మన అధికారుల అవినీతి వల్ల కాదా? నాకున్న కొద్ది  పరిజ్ఞానంతో చెబుతున్నాను.  ఆ విషయం చాప కింద చెత్తలా, తివాచి కింద దుమ్ములా.... అల్లా వుండిపోతుంది.  అసలు కారకులు.. పదవీ విరమణ  చేసి హాయిగా వెళ్లిపోతారు.  మోసపోయేది ఈ బాంక్, చిన్న చిన్న మదుపు దారులే!!  నెత్తిన గుడ్డ వేసుకుని పోయేది వాళ్ళే కదా! ఇందంతా ఎవరి నిర్వాకం సార్?"  కృష్ణప్రసాద్ మాటల విసురు అల్లానే కొనసాగింది.

"సార్! మీరు నిర్భయంగా, హాయిగా ఈ రాజధానిలో కూర్చుని... ఇలా వ్యర్ధ ప్రసంగం చేసే స్వేచ్ఛ..  మీకు ఎలా వచ్చింది?  మనం కూడా  పాకిస్తానులోలా   సైనికపాలనలో వుంటే వచ్చేదా? బ్రిటీష్ వాళ్ళ పాలన కొనసాగి  ఉంటే, ఉండేదా మీకీ స్వేచ్ఛ?  మీ తరం వాళ్ళు కాదా, వాళ్ళకి మద్దతు తెలిపింది? అది కాదన్నాడు గాంధీ! పోరాడాడు!! ఇప్పుడు బ్రిటీష్ ఉంటే, వాళ్ళ కాళ్ళు కడిగి నీళ్లు నెత్తిన పోసుకోవడానికి మీలో అందరూ సిద్ధమై పోరా?  ఎందుకీ ద్వంద మనస్తత్వం?"

అప్పుడు కృష్ణప్రసాద్ కి  తోచలేదు... ఇంటర్వ్యూ జరగడం లేదని వాగ్యుద్ధం  జరుగోతోందని. ..ఇలా పక్క తోవ పట్టిన ఇంటర్ వ్యూ!  జగదీశ్వర ప్రసాద్..  గాంధీ గురించి చేసిన వ్యంగ వ్యాఖ్యానంతో  కృష్ణప్రసాద్ లో కోపం పెరిగింది.

"సరే ప్రసాద్, అసలు దేశం పురోగతికి కావలసిన అంశాలు ఏమిటి?" చైర్మన్ కోపంగా అడిగాడు.

'పురోగతి .. ఎక్కడ సార్! మన దేశం స్వాతంత్ర్యం వచ్చినప్పుడు పునరుజ్జీవనం పొందాలని మన నాయకులు భావిచారు. కానీ ఆ దశ నుంచి, మన తిరోగమనం సాగుతోంది సార్!  కుల, మత, ప్రాంతీయతత్వాల విషవలయంలో చిక్కుకున్నాం! మతతత్త్వ, కులతత్త్వ, ప్రాంతీయ పార్టీలు మునుపెన్నడూ లేని విధంగా బలపడుతున్నాయి. చిత్రమేమిటంటే .. పాలకవర్గాలే ప్రణాళికా బద్ధంగా ఈ విభేదాలను పెంచి పోషిస్తున్నాయి. మీకు తెలియదా.. మన కన్నా చిన్న దేశం బంగ్లాదేశ్ మనని మించిపోయిందని కొత్త వార్త! మన రాష్ట్రంలో ఓ  జిల్లా  అంత కూడా లేని దేశాలు,  మనకన్నా ఎంతో ముందు వున్నాయి. ఎక్కడ లోపం? మనం ఒక అంతులేని అగాధంలో పడిపోతూ, అదే హాయి హాయి" అనుకుంటున్నాం..."

'చాలు నీ ఉపన్యాసం! నీకు అసలు ఏమీ తెలియదు. చూసావా నీ చుట్టూ వున్న మేడలు.. మిద్దెలు. రోడ్లు!' కోపంగా గర్జించాడు హరిచంద్రప్రసాద్!

కృష్ణప్రసాద్ నిట్టూరుస్తూ అన్నాడు. 'వాటికి పునాదులు సరిగా లేవు. అవీ అలాటి అవినీతి పునాదుల మీదే నిర్మింపబడ్డాయి.. ఎన్ని వంతెనలు, ఎన్ని భవంతులు కూలి పోవడం లేదు!' కృష్ణప్రసాద్ మాటలకి మధ్యలోనే ఆగిపోయాయి.

"ఆల్ రైట్ మేన్! ఇంటర్వ్యూ ఈస్ ఓవర్! యు కెన్ గో!" అన్నాడు జగదీశ్వర్ ప్రసాద్ కటువుగా!

ఇంటర్వ్యూ దారుణంగా విఫలమైంది.

***

తిరిగి బ్యాంక్ కి వెళ్లేసరికి.. మేనేజర్ వంకర నవ్వుతో స్వాగతం చెప్పాడు. 'ఇంటర్వ్యూ ఇరగదీసావుట! హెడ్ ఆఫీస్ నుంచి సమాచారం వచ్చింది. ఇంకో విషయం నీకు 'నోటీస్' ఇమ్మని ఆర్డర్ వచ్చింది. ఒక నెల నోటీస్... పాపం.. వున్నది కాస్తా ఊడింది! ఇంకెక్కడైనా చూస్కో ఉద్యోగం! అక్కడ చూపించు నీ 'స్ట్రిక్ట్ నెస్'! ఎక్కడున్నా నువ్వు 'న్యూసెన్సే..'

హతాశుడయ్యాడు కృష్ణ ప్రసాద్!

'సారీ!' అంటూ అందరూ సానుభూతి పలికారు.

బతుకంతా అగమ్య గోచరంలా కనబడింది. ఆ సాయంత్రం కళ్యాణి కృష్ణప్రసాద్ దగ్గరకి వచ్చి "సారీ! ఇలా అవుతుందనుకోలేదు. ఇదివరకే నీకు చెప్పాను లౌక్యం నేర్చుకోమని, దూకుడు తగ్గించుకోమని!"

"నేను ఏమి తప్పుచేశానో ఎవరూ చెప్పడం లేదు కళ్యాణి! సరే, ఇప్పుడంతా ముగిసిపోయింది, ఇక నేను నీకు కనబడను! నా గమ్యం ఏమిటో నాకే తెలియదు! సారీ.. మీ బంధువు లోన్ విషయంలో నిన్ను బాధపెట్టాను!" కృష్ణప్రసాద్ నిస్తేజంగా అన్నాడు.

కళ్యాణి ఏమీ మాట్లాడలేదు.

***

సాయంత్రం ఇంటికి చేరిన కృష్ణప్రసాద్ ఎదో అలోచేస్తూ పడుకున్నాడు. బతుకంతా శూన్యంగా కనబడింది! ఏం చెయ్యాలో అర్థం కావటం లేదు! ఇప్పుడు తనకున్న ఒకే ఒక మార్గం ఈ నిరర్థక జీవితానికి ముగింపు పలకడం.. ఉలిక్కిపడ్డాడు కృష్ణ ప్రసాద్!

కాదు.. ఏదైనా చెయ్యాలి. ఇలా చేతకానేవాడిలా కూర్చోకూడదు. తనకి తగిన పని దొరకక పోదు. బయటకు వచ్చి 'ఏ దిశగా' వెళ్ళాలో అని ఆలోచిస్తున్నప్పుడు బ్యాంక్ లో పని చేసే కొలీగ్ గబగబా వచ్చి చెప్పాడు.

'కృష్ణా.. బ్యాంకులో జడివానలా ఓ వార్త వ్యాపించింది. నిన్ను ఉద్యోగం తీసెయ్యలేదు' ఆ మాటలు తేనెజల్లులా చెవులకి సోకింది.

'మేనేజర్ నాకు నోటిస్ ఇచ్చాడు కదా!'

'నిన్ను క్లరికల్ కేడర్ లో నుంచి మాత్రం తీసేశారు. ఏదో పెద్ద ఉద్యోగంలో వేశారుట!'

'థాంక్స్!'

'నాకెందుకు ఆ థాంక్స్! కళ్యాణి మేడం గారికి చెప్పు. ఆవిడే ఇదంతా చేసింది.'

'అదెలా?'

'అది నువ్వే కనుక్కో!'

ఇప్పుడు ఎటు వెళ్ళాలో తెలిసింది. కృష్ణ ప్రసాద్ కాళ్ళు అప్రయత్నంగా కళ్యాణి ఇంటి వైపు నడిచాయి.

***

కళ్యాణి ఇంటిముందు పెద్ద కారు ఆగి వుంది. ఆమె కారు ఎక్కుతుండగా ఆమె కృష్ణ ప్రసాద్ ను చూసి అంది.

'సారీ కృష్ణా! నేను అర్జంటుగా ఢిల్లీ వెళ్ళాలి'

'అదేమిటి కళ్యాణీ! నువ్వే ఏదో చేసి నా ఉద్యోగం కాపాడావని అంటున్నారు! అసలు నువ్వు ఎవరు? నీకు అంత పలుకుబడి ఎలాసాధ్యం?" ఆశ్చర్యపోతు అడిగాడు.

'మరోసారి.. సారీ! నేను నీ దగ్గర ఓ నిజం దాచాను. నేను గుమాస్తాని కాను. జగదీశ్వర ప్రసాద్ గారి అమ్మాయిని. ఇక్కడ 'అప్రెంటీస్' చేరడం మా నాన్నగారి ఆలోచన! తృణమూలాల దగ్గర బాంక్ లు ఎలా పని చేస్తాయో తెలుసుకోమని పంపారు. నా ట్రైనింగ్ పూర్తయింది. నీ దగ్గర పని నేర్చుకోవడం ఒక అవకాశం! అది నాకు దొరికింది. నా అదృష్టం! నాకు దొరికిన గొప్ప గురువివి నువ్వు! యు ఆర్ బ్రిలియంట్ టీచర్! నేను వచ్చిన పని పూర్తయింది!'

కళ్యాణి చెప్పిన ఒక్కొక్కమాట ఒక్కో తూటాలా కృష్ణ ప్రసాద్ కి తగిలింది. సంభ్రమమూ, ఆశ్చర్యమూ, అబ్బురపాటూ, ఒక్కసారిగా అతన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి.

'ఇంత ఉన్నత స్థానంలో వుండి, నన్ను ఒక అవినీతి పని చేయమని ఎందుకు 'బలవంతం పెట్టావు? సారీ! 'పెట్టారు మేడం? ఎందుకు నన్ను పక్క దారి పట్టించాలని చూసారు? మీరు చెప్పిన ఆ దారిలో నడిచి ఉంటే?'

కల్యాణి నవ్వుతూ అంది. ఈ బాంక్ నీలాటి వాళ్ళను విస్మరించదు. నిన్ను 'కోర్ మేనేజ్మెంట్' లో తీసుకోమని నాన్నగారు రికమెండ్ చేశారు. నువ్వు ఆఫీసర్ సెలక్ట్ కానిది అందుకే! కోర్ మేనేజ్మెంట్ అంటే ఆఫీసర్ కన్నా పెద్ద హోదా! హయ్యర్ మేనేజ్ మెంటులో తీసుకున్నారు. అది ఆఫీసర్ ప్రమోషన్ లాటిది కాదు. ఈ బ్యాంకు 'థింక్ టాంక్'.. ఆ గ్రూప్ లో నువ్వు ఉంటావు. కొన్నాళ్ళు పాటు విదేశంలో నీకు శిక్షణా కార్యక్రమం వుంటుంది. ఆ ఆర్డర్ వేరేగా వస్తుంది. మూడు నెలల శిక్షణ ఉంటుంది. నీ ఆర్థిక ప్యాకేజ్ నీకో ఆశ్చరార్థకం కాబోతోంది! నీకున్న దూకుడు కళ్లెం వేసి, ఆ శక్తిని క్రియాశీలకంగా ఎలా ఉపయోగించాలో నేర్పే శిక్షణ! అది.. స్టాన్ఫోర్డ్ యూనివర్సిటీ, చికాగోలో!

కృష్ణ ప్రసాద్ అప్రయత్నంగానే కళ్యాణికి దూరంగా జరిగాడు.

'మేడం! మీరెవరో తెలియక చాలా సార్లు చులకనగా మాట్లాడాను. క్షమించండి!' మెల్లగా అన్నాడు.

కల్యాణి కృష్ణప్రసాద్ చెయ్యి కలుపుతూ “మనం మన వాగ్దానాలు నిలబెట్టుకోవడానికి కలిసి పని చేయాలి. అందుకే మన మధ్య క్షమాపణలు వుండవు.  ఆఖరికి సత్యమే గెలుస్తుంది. ఓకే. బై!” అంటూ ఆమె కారు ఎక్కి వెళ్ళిపోయింది.

కృష్ణప్రసాద్ ఆలోచనల్లో.. క్రమంగా  ఆమె రూపం కనుమరుగయింది.

‘మేడం! నేను కాదు.. మీరే నా గురువు. నా భవిష్యత్తు ఎలా ఉండాలో ''దిశానిర్దేశం” చేసినది మీరు’ అని మనసులో అనుకున్నాడు.

కృష్ణ ప్రసాద్ కళ్ళను ఆక్రమించిన కన్నీటి పొరని ఎవరూ చూడకుండా తుడుచుకున్నాడు.

***0***

కథ
కథా మంజరి
పది కథల సమాహారం

## మూడవ బహుమతి



# ఘోష

పొత్తూరి విజయలక్ష్మి



## మూడవ బహుమతి

# ఘోష

పొత్తూరి విజయలక్ష్మి

అంతా అయిపోయింది కాబోలు.

హాల్లో అందరూ ఏడుపులు పెడబొబ్బలు మొదలు పెట్టారు. సుధాకర్ కి నూకలు చెల్లిపోయాయి .. ముప్పై రెండేళ్ల వయసు. ఆరు నెలల క్రిందట కేన్సర్ వచ్చింది. మా చెల్లెలి మనవడు. పోయాడు. మా కుటుంబంలో ఇప్పటికీ ఎంతో మంది పోయారు.

ఏం చేస్తాం జాతస్య హిధ్రువో మృత్యుః

ఇదిగో ఇప్పుడు వీడు పోయాడు. వీడు పోయినందుకు ఏడుస్తారు సరే. ఆ వెంటనే నేను బతికున్నందుకు ఏడుస్తారు! అదిగో మొదలు.

"దేవుడికి కళ్ళు లేవు. మా అందరికీ గుది బండలాగా పడి వున్న ఆ పీడాకారాన్ని తీసుక పోవచ్చు కదా!"

"అదా. అది అప్పుడే పోతుందా! ఇంకా ఎంతమందిని మింగాలో. శని గ్రహం."

"అసలు దాని వల్లనే ఈ అరిష్టాలు అన్నీ. అన్ని ఏళ్ళు వచ్చాయి కదా.. బుద్ధి జ్ఞానం లేవు. అందరి మీద పడి ఏడుస్తూ వుంటుంది."

"పోనీ ఏ హోమ్ లో అయినా తగ్గలేద్దాం అంటే పోదుట. ఇక్కడ ఇంట్లోనే చస్తుందిట!"

"అది ఇప్పుడే ఏం చస్తుంది. పాపీ చిరాయువు అని ఇటువంటి వాళ్లు ఓ పట్టాన పోరు."

"అవును వందేళ్లు బతుకుతాను అని ఖచ్చితంగా చెప్తుంది కదా అది."

పోయిన వాడి విషయం మర్చిపోయి నన్ను ఆడి పోసుకుంటున్నారు అందరూ. ఈ మాటలన్నీ నాకేం కొత్త కాదు. ఎన్నో సందర్భాల్లో విన్నాను. విని విని చెవులు చిల్లులు పడిపోయాయి. ఎన్నేళ్ళు. నిన్నా మొన్నా. అక్షరాలా డెబ్బై అయిదేళ్ళుగా వింటూనే ఉన్నాను. వచ్చే ఏడాదికి నాకు తొంబై ఏళ్లు నిండుతాయి.

లక్ష్మి., అదే నా పేరు! మా అమ్మ నాన్నకి నేను తొలి సంతానం. నా తర్వాత ఐదుగురు. ముగ్గురుకూతుళ్లు ఇద్దరు కొడుకులు. మొత్తం ఆరుగురం. తొలి సంతానం ఆడపిల్ల లక్ష్మీదేవి అని ఆ పేరు పెట్టారట. ఇరవైఒకటోవ రోజు ఉయ్యాల తొట్టిలో వేస్తుంటే, వచ్చిన పేరంటాళ్ళు అందరూ నా చక్కదనం చూసి మురిసిపోయారుట. ఆ తర్వాత అంతే. ఎక్కడికి వెళ్ళినా నేను ఒక ప్రత్యేక ఆకర్షణ.

కథా మంజరి

చదువుతోపాటు సంగీతం కూడా నేర్చుకున్నాను. పదమూడవ యేట పెద్దమనిషి అయ్యాను. నా చక్కదనం చూసి అందరూ మా అబ్బాయికి చేసుకుంటాము అని ఉబలాట పడ్డారట. కానీ ఎవరికి అవకాశం లేదు. నేను పుట్టగానే ఇది నా మనవరాలు కాదు, కోడలు అని చెప్పేసిందట మా అమ్మమ్మ. అలాగే నా పదహారో ఏట మా మేనమామకి ఇచ్చి పెళ్లి చేశారు. పెళ్లయ్యాక చదువు మానలేదు నేను. ఇంట్లో మా అమ్మమ్మ వుండేది. తాతగారు నా చిన్నతనంలోనే పోయారు. ఆవిడ ఇంటి పని అంతా చూసుకుంటూ ఉంటే నేను, మా ఆయన చదువుకునే వాళ్ళం.

నేను కాలేజ్ లో చదివి బి.ఏ. పాసయ్యాను. వీణలో మంచి ప్రావీణ్యం సంపాదించాను. అప్పట్లో హిందీ పరీక్షలు ఉండేవి. అవి కట్టి విశారద పాసయ్యాను. ఆటలు ఆడటం ఇష్టం. యువతీ మండలికి వెళ్లి బ్యాట్ మింటన్ ఆడేదాన్ని. అందం సంగతి ముందే చెప్పాను కదా .. నేను వెడుతుంటే సైరాబాను అనే వాళ్ళు అందరూ!

మా ఆయన కూడా చదువు పూర్తిచేసి గవర్నమెంట్ ఉద్యోగంలో చేరారు. నేను కూడా ఉద్యోగం కోసం ప్రయత్నాలు మొదలు పెట్టాను. సరిగ్గా ఆ సమయంలోనే, నా జీవితం తారుమారు అయిపోయింది. అప్పుడు నా వయసు ఇరవై నాలుగు.

తల నెప్పి మొదలైంది. కొన్నాళ్ళు విశ్రాంతి తీసుకుందామని పుట్టింటికి వెళ్లాను. అక్కడ బాగా జబ్బు పడ్డాను. నాకు ఒంటి మీద తెలివి లేదు. ఆ వూళ్ళో డాక్టర్లు చూసి, అర్జెంట్ గా రాయవేలూరు తీసుకెళ్ళాలి అన్నారట. స్ట్రెచ్చర్ మీద పడుకోబెట్టి అలాగే రైలు ఎక్కించి తీసుకువెళ్లారు.

నాకు వచ్చిన వ్యాధి పేరు మెనింజైటిస్.

ఆరు నెలలు అక్కడే వున్నాం. చేయాల్సిన వైద్యం చేసి, ఇక మేం చేసేది ఏమీ లేదు, ఇంటికి తీసుకుని వెళ్లిపోండి .. అన్నారుట! నాకు ఏమీ తెలీదు అదే స్థితిలో ఇంటికి తీసుకు వచ్చారు. ఇంటికి వచ్చినా నాకు మతి సరిగా పని చేసేది కాదు. మా వారిని, అమ్మను కూడా గుర్తుపట్టలేక పోయేదానిని.

అన్నీ మంచంలోనే. పక్షవాతంలాగా వచ్చి ఎడమ వైపు. శరీరం దెబ్బ తిన్నది. ఎడమకాలు, ఎడమ చెయ్యి పడిపోయాయి. ఎడమ కన్ను పని చెయ్యదు. అదే స్థితిలో కొంతకాలం ఉన్నాను. క్రమేణా నాకు కొద్దిగా తెలివి రావటం ప్రారంభమైంది. మనుషులని గుర్తుపట్టటం, నా పేరు అడిగితే చెప్పటం చేసేదాన్ని.

నాకు వచ్చిన అనారోగ్యం, నా శరీరం మీద చూపించిన ప్రభావం ఏమిటో తెలిసి వచ్చేసరికి, మరి కొంత కాలం పట్టింది. అద్దంలో నా మొఖం చూసుకుని గుండె పగిలేలా ఏడ్చాను. పడిపోయిన చేతిని, కాలుని చూసుకుని, తల గోడకేసి బాదుకున్నాను. ఏ పని, నా అంతట నేను చేసుకోలేను. కనీసం వెళ్లి ఏ నూతిలోనో దూకే శక్తి కూడా లేదు. ఏడ్చాను. ఒకరోజు కాదు, ఎన్నో రోజులు.. నెలలు! ప్రాణమైతే నిలబడింది గానీ, నాకు వచ్చిన అవకరం అంతే. నయం కాదు. మరి కొన్ని నెలల తరువాత, గోడలు

పట్టుకుని నడవటం చేయించారు బలవంతాన! కుంటి నడక. రోతగా వుంటుంది, కానీ నడవక తప్పదు. అది కూడా లేకపోతే మూటలాగా మంచంలోనే పడి ఉండాలి.

నా అనారోగ్యం వల్ల, మా కుటుంబం నాశనం అయింది. బోలెడంత డబ్బు ఖర్చు అయింది. అత్తింటివారు కొంత, పుట్టింటి వారు కొంత భరించారు. పొలాలు అమ్మేశారు. వైద్యానికి అయిన ఖర్చు కాక, ఇంకా బోలెడు ఖర్చు అయింది. ప్రశ్నలు అడగటం, గ్రహ దోష నివారణ కోసం పూజలు. ఆయుర్వేదం, హోమియో, ప్రకృతి వైద్యం, ఆకులు అలములు, పసరు, తైలం ఒకటి కాదు, భూతవైద్యం తప్ప మిగతావన్నీ ప్రయత్నించి చూశారు. శ్రమ ఖర్చు తప్పించి, ఆవగింజంత ఉపయోగం కూడా లేదు.

వాటన్నిటినీ మించి నాకు ఇలా జరిగింది అని మనసు పాడై పోయి, మా ఆయన ఉద్యోగం వదిలేసారు. మా అత్తగారు కూడా కూతురు ఇంటికి, అంటే నా పుట్టింటికి వచ్చేసింది. మా నాన్న గారి మీద మరో ముగ్గురు మనుషుల భారం పడింది. మా ఆయనకి మళ్లీ పెళ్లి చేయాలని, నా పెద్ద చెల్లెల్ని ఇవ్వాలని అనుకున్నారు. కానీ అలా ఇచ్చి చేసినందువల్ల ఏం ప్రయోజనం? ఆ ముగ్గురు ఎట్లాగూ ఇంట్లోనే ఉంటున్నారు. వాళ్లకు తోడు ఇంకో మనిషి భారం. మా చెల్లెలు కూడా ఏడ్చింది వద్దని. ఒక పెళ్లి చేసుకుని అనుభవిస్తున్నాను చాలు. ఇంకో పెళ్లి కూడానా అన్నారు మా ఆయన.

నేను బాగున్నప్పుడు లక్ష్మి వస్తే, పదిమంది పెట్టు అని పెళ్లిళ్లు అయినా, పేరంటాలు అయినా ఊరికి ముందర నాకు చెప్పేవాళ్ళు రమ్మని. నాకు వీలు కాదు అంటే బలవంత పెట్టేవాళ్ళు. జబ్బు వచ్చాక ఎవరూ పొరబాటున కూడా నన్ను పిలిచే వాళ్ళు కాదు. ఇంట్లోవాళ్ళు నాకు తోడుగా ఎవరినో ఒకరిని పెట్టి వాళ్ళు వెళ్ళాలి అనుకునేవారు. నేనూ వస్తాను అని గొడవ పెట్టి, ఏడిచి బయలుదేరే దాన్ని. వెంటబెట్టుకు తీసుకుపోతే అక్కడ కాల్చుకు తింటుంది. దీని తీసుకుపోయే కంటే మానేయటం మంచిది అని మానేసేది మా అమ్మ.

బయటవాళ్ళ ఇళ్ల కి వెళ్లకపోయినా, మా ఇంట్లో జరిగే వేడుకలకి వెళ్లాలి గా. నన్ను తీసుకు పోయేవాళ్లు. చెల్లెళ్ళ పెళ్ళిళ్ళకి, తమ్ముళ్ల పెళ్ళిళ్ళకి వెళ్లాను. నన్ను తీసుకువెడితే వాళ్లకి సుఖం లేదు. ఒకేసారి నాకు చీర కట్టి జడవేసి వూరుకుందాము అని వాళ్ల ఆలోచన. వాళ్ళు చీర మార్చినప్పుడల్లా నాకు కూడా మార్చమని గొడవ పెట్టే దాన్ని. 'ఒక చోట కూర్చో కదలకుండా' అనేవారు. అలా కూర్చోవటం నాకు విసుగు. అన్నీ తిరిగి చూడాలని ఆరాటం. ఎవరైనా చెయ్యి పట్టుకుని తీసుకువెళ్లాలి. వాళ్లకేమో తీరదు. అందుకని నేనే బయలుదేరే దాన్ని ఒంటరిగా.

వంకర నడక కదా. బ్యాలెన్స్ తప్పి పడిపోయే దాన్ని. అలా ఎన్నిసార్లు పడ్డానో. ఎన్ని సార్లు తలకి దెబ్బతగిలి కుట్లుపడ్డాయో, ఎన్నిసార్లు ఎముక విరిగిందో లెక్కలేదు. రెండు చేతులూ విరిగి పక్షిలా పిండి కట్టుతో, ఆరేసి వారాలు చాలాసార్లు పడి వున్నాను. నాకు సేవ చెయ్యలేక చచ్చే వాళ్ళు అందరూ. మా అమ్మ నాకు చెయ్యలేక తల బాదుకుని ఏడ్చేది.

చెల్లెళ్ళు పురిటికి వచ్చినా, మరదళ్లు పిల్లలని ఎత్తుకు వచ్చినా, ఆ పనితో పాటు నా చాకిరీ తప్పదు కదా. అందులో నాకు చాకిరీ చేయడం సామాన్యం కాదు. ఆవిడ పనితో తల మునకలై వుంటే, నాకు జడలో పూలు పెట్టు.. అనేదాన్ని. 'ఒక్కరోజు జడలో పూలు లేకపోతే నీ ప్రాణం పోతుందా' అని విసుక్కునేది. జడలో పూలు పెడితే నీ ప్రాణం పోతుందా అని అరిచే దాన్ని.

నా వల్ల చాలా మంది జీవితాలు నాశనం అయ్యాయి. మా కుటుంబం కుదేలు అయిపోయింది. అందరూ ఒక్కొక్కరే పోయారు. ముందు మా అమ్మమ్మ, తర్వాత నాన్నగారు, అమ్మ, ఆయన, తోడ బుట్టిన వాళ్ళు, వాళ్ళ జీవిత భాగస్వాములు, ఆడపడుచులు, వారి భర్తలు.. అందరూ పోయారు. నాకంటే పెద్ద వాళ్ళు, తోటి వాళ్ళు, చిన్నవాళ్ళు పోయారు.

ఆత్మీయులు అందరూ ఒక్కొక్కళ్ళు పోతూ ఉంటే, నాకు ఇంకా కసి పెరిగింది. బతకాలి వందేళ్లు బతకాలి. ఎవరు చచ్చినా సరే, నేను మాత్రం బతకాలి. నా జబ్బుకి కరిగిపోగా, కొద్దిగా పొలం మిగిలితే దానితో ఓ చిన్న ఇల్లు కట్టి, నా పేరు మీద పెట్టించారు మా నాన్న గారు ముందు చూపుతో. అది వుంది. దాని విలువ, కాలంతో పాటు పెరుగుతూ వచ్చింది. ఇప్పటి ధర ప్రకారం కోటిరూపాయలు విలువ చేస్తుంది.

మరి ఇన్నేళ్ల బట్టి తింటున్నావు. అది లెక్కలోకి రాదా అని ఎవరైనా అంటే నాకు కోపం వచ్చేస్తుంది. తినకపోతే పస్తు ఉండమంటావా. ఆస్తికి, నా తిండికి ఏమీ సంబంధం లేదు అని అరుస్తాను. కాబట్టి నా భుక్తికి లోటు లేదు. ఎవరో ఒకరు నన్ను తమ ఇంట్లో వుంచుకుని పోషిస్తున్నారు. అలా చూసిన వాళ్ళ పట్ల నాకు పెద్దగా కృతజ్ఞత ఏమీ ఉండదు. ఎవరి కోసం చేస్తున్నారు అనిపిస్తుంది. ఎంత మాత్రం సర్దు కోను. వాళ్ళని కాల్చుకు తినైయినా సరే, నాకు నచ్చినట్లు అన్నీ జరిపించుకుంటాను. ఎదుటి వాడి అవస్థ పడుతుంటే నాకు పరమానందంగా ఉంటుంది. ఎదుటి వాళ్ళని పొడుచుకు తినటం అంటే మహా సరదా. విసుక్కుంటారు. తిడతారు. ఒక్కోసారి కొట్టడానికి కూడా వస్తారు. అవేమీ లెక్క చేయను.. ఎందుకు చేయాలి! నా బతుకు ఎట్లాగ నాశనమయ్యే పోయింది. ఎదుటివారి మాత్రం ఎందుకు సుఖంగా ఉండాలి? అదే నా ఆలోచన.

కథా మంజరి
పది కథల సమాహారం

ఇప్పుడు నా పెద్ద చెల్లెలి కొడుకు దగ్గర ఉంటున్నాను. వాడి కొడుకే పోయాడు. నా పనులు చూడడానికి ఓ మనిషిని పెట్టారు. దాని పేరు సుబ్బమ్మ. నా కోసం మనిషిని పెట్టడం నా నోరు భరించలేక వాళ్లు పారిపోవడం అలవాటే. ఈ సుబ్బమ్మ ఏడాది నుండి వుంది. నేడో, రేపో అదీ పోతుంది. పోతే పోయింది. ఇంకొకతి వస్తుంది. రాకపోతే వీళ్ళే చేస్తారు.

"సుబ్బమ్మా. ఒసేయ్ "అని అరిచాను.

వచ్చింది.

"ఎక్కడ చచ్చావే.. ఎనిమిది అయింది. నాకు టిఫిన్ పెట్టావా?" అని అరిచాను.

"సుధాకర్ బాబు పోయాడమ్మా" అంది ఏడుస్తూ.

"పోతే పోయాడు.  క్యాన్సర్ వచ్చిన వాడు పోక బతికి ఉంటాడా. వాడు పోతే నీకేమిటి? వాడు నీకు బంధువా? చుట్టమా?  ఏడ్చింది చాలు పోయి నాకు ఇడ్లీ తీసుకురా.  నిన్న చల్లగా  చల్లారాక  తెచ్చి తగలేసావు.  గొంతుకు అడ్డం పడి మింగలేక  చచ్చాను.  ఇవ్వాళ  వేడిగా  నెయ్యి వేసి  కారప్పొడి, పచ్చడి వేసి పట్రా" అని అరిచాను.

"ముసిలి పీనుగ. కాస్తయినా జాలి కరుణ లేవు. దీని జన్మ తగలడా. పురుగులు పడి చస్తుంది" అని విసుక్కుంటూ వెళ్ళిపోయింది.

నా మనసు చల్లబడింది.

దేవుడు ఆ భీష్ముడికి లాగా, నా బోటి వాళ్లకు కూడా ఇచ్ఛా మృత్యువు  పొందే వరం ఇవ్వలేదు కదా మరి. అందుకే  ఈ ఘోష!

***0***

కథ
కథా మంజరి
పది కథల సమాహారం



# ఒకరికి ఒకరు

## పక్కి శివ ప్రసాద రావు

ఇంటర్మీడియట్ లా కాకుండా, బీటెక్ ఎటువంటి ఒత్తిడి లేకుండా ఆడుతూ, పాడుతూ చదివేశాడు రాజేష్. క్యాంపస్లో కూడా మంచి జాబ్ వచ్చింది. ఇక పుట్టి పెరిగిన వైజాగ్ని, మమ్మీ డాడీలను, చిననాటి స్నేహితులను విడిచి బెంగళూరు వెళ్లే రోజు వచ్చింది.

ఓ పక్క ఉత్సాహం, ఉద్వేగం, మరో వైపు కించిత్ విషాదం లాంటి ఫీలింగ్ కలిగాయి. స్టేషన్ కి అందరూ వచ్చారు. మమ్మీకి ఓ కన్నుల్లో ఆనంద భాష్పాలు, మరో కంట్లో చిరు దుఃఖం గుర్తించిన రాజేష్ ట్రైన్ కదలగానే చేతులు ఊపడం కూడా మరిచి పోయాడు.

ఓ పావుగంట గడిచాక, ఒక్కసారి గుర్తొచ్చింది.... తను ఇంటర్ లో కోల్పోయింది ఏమిటి?

అందమైన దస్తూరి, చక్కగా బొమ్మలు వేయడం, మంచి పాటలు పాడటం, చిన్న చిన్న కవితలు రాయడం...! రాజేష్ కి పదవ తరగతి వరకు ఎంతో గుర్తింపు తెచ్చింది. వ్యాస రచనలో , చిత్రలేఖనం పోటీలలో బహుమతులు రావడం... ఎంతో చెప్పలేనంత గర్వంగా ఉండేది.

ఇంటర్ లోకి వచ్చాడు. ఇంట్లో ఎమర్జెన్సీ విధించబడింది. ఉదయం ఐదు గంటల నుండి, రాత్రి పదకొండు దాకా ఊపిరి తీయడానికి కూడా వీలు కాని పరిస్థితి. సాయంకాలాలు ఓ అరగంట అయినా కనీసం ఆడుకోవడానికి కూడా అవకాశం లేదు.

"ఇంటర్ అనేది నీకు చాలా క్రూషియల్ పీరియడ్. ఆటలు, పాటలు అన్నీ మరిచిపోవాలి. పిచ్చి పిచ్చి బొమ్మలు వేయడం, పనికి మాలిన పద్యాలు రాయడం వంటి పనులింక మరిచిపో... నీకు ఐఐటీ సీటు వచ్చి తీరాలి. అంతే!"తండ్రి మాటలు చాలా కటువు గా ఉన్నాయి.

డాడీ తీరు ఎలా మారిపోయింది. పది నిముషాలు లేటుగా లేస్తే కేకలు .. రెండు మార్కులు వీక్లి టెస్ట్ లో తగ్గితే అరుపులు .. రోజులెలా మారిపోయాయి. చిన్న బోయిన తన మొహం చూసి, భోజనాల దగ్గర మమ్మీ ఓదార్పు కొంత రిలీఫ్ అనిపించేది.

"ఈ రెండేళ్లు అన్నీ ఓర్చుకుని కష్టపడితే, ఆ తరువాత ఎంతో బావుంటుంది"

నిజంగా ఆ రెండేళ్లు నరకం చూసాడు.

అటు కార్పొరేట్ కాలేజి పెట్టే ఆరడి, ఇటు ఇంట్లో ఒత్తిడి .. ఒకోసారి గొంతులోంచి అన్నం మెతుకులు మధ్యాహ్నం తిన్నవి, సాయం కాలం స్టడీ అవర్ లో మేకుల్లా బైటికి వచ్చేసేవి. అర్ధ రాత్రి చదువుతుంటే .. ఎక్కడో దూరంగా 'తెలుసా..మనసా' అంటూ తనకు నచ్చిన పాట చెవికి వీనుల విందుగా వినిపించి మనసు సేద తీరినట్లు అనిపించినా .. ఎదురుగా కెమిస్ట్రీ పుస్తకం హెచ్చరిస్తున్నట్లు కనిపించేది. అనుక్షణం టెన్షన్ తో గడిపాడు. చివరికి ఐఐటీ సీటు రాలేదు. ఎంసెట్ రాంక్ ఏదో వైజాగ్ లో బీటెక్ సీట్ రావడానికి సరిపోయింది. కానీ, తండ్రి మొహంలోని ఆశాభంగం చూడగానే, ఎందుకో మనసు లోలోపల ఆనందం కలిగింది. తరువాత డిగ్రీ నాలుగేళ్లు హ్యాపీ గా గడిచిపోయాయి.

ఇప్పుడు ఉద్యోగపర్వం ఆరంభమయ్యింది. ఇది తనకు జీవితంలో మంచి మలుపు కాబోతోంది అనిపించింది. జనారణ్యం నిండిన బెంగళూర్ హడావుడిగా ఉన్నప్పటికీ, ఉదయం వెళ్లి ఏ రాత్రికో తిరిగి వచ్చినప్పటికీ .. పడుకునే ముందు మంచి పుస్తకం చదవడం, ఏవో మనసులోని భావాలు కాగితం మీద పెట్టడం చాలా హాయిగా ఉంది.

ఓ నెల గడిచే సరికి, అటు కంపెనీలో కొత్త స్నేహాలు, ఇటు కాగితం మీద కొత్త కవితలు .. జీవితం ఎంతో ఉత్తేజంగా, ఉత్సాహంగా ఉంది. ఈ నేపథ్యంలో తను పని చేసే కంపెనీలో దీప పరిచయం మరో ఆహ్లాదకరమైన అంశం.

ఆ ఆదివారం ఉదయం రాజేష్ రూంకి దీప వచ్చింది. అప్పటికింకా బద్ధకంగా మంచం మీదే వున్నాడు. చాలా తక్కువ పరిచయంలోనే ఓ అమ్మాయి తన రూంకి రావడం ఉద్వేగంగానే ఉంది.

"రా.. దీపా .. కూర్చో!" అని చెప్పి గబగబా బాత్ రూమ్ లోకి వెళ్ళిపోయాడు.

పావుగంట తరువాత బైటకు వచ్చేసరికి, దీప చేతిలో కాగితాలున్నాయి.

"ఈ కవితలు రాసింది నీవే ..?! ఆశ్చర్యంగా అడిగింది.

రాజేష్ చిన్నగా నవ్వాడు.

"మంచి హాబీ!" కళ్ళెగరేస్తూ అంది. అలా మాట్లాడుతున్నప్పుడు అందమైన నాసిక, నున్నని చెక్కిళ్ళు ఎంతో అందంగా, ఆకర్షనీయంగా గోచరించాయి.

"ఏమిటి ..?" అంది దీప.

గబుక్కున చూపు మరల్చుకుని, ఏం లేదన్నట్లు తలూపాడు.

"మొదటిసారి నీ రూంకి వచ్చాను"

"థాంక్యూ .. నువ్వు వస్తానని అన్నావ్ గాని, నేను కన్ ఫర్మ్ గా వస్తావని అనుకోలేదు!"

"నువ్వు వుండే ఏరియా జయనగర్ అనగానే ఎక్కడ అని అడిగా... అది మా ఇంటికి దగ్గర అని తెలియగానే వస్తానన్నాను. సరే.. పద!" అంది.

"ఎక్కడికి?"

"మా ఇంటికి .. సండే కదా!"

ఓ ఐదు నిముషాలలో ఇద్దరూ బైటకు వచ్చారు.  దీప స్కూటీ స్టార్ట్ చేసింది.  వెనకాల కూర్చున్నాడు.

*                    *                    *

విశాలమైన గేటు, అందమైన పోర్టికో, మెట్ల కిరుపక్కలా పూలకుండీలు ..  తలుపు తీయగానే చక్కని ఏంటి రూమ్ .."రా... రాజేష్.  కూర్చో!" టీపాయ్ కెదురుగా వున్న కుర్చీలు చూపించింది.

రాజేష్ కూర్చోగానే దీప లోపలికి వెళ్ళింది.

'మమ్మీ' అంటూ దీప గొంతు వినిపిస్తోంది.

వెంటనే కర్టెన్ తొలగించుకుని, దీప వాళ్ళ మమ్మీతో వచ్చింది.

"మా మమ్మీ.." దీప చెబుతుండగానే, లేచి 'నమస్తే' చేతులు జోడించాడు.

ఆవిడ  మొహంలో ఆశ్చర్యం లాంటిది కనిపిస్తోంది.

"లోపలికి రా .. బాబూ!" అంటున్న ఆవిడ కళ్ళల్లో సన్నటి నీటి తెర .. రాజేష్ దృష్టిని దాటి పోలేదు.

హాల్ లోనికి వెళ్ళాక అక్కడ సోఫాలో ఓ పక్కాగా ఒదిగి కూర్చొని ఉన్న మామ్మగారిని చూసాడు.

"మా నాయనమ్మ" చెప్పింది దీప.

నమస్తే అన్నాడు గాని, మామ్మగారు వినలేదు, పట్టించుకోలేదు సరికదా... "ఏదీ లైట్ వెయ్యి" అంది.

హాలులో లైటింగ్ తక్కువగానే ఉంది.

దీప లైటు వెయ్యగానే, "అరే.... అచ్చం నా మనవడు చందూలా ఉన్నాడే!" అంటూ ఆశ్చర్యంగా బోసి నోరు వెళ్ళబెట్టింది.   సరిగ్గా అప్పుడే కళ్ళు వత్తుకుంటూ లోపలికి వెళ్లారు దీప అమ్మగారు.

"అవును నాయనమ్మ..." అంది దీప.

ఆశ్చర్యంగా చూస్తున్న రాజేష్ తో "మా అన్నయ్య చందూకి నీకు బాగా పోలికలున్నాయి.  మొదటిసారి నిన్ను చూసినప్పుడే ఇంట్లో చెప్పాను!"  అంది దీప.

కంపెనీ లో కొత్త బాచ్ జాయిన్ అయిన రోజు గుర్తొచ్చింది. పది మంది జాయిన్ అయ్యారు ఆ రోజు. పరిచయాలప్పుడు దీప  కళ్ళు పెద్దవి చేసుకుని తన్ను ఎందుకలా చూసిందో? ఇప్పుడు అర్థం అయ్యింది.

"మీ అన్నయ్యా .. ఏం చేస్తున్నాడు?"అడిగాడు.

"పెద్ద చదువు కెళ్లాడు ఐఐటీ .. ఢిల్లీ .." నాయనమ్మ చేతులెత్తి పైకి చూపిస్తూ గట్టిగా అంది. లోపల నుండి సన్నగా రోదన వినిపించింది. చిన్నబోయిన మొహంతో దీప గబుక్కున "మమ్మీ" అంటూ లోపలికెళ్లింది.

రాజేష్ బిత్తర పోయినట్లు మౌనంగా ఉండిపోయాడు.

***

సాయంకాలం ఐదు వరకు రాజేష్ దీప ఇంట్లోనే వున్నాడు. లంచ్ టైం సరికి దీప నాన్నగారు వచ్చారు. ఆదివారం కూడా ఆఫీస్ కెళ్తారట. ఎప్పుడూ చాలా బిజీగా ఉంటారట. అతను వచ్చేవరకు ఎన్నో కబుర్లు, విషయాలు, ఎంతో ఆప్యాయంగా చెప్పుకొచ్చారు ముగ్గురూ రాజేష్ తో.

దీప నాన్నగారు చాలా తక్కువ మాట్లాడతారు కాబోలు. అతను ఉన్నంత సేపు అందరూ తక్కువ గానే మాట్లాడటం గమనించాడు రాజేష్.

భోజనాల దగ్గర, "మా దీప బ్యాచ్ ఆటకదా .. డిగ్రీ ఎక్కడ చేశావ్?" అని మాత్రం అడిగారు. రాజేష్ సమాధానాన్ని పెద్దగా విన్నట్లే లేదు.

మూడు గంటలకు అతను రెడీ అయి ఆఫీస్ కు వెళ్లిపోతూ .."ఇది నీ ఇల్లే అనుకో...వస్తూ ఉండు!" అని చెప్పి వెళ్లిపోయారు.

సాయంకాలం వరకు ఎన్నో కబుర్లు చెప్పారు. అవన్నీ చందూ గురించే. అతని ఫోటో ఆల్బమ్ చూపించారు. పోలికలు బాగానే ఉన్నాయి. దీప కన్నా మూడేళ్లు పెద్ద, చాలా బాగా చదివేవాడట. పదవ తరగతి స్టేట్ టాపర్ గా వచ్చాడు. ఇంటర్ లో ఐఐటీ కోచింగ్ తీసుకున్నాడట. ప్రిలిమ్స్ లో మంచి రాంక్ వచ్చింది. కానీ, మెయిన్స్ లో రాలేకపోయాడు. ఫలితాలు తెలిసిన రోజు ఇంట్లో అలముకున్న విషాద వాతావరణం గురించి చెప్పనే అక్కరలేదు. తల్లిదండ్రులు భోజనమే చేయలేదట. ఏడుస్తున్న చందూని చూసి దీప బిత్తర పోయిందట.

నాయనమ్మ లేచి "ఎందుకలా అందరూ కొంప మునిగినట్లు.. ఏదో జరగరానిది జరిగినట్లు ఆ ఏడుపులూ, పెడబొబ్బలు.. మళ్ళా రాస్తాడు. ఈసారి పాస్ అవుతాడు!" అని గదమాయించి అందరినీ లేపి బోజనాలకు సిద్ధం చేసిందట.

లాంగ్ టర్మ్ కి సిద్ధపడిన చందూ నవ్వడమే మరిచిపోయాడట. ఆ ఏడాది ప్రతి క్షణం టెన్షన్ తోనే గడిపాడట. మనిషి సన్నబడి కళా విహీనంగా అయిపోయాడట. ఎలాగైనా అమ్మా, నాన్నల మొహంలో తాను ఐఐటీ పరీక్ష పాసైన శుభవార్త తాలూకా ఆనందం చూడాలని తపించి పోయాడట.

ఈ సారి ప్రిలిమ్స్ లోనే ఫెయిల్ అయిపోయాడు. కారణం పరీక్షకు ముందు వారం రోజులుగా నిద్రాహారాలు లేకుండా టెన్షన్ తో, భయంతో చడవడమే. తీరా పరీక్ష రాసే సమయానికి సరి అయిన నిద్ర లేక, కళ్ల మంటలతో, చెప్పలేని నీరసంతో అగమ్యగోచరంగా అయిపోయాడట. ఫలితాలు తెలిసిన రోజు ఆ ఇంట్లో అలముకున్న నిశ్శబ్దం ఎంత భయంకరంగా ఉందంటే .. చెబుతున్న దీప బోరున విలపించింది. ఆ రాత్రి తెల్లవారిన తీరు ఇంకా విషాదకరం. ఉదయం ఎనిమిది గంటల వరకు లేవకపోయే సరికి , రాత్రి ఆలస్యంగా ఏ రెండు గంటలకో లేటుగా నిద్ర పోయి ఉంటాడు అనుకున్నారు. నాయనమ్మ వెళ్లి "లేవరా... చందూ" అని లేపడానికి ప్రయత్నిస్తే తెలిసింది. నాయనమ్మ వాడే నిద్ర మాత్రల సీసా కొత్తది పూర్తిగా ఖాళీగా ఉంది.

"మమ్మీ, డాడీల కోరిక తీర్చలేకపోయాను.  తీరని ఆశాభంగం కలిగించాను.  నేను ఈ జన్మకు ఐఐటీ కాలేను!" అంటూ నోటుబుక్ లో రాసుకున్నాడు.  దీప కళ్ళు వర్షిస్తున్నాయి. దీప అమ్మగారు బోరున విలపిస్తున్నారు.
"చందూ చాలా తెలివైనవాడు నాయనా.  ఐఐటీ పోయింది గానీ..." నాయనమ్మ కళ్ళు తుడుచుకుంది.
రాజేష్ తేరుకుని "ఇంటర్ లో ఐఐటీ కోచింగ్  మా తరానికి ఓ పెద్ద శాపం లాంటిది. ఆ కోచింగ్ ద్వారా కలిగే ఒత్తిడి అంతా ఇంత కాదు.  పైగా ఐఐటీ రాకపోతే ఇంక లైఫ్ లేదు అనే ఫీలింగే పెద్ద ప్రమాదం!"  చెప్పాడు.
"నిజంగా ఇది ప్రమాదమే!" అంది దీప.
"తెలుసుకోలేక పోవడం మా దురదృష్టం!" అంటూ ఎంతో బాధ పడ్డారు దీప అమ్మగారు.
ఆ తరువాత, అందరినీ  ఆ మూడ్ లోంచి బైటకు తీసుకు రావడానికి, తన ఇంటి సంగతులు చెబుతూ, తన ఇంటికి ఫోన్ చేసి అందరినీ తన  మమ్మీతో మాట్లాడించాడు.

***

అప్పటినుండి రాజేష్ కి దీపతో పాటు వాళ్ళింట్లో కూడా మంచి చనువు ఏర్పడింది.  వారాంతపు సెలవులకు దీప ఇంటికి వెళ్ళేవాడు.  రాజేష్ తల్లిదండ్రులు బెంగళూర్ వచ్చాక, రెండు కుటుంబాల మధ్య  మంచి సఖ్యత ఏర్పడింది.
చందూ టాపర్ గా వచ్చిన  స్కూల్ వార్షికోత్సవం నిర్వహిస్తూ, ఆ సందర్భంగా పూర్వ విద్యార్థులను ఆహ్వానించగా, అదే స్కూల్లో చదివిన దీప, ఆ ఫంక్షన్ కి వెళ్ళి, అనుకోకుండా సభలో పిల్లల కోసం ప్రసంగించింది.  పరీక్ష పోయినంత మాత్రాన ప్రాణాలు తీసుకోవడం అమాయకత్వమనీ, అవివేకమనీ, కన్నవారికి క్షోభ కలిగించడం తగదనీ, ఓటమి నుండి విజయం సాధించడంలోనే గొప్పతనం ఉందనీ ..  అలా విజయం సాధించిన మహనీయులను ఉదహరిస్తూ దీప చేసిన ఉపన్యాసం, అక్కడ ఉన్న విద్యార్థులనూ, వారి పేరెంట్స్ నీ, టీచర్లని ఎంతగానో కదిలించింది.
ఆ ఫంక్షన్ కి  వెళ్ళిన దీప తల్లిదండ్రులు, రాజేష్ తల్లిదండ్రులు  కూడా ఎంతో ఆశ్చర్యపోయారు. దీపకు పూర్వవిద్యార్థినిగా వేదిక మీదకు పిలిచిన ఆ క్షణం ఓ అద్భుతం ఆవిష్కృతమైంది.  అది అంతవరకు ఎవరూ ఊహించనిది. దీప అంత చక్కగామాట్లాడుతుందని ఎవరికీ తెలియదు.  ఇక అప్పటినుండి సిటీలో అన్ని స్కూళ్ళు, కాలేజీలు  దీపను వక్తగా  పిలవడం ప్రారంభించారు. కొద్ది రోజుల్లోనే  దీపకు 'మోటివేషనల్ స్పీకర్' గా మంచి గుర్తింపు వచ్చింది.

వారాంతం వచ్చే రెండు రోజుల సెలవుల్లో, ప్రతీ శనివారం దీపకు ఏదో ఒక ఆహ్వానం  తప్పనిసరిగా ఉండేది. ఆమెకు తోడుగా రాజేష్ వెళ్ళేవాడు. అలా ఎన్నో కార్యక్రమాలలో పాల్గొంటూ,  పిల్లలకు చదువు ఎటువంటి ఒత్తిడి కలగకుండా, మంచి ప్రణాళికతో ఎలా చదవాలో చక్కని మెళకువలు అందిస్తూ అందరి మన్ననలు

పొందసాగింది. ఆమె ఉపన్యాసాలు యూ ట్యూబ్ లో, ఆమె ఇంటర్వ్యూలు టీవీ ఛానెల్స్ లో ప్రసారం కాసాగాయి.

అదే సమయంలో యువత భవిత కోసం రాజేష్ రాసిన కవితలు మంచి ప్రాచుర్యం పొందాయి. ఒకోసారి సందర్భాన్ని బట్టి రాజేష్ కవితలను తన ఉపన్యాసంలో దీప వినిపించేది.

సిటీలోని యువతీ, యువకులందరి కోసం పెద్ద ఆడిటోరియంలో జరిగిన వ్యక్తిత్వ వికాససభ లో దీప ప్రసంగిస్తూ....,

" జీవితం అందమైన కావ్యం
మనం రాసుకోగలిగితే....
జీవితం సుందర శిల్పం
మనం మలచుకోగలిగితే..." అని కవిత చెప్పినప్పుడు హర్షధ్వానాలతో సభ మారుమ్రోగింది.

"మీరు కవితలు కూడా రాస్తారా?" అని సభాధ్యక్షుడు అడిగినపుడు,

"కవిత రాసినది నేను కాదు, అతను!" అని రాజేష్ వైపు వేలు చూపింది గర్వంగా. అపుడు రాజేష్ ని కూడా సభనిర్వాహకులు సగౌరవం గా వేదిక మీదకు పిలిచి....

"మీ ఇరువురూ పూవుకి తావిలా, పాటకి చరణంలా ... ఒకరి కోసం ఒకరు అనిపిస్తున్నారు!" అని అతడు ప్రశంసలు పలికితే .. అక్కడ ఆగకుండా చప్పట్ల వర్షం కురిసింది. అందరి దీవెనలు వెన్నెలలా విరిసాయి.

ఆ వెన్నెల వెలుగులో 'దీపా రాజేష్' ఏకీకృత కాంతి పుంజమై ప్రస్ఫుటీకరించింది అందరికీ .. ప్రత్యేకించి ఆ సభకు విచ్చేసిన వారిరువురి తల్లిదండ్రులకు.

***0***

కథా మంజరి
పది కథల సమాహారం



# ప్రాప్తమున్న తీరానికి..!!

## ఎం. ఏ. పద్మనాభ రావు

వీరారెడ్డి టైం చూసుకున్నాడు. సాయంత్రం అయిదవుతోంది. చూస్తున్న ఫైళ్ళు పక్కన పడేసి మొబైల్ తీసుకుని కొండబాబుకు ఫోన్ చేసాడు. కాల్ కనక్టయ్యింది. "బయల్దేరి వచ్చేయ్" హుకుం జారీ చేసాడు.

"రేపు దీపావళి పండుగని మావాళ్ళు ఈ రోజు డ్యూటి వద్దంటున్నారు సార్. నిన్న రాత్రి నుంచి వాన పడుతోనే ఉంది. పండక్కి మా అమ్మాయి, అల్లుడు వచ్చారు. వాళ్లున్నంత సేపు వాళ్ళతో ఉంటే బావుంటుంది కదా సార్. అదీగాక వానలో రాత్రి ప్రయాణం డేంజరని పిస్తోంది సార్" కొండబాబు అర్థింపుగా అన్నాడు.

"పండగకి మా అల్లుడు అమ్మాయి కూడా వస్తున్నారోయ్. అందుకేగా నీ కారు మాట్లాడుకున్నది. అయినా నర్సీపట్నం నుంచి రాజమండ్రీ ఎంతసేపు, గట్టిగా కొడ్తే మూడు గంటలు. తారీకు మారకుండా తిరిగి నువ్వు ఇంట్లో ఉంటావు. సరే, పండుగకు అల్లుడు అమ్మాయి వచ్చారంటున్నావుగా, నీ కారు బాడుగ కాకుండా మరో వెయ్యి రూపాయలిస్తాను. పండుగ సంతోషంగా చేసుకో. ఇంకేం ఆలోచించకుండా కారు తీసుకుని రా. మరీ ఆలస్యమైతే నువ్వు భయపడుతున్నట్టు జరుగుతుందేమో? ఏం చెప్పగలం!" నొప్పక తానొవ్వక రీతిలో ప్రలోభ పెట్టాడు వీరారెడ్డి.

వీరారెడ్డి ఓ ప్రభుత్వ అధికారి. అదనపు రాబడి, మంచి పలుకబడి ఉన్న పోస్టును కొనుక్కుని నర్సీపట్నం వచ్చి ఆరు నెలలయ్యింది. వీరారెడ్డి బాగా తింటాడు, తినిపిస్తాడు కూడా. అందుకనే అతనంటే పై వాళ్లకి, కింద వాళ్లకి ధన వ్యామోహంతో కూడిన ప్రేమ. రాజమండ్రీ సొంతూరు, సొంతిల్లు కూడా అక్కడే. కడియంలో బావమర్ది పేరు మీద అయిదెకరాల నర్సరీ, నగరం నలుమూలలా బినామీ పేర్లతో స్థలాలు. వెరసి ఓ అయిదు కోట్ల పై చిలుకు ఆస్తి అక్రమంగా గడించాడని చెప్పుకోవచ్చు. ఆ ఆస్తిపై అజమాయిషీ భార్య కనుసన్నలలో జరుగుతుంది కనుక కాపురం రాజమండ్రీలోనే. రెండు మూడు నెలల కోసారి, పండుగలకు, పబ్బాలకు కొండబాబు కారుపై రాజమండ్రీ వెళ్తుంటాడు.

***

కథా మంజరి పది కథల సమాహారం

ఆగకుండా కురుస్తున్న వానకు వాగులు వంకలు పొంగి పోర్లుతున్నాయన్న వార్తలు కొండబాబుని ఆందోళనకు గురి చేసాయి. కొండబాబు లాంటి కష్టజీవులుని, ఆర్థిక ఆవసరాలు జీవితాంతం అవస్థ పెడ్తూనే ఉంటాయి. వాళ్లకి వానా వరదా ఓ లెక్క కాదు. జీవితంలోని చిక్కుముడుల లెక్కలను డబ్బొక్కటే విప్పగలదని నమ్మాల్సిన పరిస్థితి వాళ్ళది. వెయ్యి రూపాయలకు ఆశ పడో, లేక మాట తప్పకూడదనో, అయిష్టంగానే ప్రయాణమయ్యాడు కొండబాబు. వీరారెడ్డి సూట్కేసును డిక్కీలో పెట్టి, అతని చేతిలో ఉన్న బ్యాగ్ కూడా పెడదామని తీసుకోబోతే ఇవ్వలేదు. ఆ బ్యాగుని భద్రంగా పక్కనే పెట్టుకుని వెనక సీట్లో దర్జాగా కూర్చున్నాడు వీరారెడ్డి. ఆ గాలి వానలో కారు కదిలింది.

మెల్లగా చీకటి ముసురుకుంది. టైం చూసాడు వీరారెడ్డి విసుగ్గా, అప్పుడే ఏడైపోతోంది. వాన జోరు పెరిగింది. గాలి విసురుగా వీస్తోంది. విరామం లేకుండా వైపర్లు కదులుతున్నా, నీళ్ళ జోరుకి రహదారి సరిగ్గా కనబడటం లేదు. "సార్ వానలో డ్రైవింగ్ కష్టంగా ఉంది. ఎక్కడైనా కాస్త టీ తాగి ముందు ముందు రోడ్డేలా ఉందో కనుక్కుంటా?" అన్నాడు కొండబాబు.
"బయల్దేరి గంటవ్వలేదు. అప్పుడే టీ ఏంటి? ఇప్పటి వరకు బానే ఉందిగా, ముందు కూడా బానే వుంటుంది. ఎవర్నీ అడగక్కర్లేదు పోనీయ్" అధికార దర్పంతో గదమాయించాడు వీరారెడ్డి. వెల్తురుని మింగేసిన మబ్బులా, భయం కొండబాబుని మింగుతోంది. హోరు గాలికి విశృంఖలంగా ఊగుతున్నాయి రోడ్డు పక్కన చెట్లు. కారు టాప్ పై పడుతున్న చినుకుల చప్పుడు భయం గొలుపుతోంది. ఈ వాతావరణంలో ప్రయాణం ప్రమాదకరంగా తోచింది. కారు పక్కనాపి ఏం చెయ్యాలా అని ఆలోచిస్తున్నాడు కొండబాబు.
కొండబాబు ఆలోచనలను గమనించాడు వీరారెడ్డి. వేరే దారిలో వెళ్తున్న అతనిని తన దారిలోకి తెచ్చుకోవాలనుకుని "కొండబాబు...! అలా భయపడితే ఎలాగయ్యా? అయిదారు కార్లు మన కెదురొచ్చాయి. అంటే రోడ్డు బావున్నట్టేగా. కాదంటావా వెనక్కి వెళ్లిపోదాం. అంతేకాని కారాపుకుని అలా ఉండిపోతే ఎలా? ఏదోటి చెయ్యాలి!" అనునయంగా అంటూ బ్యాగు తీసుకుని ముందు సీట్లోకొచ్చి కూర్చున్నాడు. అనువున్న చోట అధికారాన్ని, అనువులేని చోట అల్పత్వాన్ని చూపించడానికి మొహమాట పడడు వీరారెడ్డి. "నేనున్నానుగా నీకేం కాదు పోనీయ్" కొండబాబు భుజంపై ప్రేమగా తట్టాడు. వీరారెడ్డి కపట ప్రేమ గ్రహించి, తప్పదన్నట్టుగా కారు స్టార్ట్ చేసాడు కొండబాబు. చిన్నగా నవ్వుకున్నాడు వీరారెడ్డి. అధికార దర్పంతోనే కాకుండా లోక్యంగా పనులు చేయించుకోడంలో ఆరితేరిన వాడు వీరారెడ్డి. అందుకే అక్రమ సంపాదన ఆనవాళ్ళు బయటకు రాకుండా ఉద్యోగం చేస్తున్నాడు.
"కొండబాబు...! పిల్ల లెంతమందోయ్ నీకు?" ఎంతో చనువుగా అడిగాడు వీరారెడ్డి.
"ఇద్దరాడ పిల్లల తర్వాత ఒకబ్బాయి సార్" ఉషారు తెచ్చుకున్నాడు కొండబాబు.
"అంటే మనిద్దరం ఒకే పడవలో...కాదు...ఒకే కారులో ప్రయాణిస్తున్నాం!" ఆప్యాయంగా అతని భుజం మరోసారి తట్టాడు వీరారెడ్డి. " అవునూ...! ఈ కారు నీ సొంతమా, అద్దెదా?"

"సొంతమేనండి. బేంక్ అప్పు తీసుకుని మూడేళ్ళ క్రితం కొన్నానండి. రాత్రి పగలు కష్టపడి అప్పు తీర్చుతూ పెద్దమ్మాయి పెళ్లి చేసేసానండి. మీలాంటి పెద్ద బేరాలు తగిలితే మరో ఏడాదిలో అప్పు పూర్తిగా తీరిపోయి బండి నా సొంతమై పోతుందండి. ఇక మా చిన్నమ్మాయి పెళ్లి, అబ్బాయి చదువు ఉంటాయండి. ఇంకాస్త కష్టపడి, ఎలాగో అలా ఆ రెండు చేయగలిగితే ఇంక నాకేం కావాలి సార్!" ఆశావహం అతని మాటల్లో తొంగి చూస్తోంది.

"నీ ఆశలు నెరవేరతాయి కొండబాబు. నువ్వేం చదువుకున్నావు? ఈ కారు కొనక ముందు ఏం చేసేవాడివి?"

"ఇంటర్ చదువాగిపోయినా, మంచి పుస్తకం కనిపిస్తే చాలండి, చదవకుండా ఉండనండి. చాగంటి వారిని, గరికిపాటి వారిని వింటానండి. మునుపు హైదరాబాదులో ఓ పెద్ద గవర్నమెంట్ ఆపీసర్ గారి దగ్గర చేసేవాడినండి. నాకు లైసెన్స్ ఇప్పించింది ఆయనే. మన సీకాకులపాయనండి. ఆయన బామ్మర్ది ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉండేవారండి. ఈమధ్యనే పార్టీ మారి మినిస్టర్ అయిపోయారండి. నేను ఆ ఆఫీసర్ గారి డ్రైవరుగా చేయలేదండి. రెండు మూడు నెలలకో పనిచ్చేవారండి. ఆ పని చేసినప్పుడు జీతం కాకుండా కొంత ముట్ట చెప్పేవోరండి."

ఏనుగు తొండంతో నీళ్ళు కొడుతున్నట్టుగా పడుతున్న వానకు, కారు అద్దం మసకబారి రోడ్డు సరిగ్గా కనబడటం లేదు. కళ్ళతో రోడ్డుని కొలుస్తున్నట్టుగా చూస్తూ కారు నడుపుతున్నాడు కొండబాబు.

"ఇంతకీ ఆ నమ్మకమైన పనేంటో...? ఆ సారు ఇంకా సర్వీసులో ఉన్నాడా?" తిరిగి అడిగాడు వీరారెడ్డి.

"ఎందుకులెండి పెద్దాళ్ళ విషయాలు" అని ఊరుకున్నాడు కొండబాబు. గుచ్చిగుచ్చిఅడిగాడు వీరారెడ్డి.

"ఆయన సెక్రటేరియట్లో ఓ పెద్దాపీసరు. పై సంపాదన ఎక్కువేనండి. ఎంతైయినా అక్రమం అక్రమమే కదండి. ఇంట్లో పెట్టుకోడానికి బయపడేవోరండి. ఆ అవినీతి డబ్బును కార్లో తీసుకెళ్తే పట్టుకుంటారని రైల్లో నేనట్టికెల్లి సీకాకులంలో ఇచ్చే వాడినండి. కాని, చివర్లో ఆ సారు రిటైర్ అయ్యిడానికి చాలా ప్రోబ్లెంసు వచ్చియండి. మొత్తానికి ఢిల్లీలో మంత్రులను పట్టుకుని, ఓ కోటి వరకు కర్చుపెట్టి, అతి కష్టం మీద కేసులేం లేకుండా రిటైర్ అయిపోయారండి. ఆ తర్వాత పక్షవాతం వచ్చేసి మంచం పట్టారు. కొడుకులున్నా ఆళ్ళు పట్టించుకోలేదండి. ఆయన సంపాదన ఆయన ప్రాణాన్ని కాపాడలేదండి. ఆయన చేసిన పాపం ఆయన్నే చుట్టుముట్టింది. కాలు చెయ్యి కదపలేక బాగా తీసుకుని పోయారండి. అప్పుడే నేను ఇక్కడ కొచ్చేసి కారు తీసుకున్నానండి!" కథలా చెప్పాడు కొండబాబు.

రేపు నీక్కూడా ఇదే గతి పడ్తుందని చెబుతున్నట్టనిపించి గుండెల్లో గుబులనిపించింది వీరారెడ్డికి. ఆ గుబులు బయటకు రాకుండా బ్యాగును గుండెలకు గట్టిగా అదుముకున్నాడు. ఆ బ్యాగులో మూడు నెలల సంపాదన పదిహేను లక్షలు ఉన్నాయి. ఈ పండక్కి అల్లుడు కియా కారుకి డిమాండ్ పెట్టాడు. అల్లుడి కోరిక

తీర్చుకుంటే అమ్మాయి అలుగుతుంది. తన అక్రమ సంపాదన గురించి పైవాళ్ళకు తెలిసినా, వాళ్ళ వాటా వారికి అందినంత కాలం తను భద్రమే. ఏమాత్రం తేడా వచ్చినా ఇంతే సంగతులు. ఆ ఆలోచనకు ఒక్కసారి వెన్ను జలదరించింది. అవినీతి... అవినీతని ప్రతివాడు ఉపన్యాసాలిస్తాడు. అసలు అవినీతిని విడదీసి సమాజాన్ని చూద్దామంటే కుదురుతుందా? చాక్లెట్ లంచం ఇవ్వకుండా స్కూలు కెళ్ళని కుర్రాడితో 'ఇది అవినీతిరా' అంటే ఇల్లు పీకి పందిరేస్తాడు. అంతెందుకు శోభనం గదిలో, కొంగుకి బంగారం కడితే గాని వంటి మీద చెయ్యి వెయ్యనియ్యదు కొత్త పెళ్ళాం. దాన్నేమంటారు? మంచి, చెడులా, నీతి, అవినీతి కూడా కలిసే ఉంటాయన్నది వీళ్ళకి అర్థం కాని విషయం. ఏదైనా సరే ఒకటున్నచోట రెండోది తప్పక ఉండి తీరాల్సిందే. కారు ఒక కుదుపుతో ఆగింది. పోలీసులు కారుని ఆపుచేసి కొండబాబుతో ఏదో అంటున్నారు. పోలీసుల్ని చూడగానే అంత వానలోనూ ముచ్చెమటలు పట్టాయి వీరారెడ్డికి. అతని మోహంలో మొదటిసారి భయాన్ని చూసాడు కొండబాబు. వెదుళ్ళగెడ్డ వాగు పొంగిందని ప్రవాహం ఉధృతంగా ఉందని రాకపోకలు ఆపుచేసారని, వెనక్కి వెళ్ళిపోతే మంచిదని చెపుతున్నారు. వీరారెడ్డి పోలీసుని పిలిచి తనెవరో చెప్పి జేబులోంచి రెండు అయిదొందలు తీసి పోలీసు చేతిలో పెట్టాడు. అవి తీసుకున్న పోలీసు బారికేడ్స్ దగ్గరున్న ఇంకో పోలీసుతో ఏదో చెప్పాడు. వాడు బుర్రూపేసరికి కారుని పోనీమన్నాడు వీరారెడ్డి. ఆ పోలీసు వీరారెడ్డికో సెల్యూట్ పెట్టాడు. 'చూసావా...! డబ్బుతో కాని పనుండదన్నట్టుగా' గర్వంగా నవ్వాడు. కాని కొండబాబుకి వీరారెడ్డి నవ్వు వెనుక చావుని కూడా చౌకగా కొనచ్చన్న నిజం ఉందనిపించింది. రోడ్లు కాలువల్ని మరిపిస్తున్నాయి. కారు నీళ్ళని చేధిస్తూ ముందు కురికింది. కాని కొండబాబు మనసు వీరారెడ్డి పనిలో ఔచిత్యాన్ని వెదుకుతోంది. అతనిలో ఆలోచనలు అగ్గిలా రాజుకుంటున్నాయి. ఇతను మామూలు మనిషి కాదు. అవినీతి వ్యాధిని సమాజానికి అంటిస్తున్న అంటురోగి. అవినీతికి అలవాటు పడి వ్యవస్థను నాశనం చేస్తున్నాడు. నేను కూడా పరోక్షంగా అవినీతికి సాయపడ్తున్నానా? అతని మనసులో ఓ సందేహం మెరుపులా మెరిసింది. వెయ్యి రూపాయలతో నన్ను ప్రలోభపెట్టాడు. అదే వెయ్యి రూపాయలతో తన ప్రాణాన్ని...? ఆపై ఆలోచించలేక పోయాడు. కారు హెడ్ లైట్ల వెలుగులో దూరంగా వాగు పొంగి పోర్లుతోంది. చీకటిని కప్పుకున్న చెట్లు గాలికి ఊగుతూ భయంకరంగా కనిపిస్తున్నాయి. అడుగు దూరంలో కాజ్ వే. కొండబాబు సడెన్ బ్రేకేసాడు. కారు ఆగిపోయింది. హెడ్ లైట్లు కూడా ఆర్పేసాడు. చుట్టూ కటిక చీకటి, ఎక్కడ చూసినా నీళ్ళే. ముందూ, వెనకా, కింద, పైనా. ఆ నీళ్ళు శబ్దాన్ని భరించలేక పోతున్నాడు కొండబాబు. ఆ చిక్కటి చీకట్లో కన్నీరు నిండిన అతని కళ్ళు భయంతో మెరుస్తున్నాయి. ఒక్కసారిగా గొంతు విప్పాడు.

"సార్...! రక్షించే కంచెకు చేనుని ఎర చూపి, అది చేను మెడకు బిగుసుకునేలా చేసారు. లంచమిచ్చి చావుని కొన్నారు సార్. డబ్బుతో ప్రాణాలని తూకం వెయ్యొద్దు సార్. ఇందాకా పోలీసు సెల్యూట్ చేసినప్పుడు నవ్వారే... ఆ నవ్వులో నాకేం కనిపించిందో తెలుసా సార్? ఓ విషాదం...ఓ ప్రమాదం. ఈ చీకటి, ఈ నీళ్ళు

నన్ను భయపెట్టున్నాయి, కష్టాల సుడిగుండంలోకి తోస్తున్నాయి. ఇప్పుడు మనల్ని డబ్బు రక్షించదు సార్. మనం వెనక్కి వెళ్లి పోదాం సార్. నా మాట వినండి." ఏడుపును దిగమింగుతూ అన్నాడు.

"కొండబాబు...! కూల్...కూల్. నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డు. ప్రమాదాలకి భయపడి ప్రయాణాలు మానేస్తే ప్రపంచం ఆగిపోతుంది. మనం వేసే ప్రతి అడుగులోను ప్రమాదం పొంచి ఉండొచ్చు. అంతమాత్రాన వెనకడుగు వెయ్య కూడదు. సమయస్ఫూర్తితో ఎదుర్కోవాలి. అందుకోసం నువ్వే మార్గం ఎంచుకుంటావన్నది అప్రస్తుతం. ఎదురుపడ్డ ప్రతీ అవకాశాన్ని తన కనువుగా మార్చుకునే వాడే తెలివైనవాడు. డబ్బు మనల్ని రక్షించదంటున్నావు. అది నీ భ్రమ. సర్వకాల సర్వావస్థలలో డబ్బు డబ్బే. నువ్వైనా, నేనైనా, ఎవరైనా సరే డబ్బు లేందే బతకలేం. డబ్బు కోసమే కదా నువ్వింత కష్ట పడుతున్నది. నీ పిల్ల పెళ్లి చేయాలన్నా, నీ కొడుకుని చదివించాలన్నా కావాల్సింది డబ్బేగా. ఈ సమాజం నీ డబ్బుని చూసి నీకు గౌరవమిస్తుంది. ఆ డబ్బు ఎలా సంపాదించావని అడగదు. ఇదిగో ఈ బ్యాగులో పదిహేను లక్షలు ఉన్నాయి. ఒకవేళ నీకేమైనా ప్రమాదం జరిగితే ఈ డబ్బు నీ కుటుంబానికిస్తాను. కాదూ, ఆ ప్రమాదం నాకే జరిగితే, దీన్ని నువ్వే తీసుకోవచ్చు. అలా కాక ప్రమాదం మన ఇద్దరికీ జరిగితే ఈ డబ్బు ఎవరికి ప్రాప్తముందో వాళ్ళకి చేరుతుంది. ఇక ఆలోచించక కారు పోనీ!" అంటూ కిందకి చూసాడు వీరారెడ్డి. కారులోకి నీళ్ళు వచ్చేసాయి. నీటి ఒరవడికి కారు ఊగిపోతో ప్రవాహం లోలోపలికి పోతోంది. ఉద్భృతమైన వాగు వేగానికి ఎండుటాకులా తేలిపోతూ ఎక్కడికో పోతోంది. మునుగుతున్న కారు నుండి బయట పడడానికి విశ్వప్రయత్నం చేస్తున్నారు ఆ ఇద్దరూ. ఉన్నట్టుండి కారు డోరొకటి తెరుచుకుంది. నీటి వేగానికి బ్యాగుతో సహా కారులోంచి బయటపడి కొట్టుకుపోతున్నారు.

***

'హోరు వానలు, జోరు వరదలతో రాష్ట్రం అతలాకుతలం. రైతన్నకు కడుపుకోత. కూడు, గూడు కోల్పోయిన అభాగ్యులు. నర్సీపట్నం తుని మార్గంలో పెదుళ్లగెడ్డ వాగులో కారు గల్లంతు. కారులో ఉన్న ఇద్దరిలో ఒకరు కొట్టుకుపోగా, మరొకరిని రక్షించిన స్థానికులు' టీవీ న్యూస్ చానెల్ లో పదేపదే అదే వార్త ప్రసారమవుతోంది.

***

వారం తర్వాత. అదే న్యూస్ చానెల్ లో బ్రేకింగ్ న్యూస్...!!

"విశాఖ జిల్లా కలక్టర్ కార్యాలయంలో కలకలం రేపిన బ్యాగు. బాంబ్ స్క్వాడ్ రాక. బ్యాగులో పదిహేను లక్షల నగదు. ఆ నగదును వరదభాదితుల సహాయానిధికి జమ చేయమని అనామకుడు పేరుతో ఓ ఉత్తరం. ఇంకా ఆ ఉత్తరంలో ఏముందంటే! 'ఓ మనిషి...! ధర్మాన్ని రక్షించు, ప్రకృతిని పరిరక్షించు. ఆవే నీ మనుగడకు మూలాధారం...! బ్యాగుని, డబ్బుని ఉత్తరాన్ని మార్చి మార్చి చూపిస్తున్నారు టీవీ తెరపై!!

***0***

కథా మంజరి
పది కథల సమాహారం

# సబ్ కో సన్మతి దే భగవాన్



రాపాక కామేశ్వర రావు

"అప్పా గలాసుడు నీళియ్యవా పిల్లడికి నోరెండిపోతంది!" బుర్రపైనున్న కుండల బరువుని ఒడుపుగా కిందకు దించి రోడ్డుపై పెట్టి, ఆ వీధిలోని ఒక అరుగుపై కూర్చొని, ఆ ఇంటి మహలక్ష్మిని అడిగింది లచ్చిమి.
"ఎవరే నీకు అప్ప, నీ జాతేటి నా జాతేటి" అని విరుచుకుపడింది మహలక్ష్మి. "నా పెద్దయ్య కూతురివా పిన్నమ్మ కూతురివా?
"తప్పయిపోయిందమ్మా, కొద్దిగ నీళియ్యమ్మా పిల్లడికి తాగడానికి!"

ఆదివారం అయినందునేమొ ఆదిత్యుడు మండిపోతున్నాడు. రొప్పుతూ చెమటలు కారుతున్న పిల్లవాడి అవస్థ చూసి జాలిపడినట్లుంది మహలక్ష్మి. ఒక ముంతతో నీళ్ళు పట్టుకొచ్చి "చెయ్యి పట్టు పోస్తాను" అంది.
"గలాసలియ్యమ్మా పిల్లడు అలాగ తాగలేడు!" అని లచ్చిమి చెప్పే లోపే ఆవురావురుమంటున్న పిల్లవాడు చెయ్యి చాచి దోసిలిపట్టాడు. మహలక్ష్మి ముంత వంచి అతని దోసిలిలో పోయసాగింది.
"ఏమయిందక్కా ఎవరిపైన కేకలేస్తున్నావు?" అంటూ ఎదురింటి నాగమణి బయటికొచ్చింది.
"ఏమిలేదే, ఇది నాకు అప్పా గిప్పా అని పిలుస్తుంది!" లచ్చిమి వైపు చూపిస్తూ పిర్యాదు చేస్తున్నట్టు చెప్పింది మహలక్ష్మి.
"ఆ పెద్ద వీధి కెళ్ళి వాళ్ళని అమ్మా బొమ్మా అంటారు. ఇలాగ అరుగుల మీద కూర్చోగలరా అక్కడ!" మహలక్ష్మి నోరు చిటపటలాడుతుంది
"మీరు కూడ అంతే కదమ్మా. పెద్ద ఈదోలకి అమ్మా అనే అంతారు కదా"
"అయ్యోరులున్న ఈదికెల్తె ఆమడ దూరం నిలబడతారు!" అంటూ గొణుక్కుంది లచ్చిమి.

ఆ మాటలు పైకి అంటె వీధిలో వాళ్ళంతా కలిసి ఒక్కటై కలబడతారని గ్రహించింది.
కాని ఆ పక్క ఇంటి అరుగు మీద కుర్చీలో కూర్చొని, హాల్ లోని టి వి లో గాంధి జయంతి సందర్భముగా వస్తున్న "గాంధీ పుట్టిన దేశం" సినిమా చూసుకుంటున్న నాకు ఆ మాటలు లీలగా వినిపించాయి.
ఇలాంటి దృశ్యాలు నేను చిన్నప్పటి నుండి చూస్తున్నాను. ఇది నాకు కొత్త కాదు. ఆ కుండలమ్మే లచ్చిమిని కూడ నేను చాల సార్లు చూసాను.  కాని ఎందుకో ఈ రోజు వాళ్ళ సంభాషణ విన్న నాకు మనసు చివుక్కుమంది. ఆ పిల్లవాడి లేత మనసుకి ఇవేవీ అర్థం కావు కాబట్టి ప్రశాంతముగా ఉన్నాడు.
ఇంకా ఈ రోజుల్లో కూడ అస్పృశ్యత ఇంతలా రాజ్యమేలుతుందా! "హే రాం!" అని నిట్టూర్పు వదిలాను తప్ప, ఆడవారి మధ్యకు వెళ్ళడమెందుకని ఆ విషయములో కలుగజేసుకోలేదు.

ఈ ప్రహసనంలో తన ప్రమేయం లేనట్టు పిల్లవాడు అచేతనముగా నిలబడ్డాడు. నీళ్ళు తాగడం అయిపోగానే, తడి చేతులు చిరుగుల చొక్కాకు తుడుచుకుని, తన ప్రమిదలు ఎన్ని మిగులున్నాయో లెక్క పెట్టుకుంటు తల పైకెత్తి నా వైపు చూసాడు.
ఆ పిల్లవాడికి సైగ చేసి దగ్గరకు రమ్మన్నాను.
"నీ పేరేంటి?"
"గోపాలదాసు"
"చదువుకుంటున్నావా?" నా ప్రశ్న
"ఐదో క్లాస్" గోపాలదాసు జవాబు "ఈ ప్రమిదలు నేనే చేసాను"
చంద్రయానానికి ఉపగ్రహం తయారు చేసినంత ఆనందం ఆ కళ్ళలో.

***

లచ్చిమి, భర్త రంగదాసు, అత్త పోలమ్మ, మామ నరసయ్య మొత్తము కుటుంబమంతా వారము రోజులు కష్టపడి పని చేస్తారు. లచ్చిమి, రంగదాసు ఇరువురు ఒకరికొకరు తోడుగా ఊరవతల దొరికే బంక మట్టి కోసం ఎండ పొడ తగలకుండా పొద్దున్నే బయలుదేరి వెళ్ళి మట్టిని తవ్వుకొస్తారు.  అలా తెచ్చిన మట్టిని నీళ్ళతో తడియబెట్టి పిసికి పిసికి, మెత్తగా మెదాయించి, పెద్ద పెద్ద ముద్దలుగా తయారు చేసి పెడతారు అత్తాకోడళ్ళు. తరువాత వాటిని సారె మీద కూర్చోబెడతారు. ఇక రంగదాసు రంగ ప్రవేశం చేస్తాడు.
రంగదాసు అపర బ్రహ్మలా ఆ మట్టితో కుండలు, కూజాలు, మూకుడ్లు, దాకలు, నీళ్ళ తొట్లు, బానలు, పూల కుండీలు మొదలైన కళాకృతులు అవలీలగా తయారు చేస్తాడు.  చిన్న పిల్లల కోసం జంతువుల బొమ్మలు, వినాయక చవితి సమయములో మట్టి వినాయకుల్ని తయారు చేయడంలో కూడ అతనిది అందె వేసిన చెయ్యి.  సారె తిప్పడంలో ఆరితేరిన నరసయ్య చేతులు కూడ ఊరికే ఉండలేక కొడుకు చేసే పనిలో చేదోడుగా ఉంటాయి.

రంగదాసు కావడికి రెండు వైపుల మోపులు కట్టి, దగ్గర్లోని ఆదివారం సంతకు తీసుకెళ్తాడు. అక్కడకు చుట్టుపక్కల గ్రామ ప్రజలు వచ్చి కొనుక్కుంటారు. మట్టి పాత్రలు పల్లె ప్రజలే ఎక్కువగా వాడతారు కాబట్టి, సంతలోనే వారి వస్తువులు బాగా అమ్ముడవుతాయి. చీకూ, చింతా లేకుండా బ్రతకాలంటె వేన్నీళ్ళకు చన్నీళ్ళలాగ భర్తకు అమ్మకంలో సాయం చెయ్యాలని లచ్చిమి కూడ ఒక మోపు కట్టి, తలపై పెట్టుకుని వీథుల్లో తిరిగి అమ్ముతుంది.

ఆ రోజు ఆదివారం కావడంతో కొడుకు గోపాలదాసు కూడ ఆమెను అనుసరించాడు. గోపాలదాసు చిన్న చిన్న ప్రమిదలు చెయ్యడం తండ్రి దగ్గర నేర్చుకున్నాడు.

దీపావళి పండుగ సమీపిస్తుండడముతో ఆ ప్రమిదల్ని అమ్మి తన సంపాదనతో కాకరవత్తులు, మతాబులు, భూచక్రాలు కొనుక్కోవచ్చని ఏదో చిరు కోరిక ఆ చిన్ని మెదడులో ప్రవేశించింది.

***

ఇంకా నలుగురు మూగి అవాకులు చవాకులు పలకకుండా పయనమవ్వడం మంచిదనుకుందేమో,

"అయ్యా ఒక సెయ్యెయ్యవా.." అని అటుగా వెళ్తున్న ఒక యువకుడిని పిలిచింది లచ్చిమి. అతని సాయంతో కుండల బరువు మళ్ళీ బుర్రనెక్కించుకుని నడవసాగింది. గోపాలదాసు లేగ దూడలా ఆమె వెంట నడుస్తున్నాడు.

వాళ్ళు వెళ్ళిన కొంతసేపటికి బజారుకు వెళ్దామని నేను బయలు దేరాను. వేరొక వీధిలో కొన్ని కుండలు అమ్మి మళ్ళీ మెయిన్ రోడ్డు మీదికి వచ్చారు లచ్చిమి, గోపాలదాసు. నాకు పది అడుగుల దూరంలో ముందు నడుస్తున్నారు. అలా కొంత దూరం వెళ్ళిన తరువాత బజారుకు దగ్గర్లోని ఒక వీధి దగ్గర ఆగి

"అమ్మా ఈ వీధిలోకెల్దామే!" అని గోపాలదాసు అన్నాడు.

"వద్దురా, ఆ ఈదికి మనమెళ్ళకూడదురా"అని మందలించి "బేగిరా .. బజారులో కూకొని అమ్మొచ్చులే అక్కడికొచ్చి కొనుక్కుంతారు" అని బుర్ర మీది బరువు వలన వచ్చే లయబద్ధమైన పరుగులాంటి నడకతో సాగింది.

***

నాకు ఈమధ్యనే వాట్సాప్ లో వచ్చిన మెసేజ్ గుర్తుకొచ్చింది.

పై మెట్టు కింది మెట్టుతో ఇలా అన్నదట "నేను నీ కన్నా పైనున్నాను నేను గ్రేట్ "

ఆతరువాత, కింది మెట్టు ఇంకా కిందికి చూసి, అక్కడ ఇంకో మెట్టుని గమనించి "నా కింద ఇంకో మెట్టుంది కాబట్టి నేను కూడ గ్రేట్" అన్నది. ఇలా ప్రతి మెట్టు తన కింద నున్న మెట్టును చూసి గ్రేట్ గా ఫీల్ అవుతాయి.

అలాగే సమాజములో నున్న ప్రతి మనిషి తన కులం కన్నా వేరొక కులం తక్కువ అనే భావనతో అంతరాలను పెంచి పోషిస్తున్నాడు.

కథా మంజరి
పది కథల సమాహారం

"హే రాం!" అని రెండో సారి నిట్టూర్చాను.

***

లచ్చిమి ఏ వీధికైతే మనం వెళ్ళకూడదురా అని అన్నదో, ఆ వెలి వీధి వాసి మా పంచాయతి సర్పంచ్ రాజారాం రోడ్డు మీదికి వస్తూ కనిపించాడు. రాజారాం నేను క్లాస్ మేట్స్. పదవతరగతి ఫెయిల్ అవ్వడం వలన చదువుకు ఫుల్ స్టాప్ పెట్టాడు. ఆ తరువాత పాసై పంచాయతి ఆఫీసులోనే గుమస్తాగా చేరాడు. నా ఈడు వాడు కదా, రెండేళ్ళ క్రితం రిటైర్ అయిపోయాడు. క్రిందటేడాది పంచాయతి ఎన్నికలలో మా పంచాయతి రిజర్వుడ్ అవ్వడం వలన, రాజారాంకు రూలింగ్ పార్టీ అభ్యర్థి అయ్యే అవకాశం దొరికింది. సునాయాసంగా విజయలక్ష్మి కూడ వరించింది.

రాజారాం నన్ను చూడగానే "నమస్కారం ప్రెసిడెంట్ గారు" అని విష్ చేసాను నవ్వుతూ.

"నమస్కారం మేనేజర్ గారు. అయినా ఈ నమస్కారాలు మన మధ్య అవసరమా!" అని అన్నాడు.

షేక్ హాండ్ ఇవ్వబోతూ చెయ్యి చాచాడు.

లచ్చిమి ఉదంతం చూసి ఉడికిపోయిన నాలోని అభ్యుదయవాదం, నా దాకా వచ్చే సరికి కులం మత్తులో కూరుకుపోయి చెయ్యి ఇవ్వాలా వద్దా అని సంశయిస్తుంది. అంతలో బుద్ధి పాదరసంలా మారి "కరోనా" అని నాచేత అనిపించింది.

మడి ముసుగులో సతమతమవుతున్న నా మనసుకు, కరోనా వలన ఒకింత ఊరట లభించింది.

"రండి మన పంచాయతి పార్కులో గాంధి విగ్రహానికి పూల మాలలు వెయ్యడానికి వెళ్తున్నాం!" అన్నాడు.

“సరే బజారుకు వెళ్ళి తిరిగి వచ్చినప్పుడు వస్తాను!” అని, నాదారిన నేను వెళ్ళిపోతూ, వాళ్ళు వెళ్తున్న వైపు చూసాను. రాజారాం వెనుక నలుగురంటె నలుగురే పంచాయతి ఆఫీసు సిబ్బంది ఉన్నారు. కనీసం వార్డు సభ్యులు కూడ లేరు. రాజారాం ఆ వీధివాడు అయినందువలనే ఈ వివక్ష అనుకున్నాను.

ఒకసారి ఆపార్కుని చూసాను. చిన్నప్పుడు ఈ పార్కులోనే ఆడుకునే వాళ్ళం. అందులో ఆఫీసు రూంలో ఒక రేడియో ఉండేది. ఆ రేడియోని కలుపుతూ పార్కు మధ్యలో ఒక ఐరన్ పోల్ పైన మైక్ కట్టి ఉండేవారు. సాయంత్రం ప్రాంతీయ వార్తలు వినడానికి ఎక్కువ మంది గుమిగూడేవారు. ఇప్పుడు రేడియో బదులు టివి ఉంది.

అలా నాలుగడుగులు వేసి బజారులో అడుగు పెట్టిన నేను ఒక దృశ్యం చూసి నిశ్చేష్టుడినయ్యాను.

లచ్చిమి ఎదురుగా ఒకామె నిలబడి కొన్ని కుండలు, ప్రమిదలు కొంటోంది.

"ఇందా ఈ నోటు తీసుకొని చిల్లరియ్యి!" అని ఆమె వంద రూపాయల నోటు ఇస్తుంది.

లచ్చిమి ఇంకో బేరం చూస్తుంది. గోపాలదాసు చెయ్యి చాచబోయాడు. "నీవుండురా, తీసుకోకు ఆ సట్టి లో వెయ్యి" అని లచ్చిమి ఆమెతో అంటుంది.

"హే రాం !" అని మరో సారి నిట్టూర్చాను

గాంధి విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం, టివిలో వస్తున్న సినిమా పాటను మైక్ లో వినిపిస్తున్నారు.

"గాంధీ పుట్టిన దేశం, రఘురాముడు ఏలిన రాజ్యం

ఇది సమతకు మమతకు సంకేతం, రఘుపతి రాఘవ రాజారాం .. పతిత పావన సీతారాం

ఈశ్వర అల్లా తెరే నాం .. సబ్ కో సన్మతి దే భగవాన్"

ఆ పాట పల్లవిలో చివరి వాక్యం నా మదిలో మరీ మరీ పల్లవిస్తుంది "సబ్ కో సన్మతి దే భగవాన్"

***0***

కథ
కథా మంజరి
పది కథల సమాహారం

# అప్పగింతలు



యమున చింతపల్లి

"ఎంత హాయిగా గడిచిందో ఈ రోజు. పెళ్ళికి అంత దూరం వెళ్ళి, ఇంత రాత్రి తిరిగి వచ్చినా, అలసట అనిపించటం లేదు!" అన్నాడు పందిరి మంచం ఎక్కి నడుం వాలుస్తూ సుబ్రహ్మణ్యం.

"అంతమంది బంధువులను కలిసి ఎన్ని జ్ఞాపకాల గనులు తవ్వాము .. మరి మనసు ఆనందంతో నిండిపోలా. అందుకే ఈ భాగ్యనగరంలో అంత దూరం వెళ్ళి వచ్చిన అలసట అనిపించటం లేదు!"

"నాకు మన పెళ్లి నాటి ముచ్చట్లు కూడా గుర్తుకొచ్చాయి!"

"అవును, నాకు కూడా గుర్తుకొచ్చాయి. ముఖ్యంగా అప్పగింతలప్పుడు! ఆ పిల్ల చూడండి, ఏ బాధ లేకుండా నవ్వుతూ తుళ్లుతూ అప్పగింతలు ఎంత హాయిగా చేయించుకుందో. నేనైతే అప్పగింతలప్పుడు ఎంతలా ఏడ్చానో!" అంది దేవకి.

"వాళ్ళు ఒకరికి ఒకరు పరిచయం ఉన్నవాళ్ళు. నాలుగేళ్లగా ఒకే చోట ఉద్యోగాలు చేసుకుంటున్నారు. మనకి అలా కాదు, అన్నీ కొత్తే. పెళ్లి చూపుల తరువాత మళ్ళీ మనం కలిసింది పెళ్ళిలోనే కదా. మరి ఆ మాత్రం భయం, భక్తీ ఆ కాసేపన్నా ఉండొద్దూ!" అన్నాడు నవ్వుతూ సుబ్రహ్మణ్యం.

"అవునవును .. ఆ తరువాత అది వంటబట్టి పోయి తేడా తెలియదు లెండి!"

"నీతో మాటలతో గెలవలేము తల్లీ. సరే కానీ, ఓసారి మన పెళ్లి ఆల్బమ్ తీసుకురా. ఎందుకో చూడాలనిపిస్తోంది!"

"ఏమిటీ, ఇంత హుషారు ఈ రోజు!" అంటూ ప్రక్కన చేరిన దేవకి, మంచం దిగి వెళ్ళి ఆల్బమ్ తీసుకొచ్చింది. ఇద్దరూ ఉత్సాహంగా ఒకరి ప్రక్కన ఒకరు చేరి, ఒక్కో ఫోటోతో పాటు మధుర స్మృతులలోకి కూడా తొంగి చూస్తున్నారు.

వారిద్దరూ జీవితపు మలిపొద్దులో ఉన్నారు. వారి వైవాహిక జీవితం వారికి బరువు, బాధ్యతలతో పాటు ముగ్గురు ముత్యాల్లాంటి పిల్లలిని కూడా ఇచ్చింది. విదేశాల్లో స్థిరపడ్డ పిల్లలు, వాళ్ళ పిల్లలు కూడా తరచుగా వీడియో కాల్స్ చేస్తూ ఉంటారు. ఏడాదికో, రెండేళ్ళకో ఇంటిలోనూ, కళ్ల ముందు ప్రత్యక్షమవుతూ ఉంటారు. మూడు విభిన్న దేశాలలో ఉన్న పిల్లలి దగ్గరికీ, వాళ్ళూ వెళ్ళి, అక్కడ ఉన్నవి చూసి ఆనందించి వచ్చారు. భారదేశం వదిలి, తమ దగ్గరకు శాశ్వతంగా వచ్చేయమన్న పిల్లల ప్రపోజల్ కి వారి స్వదేశం ప్రేమ అడ్డుపడింది.

"ఇప్పుడు బానే ఉన్నాముగా. అంత చేసుకోలేకపోతే వచ్చేస్తాములే!" అని సర్ది చెప్పారు పిల్లలికి.

"అప్పగింతలప్పుడే కాదు, పెళ్లి ఫోటోలన్నిటిలో నీ కళ్ల నిండా బెదురే!" అన్నారు ఫోటోల్లోకి పరిశీలనగా తొంగి చూస్తూ సుబ్రహ్మణ్యం గారు.

"మరే, అది ఇప్పుడా తమరు గమనిస్తున్నారు!"

"నిజంగా గమనించలేదా నేను దేవీ , నిజాయితీగా చెప్పు!" అన్నాడు ఆమె కళ్ళల్లోకి కళ్ళు పెట్టి చూస్తూ.

దేవకి చెయ్యి అడ్డుపెట్టుకుని ముసిముసిగా నవ్వింది.

"నేను ఇంత సీరియస్ గా అడుగుతుంటే ఎందుకో ఆ నవ్వు దేవి గారికి" అన్నాడు కినుకగా.

"మన అప్పగింతలప్పుడు ముచ్చట గుర్తుకొచ్చింది!" అంది మరింత నవ్వుతూ.

' ఏమిటీ?' అన్నట్లు చూసాడు తానూ నవ్వుతూ.

"'అప్పగింతలు' అనేది హృదయాలు బరువు ఎక్కించే ఘటన. అమ్మా, నాన్నలను, తోబుట్టువులను చివరికి ఇంటి పేరుతో సహా వదిలేసి, అత్తింటిలో అడుగు పెట్టటానికి నాంది అది. నా కళ్ళూ నీళ్ళతో నిండిపోయాయి. పాలల్లో ముంచి తీసిన చేతులు, మీ చేతుల్లో పెట్టి అప్పగిస్తున్నారు. నా కళ్ళల్లో నీళ్ళు బుగ్గల మీదకి జారుతున్నాయి. మీ అరచేతుల్లో ఉన్న నా చేతులను గబుక్కున గట్టిగా పట్టుకుని 'నువ్వు ఏడవద్దు. నాకూ ఏడుపొస్తోంది' అన్నారు. అంతే నాతో పాటు అందరం ఫక్కున నవ్వారు!" అంది అప్పటి సంఘటన తలపుతో ఇప్పుడొస్తున్న నవ్వు ఆపుకుంటూ.

"అవును దేవీ, నీ కళ్ళల్లో నీళ్ళు తట్టుకోలేకపోయాను!"

"అందుకేనేమో, ఆ తరువాత ఎప్పుడూ కన్నీళ్లు రానియ్యలేదు!" అంది ఇప్పుడు చెమ్మ చేరిన కళ్ళు ఒత్తుకుంటూ.

“ఏంటి, పిచ్చి మొఖమా .. ఇదిగో, ఈ ఫోటో చూడు .. మొదటోడి బారసాల అప్పటిది. దీనిలో కూడా అమ్మాయి గారి మొహంలో కంగారే!”

“అవును మహాశయా, వాడికి మూడో నెలలో నామకరణం చేశాము. తరువాత వాడిని ఎత్తుకొచ్చి, ‘నా ఇంటిలో పనులు ఎలా చక్క పెట్టుకోవాలి. పసి పిల్లాడిని పెంచటం ఎలా? పైగా ఇంట్లో సాయం చేసేందుకు పెద్ద వాళ్ళు కూడా ఎవరూ లేరు’ అని మనసులో బెంగ. అదే నా మొఖం లో కూడా కనపడుతోంది!”

“మరి అంత బెంగతో కూడా మరో ఇద్దరు పిల్లలికి జన్మనిచ్చావు” అన్నాడు ఆయన నిండుగా నవ్వుతూ.

“ ‘నేర్పుతా, నేర్చుకో’ అని మీరు ఇచ్చిన ధైర్యం‘” అంది నవ్వేస్తూ.

“ఏంటో, ఇంత జీవితం దాటి వచ్చామా?” అంది ఆల్బం ప్రక్కన పెట్టి, పడుకున్న ఆయన ప్రక్కలో ఒదిగి ఒదిగి పడుకుంటూ.

దగ్గరగా తీసుకుని నుదుట మీద ముద్దు పెట్టుకున్నాడు వాళ్ళది ‘తియ్యని జీవితం ‘ అన్నట్లుగా.

***

కాలానికి క్రమశిక్షణ ఎవరు నేర్పారో కానీ, చిత్రంగా అది ఒకే వేగంతో నడుస్తుంది. చలికాల మేమో, ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. దేవకి గారికి మటుకు కాళ్ళు, చేతుల్లో ముచ్చెమటలు పోస్తున్నాయి. మంచం మీద పడుకుని ఉన్న సుబ్రహ్మణ్యం గారి మీద నెమ్మదిగా చెయ్యి వేసి ‘ఏమండీ’ అంది.

ఉలూకూ పలుకూ లేదు. మరోసారి కదిపింది.

“ఏంటి దేవి, అప్పుడే తెల్లారిందా. నాకు కాఫీ కలపటం నేర్పుతానన్నావు .. అందుకా తొందరగా లేపుతున్నావు!” అన్నారు సుబ్రహ్మణ్యం గారు మెల్లగా లేచి కూర్చుంటూ.

“నాకు గుండె దడగా ఉందండీ!” అంది ఆయనకు దగ్గరగా ఆనుకుని కూర్చుని.

“ఏమయ్యిందీ...”

“కృష్ణారావు అన్నయ్య గారు, నిద్దట్లోనే దాటిపోయారట. వాళ్ళబ్బాయి ఇప్పుడే ఫోన్ చేశాడు!” అంది వస్తున్న దుఖాఃన్ని ఆపుకుంటూ.

“ఈశ్వరా” అంటూ మాట రానట్లు ఆగిపోయాడు ఆయన.

“యాభై ఏళ్ల పైన స్నేహం. చాలా బాధగా ఉంటుంది. ఓర్చుకోవాలి .. తప్పదు” అంది ఓదార్పుగా భుజం మీద చెయ్యి వేసి.

“జననం, మరణం తప్పదుగా! ఇహ వాడికి నాతో పని లేదు. ఋణం తీరిపోయింది. ఉన్నవారికే మన సానుభూతి, సహకారం అవసరం. పద, తయారవుదాము!” అన్నాడు తనని తాను సంబాళించుకుంటూ.

అరగంటలో వారు ఎక్కిన క్యాబ్ కృష్ణారావు గారింటికేసి బయలుదేరింది.

***

శరీరాలకన్నా మనసులు అలసిన వాళ్ళు పైకి మౌనంగా ఉన్నారు. దేవకి గుండెల్లో మటుకు తెలియని గుబులు రొద పెడుతోంది. అది ఓర్చుకోలేకేమో

కథా మంజరి
పది కథల సమాహారం

"వదినగారు చిన్నబ్బాయి దగ్గరికి వెడతారుట!" అంది దేవకి.

"మనలాగే వాళ్ళూ సొంత ఇల్లు, ఊరు అంత తొందరగా వదలరుగా. మరిప్పుడు ఈ ప్రయాణం దేనికీ"

"ఇక్కడ ఉంటే అన్నయ్యగారి జ్ఞాపకాలు ఇబ్బంది పెడతాయని"

"నాకే మనసు వ్యధ పడుతోంది. మరి జీవిత భాగస్వామి కదా, ఆవిడకు తట్టుకోవటం మరీ కష్టమే!"

మాటరానట్లు మూగగా ఉండిపోయింది దేవకి. ఉన్నట్లుండి "మీ భవిష్యత్తు ప్రణాళిక ఏమిటీ" అంది.

"నీ విచిత్ర ప్రశ్న ఏమిటీ?" అన్నాడు చిత్రంగా చూస్తూ సుబ్రహ్మణ్యం గారు.

"విచిత్రమేముంది, 'ప్రతిదానికి ప్లానింగ్ ఉండాలి' అంటూ పిల్లల చదువులకు సేవింగ్స్, ఎల్ఐసి పాలసీలు ..."

"అవన్నీ భవిష్యత్తు ఉన్నవాళ్లకి, ఈ ముసలాడికి కాదేమో!" అన్నాడు నవ్వుతూ.

తన కళ్ళల్లో చేరిన చెమ్మ, ఆయన కళ్ళల్లో పడకూడదన్నట్లు చిటుక్కున మొహం దించుకుంది ఆవిడ.

"పిచ్చిదానా .. ఏంటి ఆ కన్నీళ్లు!" అన్నాడు ఆవిడ తల మీద చెయ్యేసి.

"ఏమీ లేదు. మీరు చెప్పండి, నా తదనంతరం ముగ్గురు పిల్లల్లో ఎవరి దగ్గరికి వెడతారు?"

"ఏమిటీ, అప్పగింతలా?"

"మీకు ఏమీ రాదు. ఎలా వంటరిగా బ్రతుకుతారు!"

"కాఫీ కలుపుకోవటం, కూరలు తరగటం నేర్పిస్తున్నావుగా!"

"మీ కంతా ఎగతాళే!"

"ఆనాడు మీ నాన్న, నిన్ను నాకు అప్పగించాడు. ఇన్నేళ్లు భద్రంగా చూసుకున్నాను. ఇప్పుడు నువ్వు నన్ను అప్పగిద్దామని చూస్తున్నావా! పోనీ ఓ పని చెయ్యి"

"ఏమిటీ?" ఆసక్తిగా అడిగింది దేవకి.

"నన్ను ముందు పంపించి, నువ్వు తరువాత రా!"

"ఛా, ఏమిటా మాటలు!" అంది గొంతులో దుఖం అడ్డు పడుతుంటే.

" నాకన్నా చిన్నదానివి. అదే న్యాయం కూడా!"

"మీరు అశుభం మాటలు ఆపండి. మీ గురించి కన్నీళ్లు పెట్టుకోకుండా, బెంగ లేకుండా దాటిపోవాలని నాకు ప్రగాఢ కోరిక!" అంది గాఢంగా.

"నాకు తెలిసీ, నా చేత వలన, మాట వలన నిన్ను ఇబ్బంది పెట్టలేదు. కానీ ఈ విషయంలో, నేను నీ కన్నీళ్లు కోరుకుంటున్నాను. ఎందుకంటే, నీవు ప్రక్కన లేకుండా జీవితంలో ఏ భారమూ, బాధ్యత నేను భరించలేదు. ఆ శక్తి నాకు లేదు!"

ఉలిక్కిపడి చూసింది.

"నేను చాలా స్వార్థ పరుడిని!" అన్నాడు ఆయన నవ్వుతూ.

నిశ్చేష్టగా చూసింది దేవకి.

కథా మంజరి
మంచి కథల సమాహారం

“చూడు దేవీ, మన వయసు అయిపోయింది. జీవితం ముగింపుకు వస్తోంది. ‘ఎవరు ముందు ఎవరు వెనుక’ ఎవరికి తెలుసు!”

వింటున్న దేవకి మనసులోనే కాదు మొహంలోనూ నీలి నీడలు కమ్ముకున్నాయి.

“లభిస్తున్న ఒక్కోరోజూ, ఒక బోనస్ గా అనుకోవాలి. దానిని అప్పగింతల కోసం కాక, ఆస్వాదిస్తూ మరిన్ని అనుభూతుల్ని నింపుకోవాలి”

“అంటే, ‘నా తరువాత ఈయన ఏమైపోతారో .. మీకు పిల్లలలో ఎవరి దగ్గర సౌకర్యంగా ఉంటుందో, వాళ్ళ దగ్గరికి ఈయన చేరితే బాగుండును‘ అన్న ఆలోచన తప్పా ? ప్లాన్ చేసుకోకూడదా“ ఉక్రోషంగా అడిగింది దేవకి.

నిండుగా నవ్వాడు సుబ్రహ్మణ్యం గారు.

“చూడు దేవకి, ఒకరికి ఒకరం తెలియని మనమిద్దరం పెళ్లితో ముడిపడ్డాము. కొత్త బాధ్యతలు, మలుపులు నిభాయించుకోవటానికి కొన్ని ప్లాన్స్ వేసుకున్నాము. మరెన్నో నేర్చుకున్నాము .. ఒకరికొకరం కొన్ని నేర్పించుకుంటున్నాము కూడా!”

“అదే, నేనూ అనేది. ‘నా తదనంతరం మీ ప్రణాళిక ఏమిటీ’ అని..”

“ఇంకా అర్థం కాలేదా దేవకీ? జీవితంలో కొన్నిటికి మనం ప్లాన్ చేస్తాము. కొన్ని జీవితమే ప్లాన్ చేస్తుంది. అప్పటి వరకూ, కనీసం ఈ చివరి రోజులు అన్నా, దిగులు పడకుండా ఆనందంగా గడపటమే మన చేతుల్లో ఉంది!“ అన్నాడు నవ్వుతూ సుబ్రహ్మణ్యం గారు.

ఆ మాటల్లో అంతర్భావం అర్థమైన దేవకి ఆయన రెండు చేతులని తన చేతుల్లోకి తీసుకుంది. గాఢంగా ముద్దు పెట్టుకుంది. అప్పగింతల నాడు ఆ చేతుల్లో పొందిన స్వాంతన ఈ రోజు కూడా పొందింది.

***O***

కథా మంజరి
పది కథల సమాహారం



# అమ్మ మడి చీర

## భాగవతుల భారతి

చందనా బ్రదర్స్ .. రంగుటద్దాల మధ్య, రంగురంగుల మెరిసే విద్యుద్దీపాల మధ్య, ఎన్నో సందడుల మధ్య, గుంపులుగా గుంపులుగా వున్న జనాన్ని తప్పించుకుంటూ, "చీరెలు" అని బోర్డు ఉన్న కౌంటర్ దగ్గర ఆగింది సంధ్య. గుట్టల గుట్టల బట్టల మధ్యనుండి, నచ్చిన చీర తీయటమంటే మాటలా? అక్కడ నిలబడలేక, తటపటాయించింది.

"అమ్మా! నీకు చీర నేను సెలక్ట్ చేస్తా! అక్కడకూర్చో" అని, కౌంటర్ దగ్గర కుర్చీలో సంధ్యను కూర్చోబెట్టి, గుంపులోకి చొరబడింది మానస.

అరగంట గడిచాక వీరోచిత పోరాట యోధురాలికి మల్లే ముఖంపై ఓ చిరునవ్వు మెరుస్తుండగా, "అమ్మా! ఇదిగో!" అని చీర చూపించిన మానస చేతిని ఊతంగా చేసుకుని నిలబడింది సంధ్య. నిమ్మ పసుపు రంగు చీరకు ఎఱ్ఱ అంచు. నిశ్చేష్టురాలై చూస్తోంది సంధ్య.

"అమ్మా! ఏమంయిదమ్మా! నచ్చలేదా? వేరేది తీసుకురానా?" మానస కంగారుగా అడిగింది.

"ఒద్దు. ఒద్దు! ఇదే కావాలి!"

"మరి ప్యాక్ చేయిస్తా" అంది మానస.

"అదేం వద్దు. నేనే పట్టుకుంటాను" స్థిరంగా అంది సంధ్య.

"అమ్మా! నేను కూడా ఏమైనా కొందామనుకున్నాను. కాని ఎందుకో నీ ముఖంచూసి ఆరోగ్యం సరిగా లేదేమోననుకుని మానేసాను. ఏమైందమ్మా!" అడిగింది మానస.

అప్పటికే సంచిలోంచి బయటికి తీసి, చీరను చూస్తూ,

"ఇదే చీర, ఇదే చీర!" అంటూ గొణుగుతోంది సంధ్య.

మానస కంగారుపడి, వాహనం ఇంటికేసి ఉరికించింది. ఇల్లు చేరగానే తల్లికి చల్లని నీళ్ళిచ్చి, కాసిని మజ్జిగ త్రాగనిచ్చి, తన పనిలో నిమగ్నమైంది మానస తల్లిని విసిగించకుండా.

సంధ్య మనసు మనసులో లేదు. మంచం మీద చీరను పడేసి దాని మీద పడుకుని గతంలోకి జారుకుంది.

***

"సర్వమంగళ మాంగల్యే శివే సర్వార్థ సాధికే
శరణ్యే త్ర్యంబకే దేవి నారాయణీ నమోఽస్తుతే "

గొంతులో మార్ధవమైన మంత్రంతో పాటు, గంట గణగణతో, పూజ చేసి పిల్లలకు ప్రసాదాలు పెట్టటానికి, బయటికొచ్చేది అమ్మ. తలలో పువ్వులు పరిమళాలు వెదజల్లుతుండగా. ఎఱ్ఱంచున్న నిమ్మ పసుపు రంగు మడి చీరతో.

అమ్మ పవిత్రతతో వెలిగిపోయేది. చిరునవ్వులో తాదాత్మ్యం, మాటలో వాత్సల్యం, తొణికిసలాడేవి. ఆరుగురు ఆడపిల్లలు. ఇద్దరు మగ సంతానం. అందరినీ వరుసగా నుంచో బెట్టి, ప్రసాదాలు పెట్టేది. సంధ్య నాలుగో సంతానం. ఏ రోజుకారోజు మడి విప్పగానే, దాన్ని ఉతికి, మడితోనే ఆరేసి, మర్నాడు మళ్ళీ మడికి కట్టడం రివాజు.

'అమ్మ మడి ఎప్పుడు విప్పుతుందా' అని ఆడపిల్లలు ఎదురు చూసేవాళ్ళు.

"అమ్మా నిను తాకొచ్చా!" అని పదేపదే అడిగుతూ ఉండేవాళ్ళు.

మడివిప్పగానే అమ్మను తాకటం అదో అనుభూతి.

అమ్మ మడి చీర విడిచి మామూలు చీర కట్టగానే, ఆరుగురు ఆడపిల్లలూ ఎగబడి, ఆ చీర తీసుకుని, ఒకరు విడిచి ఒకరు ఆ చీరను అమ్మలా చుట్టుకుని, అమ్మలా స్తోత్రాలు చదివి, అమ్మలా గంట కొట్టి, నైవేద్యం పెట్టి, అచ్చం అమ్మలాగే, ప్రసాదాలు పెట్టినట్టు నటిస్తూ, భలే సరదా చేసేవారు. చీరను విప్పదీసి పరిచి, దాని మీదే కాసేపు పడుకుని అందరూ ముచ్చట్లు. "ఈ చీర నాదంటే నాద"ని గొడవలు. ఇదంతా చూసి,

"ఏమే దమయంతీ వీళ్ళ పెళ్ళిళ్ళయి అత్తగారి ఇళ్ళకు వెళ్ళేటప్పుడు, సారెతో పాటు చీరె ముక్కలు చేసి, పంచుతావా!"అని నవ్వేవాడు నాన్న.

మొగపిల్లలు గేలిచేస్తూ నవ్వేసి, వాళ్ళ ఆటలకు వాళ్ళు పరుగెత్తేవారు.

"ఏంటే! చీరను చింపేసి, నలిపేసి పాడు చేస్తారా? హన్నా! లేవండి దాని మీంచి, మళ్ళీ తడిపి ఆరేసుకోవాలి!" అమ్మ ఆత్మీయతతో కూడిన అదిలింపు.

అమ్మ ఆ చీర కచ్ఛాపోసి కట్టుకుంటే నిండుగా, ఆ పల్లెటూరి గుళ్ళో అమ్మవారిలా తోచేది. పిల్లలతో పాటు పెద్దల్నీ మంత్రముగ్ధులను చేసేది. అందుకే అమ్మ మడి చీరె సంధ్య జ్ఞాపకాలలో నిలిచిపోయింది. అందరికీ పెళ్ళిళ్ళయిపోయాయి. ఆఖరి ఆడపిల్ల పెళ్ళి కూడా చేసాక, అమ్మ ఆరోగ్యం క్షీణించింది. భూమి మీద తన పాత్ర ముగించుకుని వెళ్ళిపోయింది. తోబుట్టువులంతా అడపాదడపా కలుస్తున్నా, ఎవరిదారి వారిదయింది. కానీ ప్రతి ఆడపిల్లకూ, తల్లైనాక తప్పకుండా అమ్మ చేతి స్పర్శ, అమ్మ తాలూకు జ్ఞాపకాలూ చుట్టూ అల్లుకుంటాయి.

మళ్ళీ ఇన్ని సంవత్సరాల తర్వాత అదే రంగు, అదే అంచు చీర .. అమ్మ జ్ఞాపకాలలో సేదతీరి, శ్రీవారి పిలుపుతో బయటి కొచ్చింది సంధ్య.

***

యాదృచ్ఛికమో, నిజంగా అమ్మే పిలిచిందో రెండు రోజుల తర్వాత ఫోన్ వచ్చింది.

"సంధ్యా! పల్లెటూరిలోని ఆ యింటిని అమ్మేస్తున్నాము. తమ్ముడు కూడా వచ్చాడు. అమ్మా, నాన్నా పోయాక ఇంటి ఆలనా పాలనా చూసేవాళ్ళు లేక పాడైపోతోందే! మనమా .. ఉద్యోగరీత్యా ఎక్కడెక్కడో ఉంటున్నాం. ఇంటిని ఎవరూ పట్టించుకునే పరిస్థితి కాదు. అమ్మేసి తలా కాస్తా తీసుకుంటే పెద్దవాళ్ళ జ్ఞాపకంగా, ఏదైనా మనకు తోచింది కొనుక్కోవచ్చుగా!" అన్నాడు అన్నయ్య.

ఏదో తెలియని బాధ. "అలాగే అన్నయ్యా!' అంది సంధ్య గొంతు పెగుల్చుకుని.

"అందరి సంతకాలు కావాలి! ఫలానా తారీఖున అని తెలియగానే అందరికీ కబురు చేస్తా. ఆఖరిసారిగా అందరం ఆ యింట్లో అమ్మానాన్నల జ్ఞాపకాలతో గడుపుదాం."

అన్నయ్య ఫోన్ పెట్టేసాక "ఆఖరిసారిగా" అన్న అన్నయ్య మాటకు దు:ఖం పొంగుకొచ్చింది సంధ్యకు.

***

ఆ రోజు ఫోన్ రానే వచ్చింది. సంధ్య కుటుంబంతో సహా బయలుదేరింది. ఆ సరికే అందరూ ఎవరి చోటునుండి వాళ్ళు బయలుదేరారు. ఇంటి ముందు కారాపి ఇంటి వైపు చూస్తే ఎన్నో బాల్య స్మృతులు. అక్క చెల్లెళ్ళూ, అన్నదమ్ములూ ఒకరినొకరు పలకరించుకుంటూ, ఆలింగనాలూ, కనుచెమరింతలూ అయ్యాక, సంధ్య వెదకటం మొదలు పెట్టింది.

"దేని కోసం వెదుకుతున్నావే సంధ్యా!" పెద్దక్కఅడిగింది .

"నిధి నిక్షేపాల కోసమేమో!" బావల వేళాకోళం.

"అంత కన్నా విలువైనదే!" సంధ్య నవ్వింది.

"అమ్మాయ్! ఏ నిధినిక్షేపాలైనా కలిసి పంచుకోవాలమ్మాయ్" చెల్లెళ్ళ చమత్కారాలు.

పూజ గదిలోకి వెళ్ళి, తలుపులు మూసేసింది సంధ్య. అందరూ మాటలు ఆపేసి ఆశ్చర్యంగా, ఆత్రంగా ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. ఐదు నిమిషాలలో మళ్ళీ తలుపుతీసింది.

అందరూ కళ్ళల్లో కోటి కాంతిని నింపుకుని "సంధ్యా" అన్నారు ఒక్కసారిగా.

నిమ్మ పసుపు రంగు ఎఱ్ఱ అంచు అమ్మ మడి చీరెలో అమ్మలా సంధ్య. ఆ చీర కట్టుకుని, పూలు కోసుకొచ్చి, బిందెతో నీళ్ళు తెచ్చి, అమ్మ చదివే శ్రీసూక్తమ్ చదువుతూ పూజ చేసి, బయటికొచ్చి, అందర్నీ వరసగా నిలబెట్టి, ప్రసాదం పెట్టింది. అక్కా చెల్లెళ్ళందరూ సజలనయనాలతో అమ్మ, నాన్నలను గుర్తుచేసుకుంటూ, పాతబడి మసిబారిన ఆ చీరనే ఆత్మీయంగా స్పృశించారు. మళ్ళీ ఆ యింటికి రాలేమన్న నిజం జీర్ణించుకోవటానికి ప్రయత్నిస్తూ, భారమైన హృదయాలతో వెనుదిరిగారు.

సంధ్య మాత్రం శిధిలమైన అమ్మ మడి చీరతోనే, ప్రయాణానికి సిద్ధమైంది!!

***0***

కథా మంజరి

# తూరుపు సింధూరం

## కోయిలాడ రామ్మోహన రావు



“ఈ మాత్రం దానికే ఎవరయినా భవబంధాలు తెంపేసుకొని, ఇంత రాత్రివేళ ఇల్లొదిలి వెళ్ళిపోతారా? కనీసం చిన్న నోట్ అయినా రాసి పెట్టకుండా, ఇలా చెప్పా పెట్టకుండా ప్రియాతి ప్రియమైన భార్యను, అల్లారు ముద్దుగా పెంచిన కూతుర్ని వదిలి వెళ్ళాల్సిన అవసరం ఏమొచ్చింది?” అంటూ అంతరాత్మ నిలదీసి అడుగుతున్న ప్రశ్నలకు సిద్ధార్థ దగ్గర సమాధానం లేదు. వాటి గురించి ఆలోచించే ఓపికా లేదు. వెళ్లిపోవాలంతే ... అందరికి దూరంగా.. అందనంత దూరంగా.... ‘పిచ్చి జనానికి దూరంగా... బహు దూరంగా’ అనుకుంటూ రైల్వే స్టేషన్ వైపు దారి తీసాడే గాని, గమ్యమేమిటో తెలియదతనికి.  హైదరాబాద్  వెళ్ళే రైల్ ప్లాట్ ఫారం మీద సిద్ధంగా ఉండడంతో ఆ రైలే ఎక్కేసాడు. కానీ మధ్యలోనే  విజయవాడలో దిగిపోతాడని అతనికి అప్పుడు తెలియదు.

ట్రైన్లో కూర్చున్నాడేగానీ మనసంతా ఆలోచనలతో, గందరగోళంగా ఉంది. భార్య సుచరిత మాటలే పదే పదే గుర్తొస్తున్నాయి. “నాకు తెలుసండీ తెలుగంటే మీకెంత ఇష్టమో. కానీ రోజులతో పాటూ మనమూ మారాలి. ఇప్పుడు తెలుగుకి ఎక్కడ ప్రాధాన్యత ఇస్తున్నారు? అన్ని కాలేజిలలోనూ, మార్కులు ఎక్కువ వస్తాయని, దాని బదులు సంస్కృతం పెట్టారు. ఇక స్కూళ్ళలో కూడా దాని ప్రాధాన్యత తగ్గిపోయింది.  తెలుగు కూడా ఒక సబ్జక్ట్ అయినా అందరి కాన్సంట్రేషన్ లెక్కలమీదా, సైన్స్ మీదే కదా? మీకు తెలియదా, ప్రైవేట్ స్కూళ్ళలో తెలుగు మాస్టార్లను ఎలా ఉపయోగించుకుంటున్నారో?  గుమాస్తాలు చేసే పనులన్నీ వాళ్ళే చెయ్యాలి. స్కూలుకి పిల్లలు రాకపోతే, పేరెంట్స్ కి ఫోన్ చేసి, వాళ్ళను రప్పించాలి. ఫీజులు కట్టించుకోవాలి. హాజరు  పనులు కూడా చెయ్యాలి. వేసవి సెలవల్లో రెండు నెలల పాటు ఎడ్మిషన్ల కోసం ఇల్లిల్లు తిరగాలి. మునుపటి రోజులు కావండి. ఆ రోజుల్లో మీలాంటి మాస్టార్ల కోసం, కాలేజి యాజమాన్యాలు పోటీ పడేవి. అంతెందుకు? మీ పాఠాలు వినే కదా? నేను మీరంటే ప్రేమ పెంచుకుని, మా అమ్మా, నాన్నలకు ఇష్టం లేకపోయినా, వాళ్ళను బలవంతంగా ఒప్పించి, పెళ్లి చేసుకున్నాను. ఇప్పటికయినా మించి పోయింది లేదు. నా మాట విని, నాలాగే గ్రూప్స్ కి  ప్రిపేర్ అవ్వండి. మీ తెలివితేటలతో సులువుగా సాధించవచ్చు. నేనిలా రోజూ పోరుతూనే ఉన్నాను. మీరు మాత్రం మారడంలేదు!” అంటూ సుచరిత కన్నీళ్ళు పెట్టుకుంటుంటే మౌనంగా ఉండిపోవడం గుర్తొచ్చింది సిద్ధార్థకి.

అప్పుడు చేసిన తప్పు, ఇప్పుడు తెలిసి వస్తుందతనికి. ఉన్నవూర్లో, పెద్ద ప్రయివేట్ కాలేజిలో తెలుగు లెక్చరర్ ఉద్యోగం వచ్చేసరికి, మరో ఉద్యోగం కోసం ప్రయత్నం చేయకుండా, అదే శాశ్వతమనుకుని, ఆ ఉద్యోగంలోనే ఉండిపోయాడు చాన్నాళ్ళు. ఆ తర్వాత చాలా మార్పులొచ్చాయి. కరస్పాండెంట్ కొడుకు చేతిలోకి వచ్చింది కాలేజి. కొత్త ప్రణాళికలలో భాగంగా, సీనియర్ లెక్చరర్లను తీసివేయడం మొదలు పెట్టాడతను. ఎక్కువ జీతాలు తీసుకునే వాళ్ళ స్థానంలో, తక్కువ జీతాలతో కొత్తవాళ్ళను తీసుకోవడం మొదలు పెట్టాడు. 'పొమ్మన లేక పొగ బెట్టడం' వంటి ప్రయోగాలు, సిద్ధార్థ లాంటి వారు తామంతట తామే తప్పుకోవడానికి లాభించాయి. ఆ తర్వాత సిద్ధార్థ ఒక ప్రైవేట్ స్కూల్లో చేరినా అక్కడ ఇమడ లేక పోయాడు. ఫలితంగా ఇంట్లోనే ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. ఆ నరకాన్ని భరించలేక, ఇలా ఇల్లు వదిలేసి వచ్చేసాడు.

***

రైలు కిటికీలోంచి బయటకు చూస్తున్న, సిద్ధార్థకి దూరంగా ఒక మంచు తెర కనిపించింది. 'నీహారిక' అని మనసులో అనుకున్నాడు. నీహారిక అంటే మంచుతెర అని అర్థం. ఆ పేరంటే ఎంతో ఇష్టం కనుక, కూతురికి ఆ పేరే పెట్టుకున్నాడు. నీహారిక ఇప్పుడు మెడిసన్ చదువుతుంది. సిద్ధార్థ ఇంటికి దగ్గరలోనే సుచరిత తల్లితండ్రులు ఉండడంతో నీహారిక వాళ్ళ దగ్గర ఎక్కువగా ఉండేది. అందువల్ల వాళ్ళ ప్రభావం ఆ పిల్ల మీద ఎక్కువగా ఉంది. ఆమెకు తండ్రి అంటే చులకన భావం కలగడానికి అదో కారణం. కూతురి గురించి ఆలోచిస్తుంటే, తనింట్లో లేడనుకుని ఇంటికొచ్చిన స్నేహితురాళ్ళతో నీహారిక అన్న మాటలు గుర్తొచ్చాయి అతనికి.

"మా మమ్మీ చేసిన ఒకే ఒక తప్పు మా డాడీని చేసుకోవడమే. ఆయన అందం చూసి, ఇంకేమీ ఆలోచించకుండా, ఆయన్నే చేసుకుంటానని పట్టుబట్టిందట. మా అమ్మమ్మకి, తాతయ్యకి అస్సలు ఇష్టం లేదు. అప్పటికే ఐపిఎస్ పాసైన ప్రకాష్ అంకుల్ కి ఇచ్చి పెళ్లి చెయ్యాలని, వాళ్ళెంతో ప్రయత్నించినా మమ్మీ మూర్ఖంగా మొండిపట్టు వదల్లేదట. అలా అయితే ఎంత బాగుండును. మా మమ్మీ గ్రూప్ వన్ ఆఫీసర్, డాడీ పెద్ద పోలీస్ ఆఫీసర్. అబ్బ! ఊహించుకోవడానికే ఎంత బాగుంది! ప్చ్...ఈ జన్మకు ఆ అదృష్టం లేదు" అన్న మాటలు గుర్తొచ్చేసరికి అతని గుండెలెవరో పిండినట్లయింది. అతన్ని ఇంకా బాధించినవెన్నో ఉన్నాయి. స్ట్రిక్ట్ గా ఉండే సుచరిత అంటే పడని ఆమె తోటి ఉద్యోగులు "ఏం మాస్టారూ ? మీకు తెలుగులో ప్రావీణ్యం ఎక్కువ కదా? సినిమాలకో టీవిలకో కథలు, సంభాషణలు రాయ కూడదు? బోల్డంత గిరాకీ ఉంది వాటికి" అంటూ జోకులేసి శాడిస్టిక్ ఆనందాన్ని పొందేవారు. ఒకప్పుడు సుచరితను చేసుకోవాలని బాగా ఆశ పడిన ఆమె బావ, ఐపియస్ ప్రకాష్, అతని తండ్రి పరోక్షంగా చేసే హేళనలు కూడా గుర్తు రావడంతో మనసంతా చేదుగా అయిపోయింది. తన్నుకొస్తున్న దుఖాన్ని అదుపులో పెట్టుకొని, వెనక్కి వాలి, కళ్ళు మూసుకున్నాడు.

కాస్సేపటికి తేరుకుని, కాలక్షేపం కోసం కొనుక్కున్న 'తెలుగు జగతి' పుస్తకం తిరగేస్తున్నపుడు, 'రెండు లక్షలమంది తెలుగు వారున్న బంగ్లాదేశ్' అనే వ్యాసం అతని కళ్ళబడింది. అదే అతని జీవితాన్ని గొప్ప మలుపు తిప్పుతుందని అతనప్పుడు ఊహించలేదు.

***

"పిలుస్తానన్నారు. కాస్సేపు వెయిట్ చెయ్యండి. సార్ చాలా బిజీగా ఉన్నారు!" అని హరిశ్చంద్ర పి.ఎ. గణపతి అనగానే, ఒక్కసారిగా వెలుగొచ్చింది సిద్ధార్థ ముఖంలో. హరిశ్చంద్రను కలవడానికి, విజయవాడలో దిగిపోయిన సిద్ధార్థ, మూడు రోజులుగా ప్రయత్నిస్తున్నాడు. హరిశ్చంద్ర 'తెలుగు జగతి' మాస పత్రికాధిపతి. అతను చాలా పెద్దవాడు. ఆ పత్రికే గాక, తెలుగు, ఇంగ్లీష్ దినపత్రికలు, వార పత్రికలు, ఒక టీవి చానెల్, చాలా ఇండస్ట్రీలు ఉన్నాయతనికి.

గణపతే కావాలని కలవకుండా అడ్డుపడుతున్నాడని అనిపించినా ఏమీ చేయలేని పరిస్థితి సిద్ధార్థది. "సార్ తో ఏం పని?" అని అడిగితే, "ఒక సారి కలవాలి" అని అన్నాడే తప్ప, వివరంగా చెప్పకపోయేసరికి గణపతికి మంటగా ఉంది. చందా కోసమో, ఉద్యోగం కోసమో సిద్ధార్థ వచ్చి ఉంటాడని గణపతి భావించాడు. దాదాపు రెండు గంటలయ్యాకే సిద్ధార్థకి అవకాశం వచ్చింది. "మీ టైం ఐదు నిమిషాలే" అని హెచ్చరించి లోపలకు పంపాడు గణపతి. తలూపుతూ బెరుకుగా ఖరీదయిన ఛాంబర్లోకి అడుగుపెట్టాడు. హరిశ్చంద్ర ఏదో ఫైల్ చూసుకుంటూ కూర్చోమన్నట్లు సైగ చేసాడు. తడబడుతూ కూర్చున్నాడు సిద్ధార్థ. "చెప్పండి. ఏం పనిమీద వచ్చారు?" అంటూ ప్రశ్నించాడు హరిశ్చంద్ర కాజువల్ గా. సిద్ధార్థ గొంతు పూడుకుపోయింది. అతను బాగా టెన్షన్ పడుతున్నాడని అర్థమైంది హరిశ్చంద్రకి. "టెన్షన్ పడకుండా చెప్పండి. మీరు లెక్చరర్ కదా? ఎక్కడ? విశాఖపట్నంలోనా?" అంటూ సిద్ధార్థ పంపిన చీటీ చూస్తూ అడిగాడు. అవునన్నట్లు తలూపాడు సిద్ధార్థ. "సరే చెప్పండి" అన్నాడు హరిశ్చంద్ర. గొంతు సవరించుకొని "బంగ్లాదేశ్ లోని ప్రజలకు తెలుగు నేర్పుదామనుకుంటున్నాను. దానికి మీ సహకారం కావాలి!" అని గబా గబా అనేసాడు, బట్టీ పట్టిన విద్యార్థి పాఠం అప్పజెప్పినట్లు! ఆ ముక్క చెప్పడానికి మూడురోజుల నుంచి అతను రిహార్సల్ చేసుకుంటున్నాడు సిద్ధార్థలో ఉన్న బలహీనతే అది. అతనికి చొరవ బాగా తక్కువ. పరిచయంలేని పెద్దవాళ్ళతో ధైర్యంగా మాట్లాడలేడు. ఉపోద్ఘాతమేమీ లేకుండా మాట్లాడిన సిద్ధార్థ ని ఆశ్చర్యంగా చూసాడు హరిశ్చంద్ర.

"మీరు విన్నది నిజమే సర్. అక్కడివారి కోసం మీరు చేసినవన్నీ తెలుసుకున్నాను. ఉడతాభక్తిగా నేను కూడా కొంత సేవ చేయదలిచాను. తెలుగు బోధించడం తప్ప నాకేమీ తెలియదు. అందుకే అక్కడికి వెళ్ళి వాళ్లకు కావల్సిన తెలుగు నేర్పదలుచుకున్నాను!" అన్నాడు వినయంగా.

చిన్నగా నవ్వుతూ, చేస్తున్న పనిని ఆపి "నేనేం చేసానంటారు?" అంటూ అడిగాడు హరిశ్చంద్ర.

దాంతో ఉత్సాహం వచ్చింది సిద్ధార్థకి. "ఏం చెయ్యలేదని అడగండి. చెయ్యాల్సినవన్నీ చేసారు. మీ రిపోర్టర్స్ ని, చానెల్ టీంని పంపారక్కడికి. ఈ ప్రపంచానికి, ముఖ్యంగా మన తెలుగు వారికి తెలియని విషయాలెన్నో బయటకు తీసారు. మీ పత్రికలో చదివితేనే గదా అందరికి తెలిసింది, 'బంగ్లాదేశ్ లో రెండు లక్షలమంది ఏ

గుర్తింపూ లేకుండా ఉండిపోయారని! పంతొమ్మిదో శతాబ్దంలోనే, టీ తోటల్లో పనిచేయడానికి మన తెలుగు వాళ్ళు, ఉత్తరాంధ్ర నుంచి వేలసంఖ్యలో మూడు నాలుగు విడతలలో వలస వెళ్ళి, అక్కడ స్థిరపడ్డారని తెలుసుకున్నాను. తెలుగంటే వాళ్లకు అవ్యాజమైన ప్రేమ అని, పెద్దవాళ్ళు మాత్రమే మాట్లాడగలిగే తెలుగు, వాళ్ళతోనే అంతరించిపోయే దుస్థితి వచ్చినందుకు వాళ్ళంతా బాధపడని రోజంటూ లేదని, వాళ్లకు, వాళ్ళ పిల్లలకు తెలుగు రాయడం, చదవడంలో తర్ఫీదు ఇచ్చే టీచర్ల కోసం వాళ్ళు ఎదురుచూస్తున్నారని తెలుసుకొని బాధపడ్డాను. వాళ్ళక్కడ సెటిల్ అయి వందేళ్ళు దాటుతున్నా, ప్రభుత్వం వారికి ఏ రకమైన సౌకర్యాలు కల్పించడం లేదని, వాళ్ళను ఇప్పటికీ అధికారికంగా గుర్తించడం లేదని, అక్కడి జర్నలిస్ట్ 'ఖైరుల్కు యాదకర్' చెప్పేవరకూ మనకెవరికీ తెలియలేదు. కేవలం ఏభై వేలమంది మాత్రమే ఉన్న ఒరియావాళ్ళు ప్రభుత్వ రికార్డులలో చోటు సంపాందించుకున్నారు. కానీ, అంతకు నాలుగు రెట్లున్న మన తెలుగు వారికి ఆ ప్రాప్తం లేదని తెలుసుకొని చాలా బాధపడ్డాను!" అంటూ గుక్కతిప్పుకోకుండా మాట్లాడుతున్న సిద్ధార్థను మెచ్చుకోలుగా చూసాడు హరిశ్చంద్ర.

"గుడ్ ...ఆ వ్యాసం మీలాంటి వాళ్ళ కళ్ళబడడం శుభపరిమాణం. ముందిది చెప్పండి. మీరెవరు? ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారు? వివరంగా చెప్పండి!" అంటూ బెల్ కొట్టాడు. లోపలివచ్చిన గణపతి సిద్ధార్థనే చూస్తూ 'వీడింకా ఇక్కడే కూర్చున్నాడేమిటి?' అనుకున్నాడు. ఆ తర్వాత గణపతి డంగై పోవాల్సిన పరిస్థితి వచ్చింది. "రెండు స్ట్రాంగ్ కాఫీలు పంపవోయ్!" అని సిద్ధార్థ వైపు తిరిగి "మీకు కాఫీ ఓకేనా?" అని అడిగాడు. తబ్బిబ్బు అయిపోతూ తలూపాడు సిద్ధార్థ. అయోమయంగా చూస్తూ అక్కడినుంచి కదిలాడు గణపతి.

కాఫీలొచ్చేలోపులో తన కథ అంతా చెప్పుకొచ్చాడు సిద్ధార్థ. అది విన్న హరిశ్చంద్ర సానుభూతిగా అతని వైపు చూస్తూ "మన తెలుగు భాష, మీలాంటి తెలుగు పండితులు, మన దేశంలో ఇలా వ్యర్థంగా మిగిలిపోతున్నందుకు చాలా బాధగా ఉంది మాస్టారూ. మీ వల్ల అక్కడి సోదరులకు మేలు కలుగుతుందని నమ్ముతున్నాను. వీలైనంత త్వరగా మన ముఖ్యమంత్రిని కలుస్తాను. ఈ లోగా మీరొక ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారుచెయ్యండి. ఈ రోజే మీరు మా ఆఫీస్ గెస్ట్ హౌస్ లోకి మారండి. గణపతి అన్నీ ఏర్పాట్లు చేస్తాడు!" అనగానే సిద్ధార్థపై పన్నీరు జల్లు కురిసినట్లయింది.

***

"ఇదిగోండి సార్, సిద్ధార్థగారు తయారుచేసిన ప్రోజక్ట్ రిపోర్ట్ 'తూరుపు సింధూరం' అంటూ రిపోర్ట్ ని అందించాడు గణపతి. అతని మాటల్లో శ్లేష, వెటకారం ఇద్దరికీ అర్థమయింది. సిద్ధార్థ ఇబ్బందిగా కదలడం చూసి నవ్వుకున్నాడు హరిశ్చంద్ర. "ఏమోయ్ గణపతి ఈ రిపోర్ట్ కి ఈ టైటిల్ ఎందుకు పెట్టారంటావ్?" అని ప్రశ్నించాడు హరిశ్చంద్ర. ఆ ప్రశ్న ఊహించని గణపతి, సమాధానం తెలియక తల గోక్కున్నాడు. హరిశ్చంద్ర నవ్వి, "మనకు తూర్పునున్న బంగ్లాదేశ్ లో తెలుగు తిరిగి ఉదయించబోతుంది. ఉదయానికి సంకేతం సింధూరమే కదా! ఆ మాత్రం నీకు తట్టలేదా?" అంటూ సిద్ధార్థ వైపు తిరిగి, "ఈ టైటిల్ ఎంతో బాగుంది

మాస్టారూ. వండర్ ఫుల్. బంగ్లాదేశ్ రాజధానిలోనే కాక, పదిహేడు పల్లెలలోని తెలుగువారందరికీ మీ సేవలు అందించేలా మీరు వేసుకున్న ప్రణాళికలు, మీరు చేపట్టబోయే కార్యక్రమాలు చక్కగా ఉన్నాయి!" అని ప్రశంసిస్తుంటే, సిద్ధార్థ ఆనందంతో పులకరించిపోయాడు. అప్రయత్నంగా అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. తను సరైన చోటికే వచ్చానన్న ఆనందం, తృప్తి అతని ముఖంలో కనిపించాయి.

ఆ తర్వాత రెండు వారాలలో చాలా ప్రగతి కనిపించింది. హరిశ్చంద్ర చొరవతో రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు స్పందించారు. తగినన్ని నిధులు రెండు రాష్ట్రాలనుంచి వచ్చాయి. బంగ్లాదేశ్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, సిద్ధార్థ అక్కడుండడానికి ఆరు నెలల గడువిచ్చింది. ఇచ్చిన గడువు పూర్తికాకుండానే అతనెంతో ప్రగతిని సాధించాడు. ఎన్నాళ్ళనుంచో స్వచ్ఛమయిన తెలుగు కోసం మొహం వాచిపోయిన అక్కడి తెలుగు ప్రజల్లో ఆనందం వెల్లివిరిసింది. అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎత్తి చూపుతూ, అతను రాసిన సందేశపూరితమయిన నాటకాల ప్రదర్శన కారణంగా అతనికి విశేషమయిన ఆదరణ లభించడమే కాక, అతనాశించినట్లు, ప్రజల్లో చైతన్యం, ప్రభుత్వంలో కదలిక వచ్చాయి.

సిద్ధార్థ అక్కడ నాటిన తెలుగు విత్తనాలు బలంగా నాటుకున్నాయి. ఎన్ని తరాలయినా అక్కడ 'తెలుగు మనుగడ మాసిపోదు' అన్నట్లు ఆ విత్తనాలు మొక్కలయి, వృక్షాలయి శాఖోపశాఖలుగా విస్తరించడానికి ఎంతో కాలం పట్టదన్నట్లు, ఆ స్వల్ప కాలంలోనే అతనికెంతోమంది శిష్యులు, అనుచరులు తయారయ్యారు. అతను కలుగన్న 'బంగారు తెలుగు బంగ్లా' వాస్తవ రూపం దాల్చడానికి రంగం సిద్ధమయింది.

సిద్ధార్థ తలపెట్టిన కార్యం విజయవంతం కావడంతో మీడియా అతన్ని ఆకాశానికి ఎత్తేసింది. అతనికి అంతర్జాతీయ ఖ్యాతి లభించింది. ఎందుకూ పనికిరాదనుకున్న 'తెలుగు' అతన్ని అందలమెక్కించడంతో, అతన్ని ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ హేళన చేసిన వారంతా సిగ్గుతో తలలు దించుకున్నారు. అందరికన్నా ఎక్కువగా సిగ్గుపడింది, బాధపడింది అతని కూతురు నీహారిక. అంత వరకూ భర్త ఏమైపోయాడో అని దిగులు పడిన సుచరిత, సిద్ధార్థ సాధించిన ఘనకార్యానికి ఆనందంతో కన్నీళ్లు కార్చింది. భర్తతో మాట్లాడడానికి ఆమె చేసిన ప్రయత్నాలేమీ ఫలించకపోయేసరికి, ఆమె హరిశ్చంద్రను కలిసి, భర్తను వివరాలడిగింది.

"సిద్ధార్థ ఈ భవబంధాలకు అతీతుడయిపోయాడమ్మా. అతనిప్పుడు ఎవరినీ కలవడు. ఎవరితోనూ మాట్లాడడు!" అన్నాడు నచ్చచెపుతున్నట్లు. "నేనాయనభార్యనండీ..." అంటూ అతనికి గుర్తు చేస్తున్నట్లు చెపుతూ భోరుమంది.

"అయ్యో తల్లీ... నాకు తెలియదా? అతనిలో మార్పు గమనించి, భవబంధాలకు దూరం కావద్దని, కనీసం కుటుంబంతోనయినా బంధం నిలుపుకోమని అనేక సార్లు నూరిపోసాను. అయినా ఫలితం

లేకపోయిందమ్మా" అంటున్న అతని మాటల్లో బాధ, ఆవేదన ధ్వనించాయి. ఫలితం ఉండదని తెలిసినా సిద్ధార్థకి ఫోన్ చేసి, సుచరిత అతనితో మాట్లాడడానికి సిద్ధంగా ఉందని చెపుతూ ఫోన్ ఆమెకు అందించాడు.

"క్షమించండి.. నేనెవరితోనూ మాట్లాడదలుచుకోలేదు!" అంటూ ఫోన్ కట్ చేసేసరికి, ఏడుస్తూ కుప్పకూలి పోయింది. నీహారిక తల్లిని ఓదారుస్తూ కన్నీళ్లు కార్చింది. ఆమెను ఓదార్చడం ఎవరితరమూ కాలేదు.

చాలాసేపటివరకూ సుచరిత కోలుకోలేకపోయింది. ఆ తర్వాత, ఒక నిర్ణయానికి వచ్చినదానిలా "నేను బంగ్లాదేశ్ వెళ్తాను. ఎడ్రస్ ఇవ్వండి" అని అడిగింది. "ఉపయోగం ఉండదు తల్లీ, చాలా రోజులుగా అతన్ని స్టడీ చేస్తున్నాను కదా? అతనిప్పుడు బాగా మారిపోయాడు. చెప్పానుగా. భవబంధాలకు అతీతుడయిపోయాడని. ఊరికే శ్రమ పడడం తప్ప...." అంటుండగా అడ్డుతగిలి, ఉక్రోషం వెళ్లగక్కుతూ కోపంగా అంది,

"భార్యాభర్తలను కలిపే గొప్ప మనసుందనుకున్నాను మీకు. ఇలా మీరే అడ్డు తగులుతారని ఊహించలేదు!" ఆమె అలా అనేసరికి హరిశ్చంద్ర చాలా బాధపడ్డాడు.

"ఎంత మాట అనేసావు తల్లీ? చాలా మారిపోయిన సిద్ధార్థ గురించి నాకు బాగా తెలుసు కాబట్టి ఆ మాట అన్నాను. అతనికిప్పుడు జగమే కుటుంబం. ప్రపంచంలో నలుమూలల్లో ఉన్న తెలుగువారికే తన అవసరం ఉన్నదన్న ఆలోచన అతనిలో బాగా నాటుకుపోయింది. మలేసియా, సింగపూర్, దక్షిణ ఆఫ్రికా, శ్రీలంక మొదలైన దేశాలన్నీ ఇపుడు అతని కోసం ఎదురుచూస్తున్నాయి. అతనికి ఇప్పుడొక లక్ష్యం ఉంది. లక్ష్యానికి 'అర్థం' అని మరో పేరుందని నీకు తెలిసే ఉంటుంది. ఆ లక్ష్యాన్ని సిద్ధించుకుని, సార్థక నామధేయుడయ్యాడమ్మా నీ భర్త. నువ్వడిగిన బంగ్లాదేశ్ ఎడ్రస్ ఇదిగో. నీకు శుభం కలగాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను!" అంటూ పేపర్ని అందించాడు.


పంతం పట్టి ఎడ్రస్ సంపాదించిందే గానీ, ఆమెకూ తన ప్రయత్నం మీద నమ్మకం లేదు. దుఖం తన్నుకురాగా బరువెక్కిన హృదయంతో, కూతురితో కదిలిపోతున్న సుచరితనే సానుభూతిగా చూస్తూ నిలబడిపోయారు, తెలుగు జగతి ఉద్యోగులు. అందరి కళ్ళలోనూ ఆర్ద్రత. అందరిమనసులలోనూ ఒకటే కోరిక.... 'సుచరిత, సిద్ధార్థలు మళ్ళీ ఏకం కావాలి' అని.

***0***

కథా మంజరి
మది కథల సమాహారం

# కవచం

పి వి ఆర్ శివకుమార్



మౌనంగా గణేశ్ నే చూస్తూ కూర్చొని ఉన్నాడు అభినవ్. ఇరవై రెండేళ్ల గణేశ్ లేతగా ఉన్నాడు. కానీ, వడలిపోయి ఉన్నాడు. కదిలిపోయినట్లు తెలుస్తున్నాడు. నిరాశా నిస్పృహలు అతడి ముఖంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. అతడు హాస్పిటల్ నుంచి ఇంటికి వచ్చి, పది రోజులయింది. వచ్చినప్పటినుంచీ, ఎవర్నీ కలియటానికి ఇష్టపడటం లేదు. ఈ పది రోజులుగా ఆ గది దాటి బయటకు రాలేదు. గణేశ్ వైముఖ్యాన్ని గమనించిన అతడి తల్లిదండ్రులు, అతడిని చూడాలని వచ్చిన స్నేహితులందరినీ బయటి నుంచే పంపేశారు.

అభినవ్ నీ వారించారు గాంధీ తల్లిదండ్రులు. అయితే, అభినవ్ తిరిగి వెళ్లలేదు. కలిసి తీరాలని పట్టుబట్టాడు. తలొగ్గక తప్ప లేదు గణేశ్‌కి. అభినవ్ గణేశ్ ఉన్న గదిలోకే వెళ్ళాడు.

గదిలోకి నేరుగా వచ్చిన అభినవ్ ని ఒక సారి తలఎత్తి చూసి, ఊరుకున్నాడు గణేశ్. అభినవ్ గణేశ్ కి మిత్రుడు కాదు. వాళ్ల పరిచయం జరిగి గట్టిగా ఏడాది కూడా కాలేదు. మొదట్లో, గణేశ్ కి అభినవ్ మీద అంత ఆసక్తి ఉండేది కాదు. తండ్రి బలవంతం మీద, కొన్ని గంటలయినా కాలక్షేపం అవుతుందని, అభినవ్ దగ్గరకు వెళ్ళటానికి ఒప్పుకున్నాడు. అయితే, రాను రాను, అభినవ్ అతడిని ఆకట్టుకున్నాడు. ఇప్పుడు గణేశ్ మనసులో అతడిది గురు స్థానం! అందుకే, ఎవరితోనూ మాట్లాడటం ఇష్టం లేకపోయినా, అభినవ్ వచ్చి, కలుస్తానంటే, గౌరవం కొద్దీ తలొంచాడు.

కామర్స్ లో పి. జి. చేసి, బ్యాంక్ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న గణేశ్ ఇంటి పరిస్థితులు, ఆ కుటుంబం పడుతున్న ఆర్థిక ఇబ్బందులు అభినవ్ కి చూచాయగా తెలుసు. ఎంత శ్రమ పడి అయినా, ఏదో ఒక బ్యాంక్ లో ఉద్యోగం సంపాదించుకోవాలన్న గణేశ్ ఆశా తెలుసు. అయితే, ఆ ఆశ తీరని క్షణాల్లో ఆత్మహత్యకి తెగబడే మూర్ఖత్వం గణేశ్ కి ఉందని అభినవ్ ఊహించలేదు.

గణేశ్ తండ్రిది ఎదుగూబొదుగూ లేని చిరుద్యోగం. రోజు రోజుకీ పెరిగిపోతున్న కుటుంబ అవసరాలని తీర్చలేక, కొడుకు బ్యాంక్ ఉద్యోగాల మీదే ఆశ పెట్టుకోకుండా, ఏదైనా చిన్న ఉద్యోగంలోనైనా చేరి, ఎంతో

కథా మంజరి
పది కథల సమాహారం

కొంత సంపాదిస్తూ, తనకి చేదోడు వాదోడుగా ఉండి, కొంతయినా భారం తగ్గించాలని అతడి తండ్రి ఆశ. ఒకసారి చిన్న ఉద్యోగాల్లో చేరిపోతే, ఇక ఎదుగుదల ఉండదని గణేశ్ అభిప్రాయం. ఏ నాటికైనా, బ్యాంక్ ఉద్యోగమే సంపాదించాలని అతడి ఆరాటం. అడపాదడపా, ఆ విషయమై తండ్రీ కొడుకుల మధ్య ఘర్షణ జరుగుతూనే ఉంటుంది. ఆ రోజూ అలాగే జరిగింది.

'చిన్న ఉద్యోగం చేయటానికి సిగ్గు గానీ, ఖాళీగా కూర్చొని తినటానికి సిగ్గులేదు!' అని ఈసడించాడు అతని తండ్రి.

గణేశ్ రక్తం మరిగిపోయింది. ఎందుకూ పనికిరాని తను, తండ్రికే కాదు, భూమికే భారంగా ఉండకూడదనుకున్నాడు. అదే ఉద్రేకంతో బయటకు నడిచాడు. వేగంగా వస్తున్న ట్రక్కు కింద పడి జీవితం ముగించుకుందామని ప్రయత్నించాడు. ప్రయత్నం వికటించి, ఆసుపత్రి పాలయ్యాడు. అది ప్రమాదం కాదనీ, ఆత్మహత్యా ప్రయత్నమనీ అందరికీ స్పష్టంగా తెలిసిపోయింది. ఇప్పుడు పరిస్థితి మరింత అవమానంగా ఉంది. అందుకే, ఎవరినీ కలియటం ఇష్టం లేదు. అభినవ్ వదలలేదు!

"నిజంగానే సూయిసైడ్ తలపెట్టావా, యాక్సిడెంట్ కాదా?"

కొన్ని నిమిషాల మౌనం తరవాత, నెమ్మదిగా అడిగాడు అభినవ్.

జవాబివ్వకుండా తల తిప్పుకుని ఊరుకున్నాడు గణేశ్.

"సూయిసైడ్ చేసుకోవటం కన్నా కష్టంగా ఉందా, నాకు జవాబు చెప్పటం?"

అభినవ్ గొంతులోని కాఠిన్యానికి, కొద్దిగా వణికాడు గణేశ్. ఆ ప్రమాదం లేదా ఆ ప్రయత్నం జరిగిన నాటి నుంచీ, ఎవరూ అతనితో ఇంత పరుషంగా మాట్లాడలేదు - అనునయ వాక్యాలు, సానుభూతి మాటలూ, ఓదార్పులే తప్ప. తనమీద తనే జాలి పడటంలో మునిగిపోయిన గణేశ్, అభినవ్ వైఖరికి దెబ్బ తిన్నాడు.

"ఆత్మహత్య చేసుకోదల్చుకున్నవాడు ఎంచుకునే అతి కష్టమైన, మూర్ఖమైన మార్గం ఎంచుకున్నావ్. ఛ...ఛ.. అక్షరాలా రోడ్డున పడ్డావ్. వ్రతమూ చెడింది, ఫలితమూ దక్కలేదు! ఒంట్లో ఓపిక వచ్చాక, నా దగ్గరకు రా. అత్యంత సులభంగా పైకి పోయే మార్గం చెబుతాను!" సీరియస్ గా అన్నాడు అభినవ్.

రోషంగా తలఎత్తాడు గణేశ్, 'పిసరంతైనా సానుభూతి లేదా ఈ మనిషికి?'

"పిరికివాళ్ల మీద నాకు సానుభూతి ఉండదు."

అతడి మనసు చదివినట్టే అన్నాడు అభినవ్, "మీ నాన్న మీద కోపమా? ఉద్యోగం దొరకటం లేదన్న నైరాశ్యమా?"

"మీకు తెలియదు. ఎన్ని మాటలన్నారో... అయినా, ఆయన తప్పూ లేదు. బ్యాంక్ ఉద్యోగం దొరికినట్టే దొరికీ, డిపాజిట్ కట్టలేక వదులుకున్నాను. ఆ పాటి డబ్బు కూడా సర్దలేక పోయాడాయన!" నిష్ఠూరంగా జవాబిచ్చాడు గణేశ్.

"శభాష్. బ్యాంక్ ఉద్యోగం తప్పితే, మరే ఉద్యోగమూ పనికి రాదా? అసలు ఉద్యోగం తప్పితే, బ్రతకటానికి మరే వ్యాపకమూ లేదా?"

"నాకు తెలిసిన వ్యాపకం ఉద్యోగం ఒకటే."

"ఆత్మహత్యకి ఎన్ని మార్గాలున్నాయో, అంతకు వందరెట్లు ఉన్నాయి బ్రతికే మార్గాలు. మనసుకి మనం బానిసకాకుండా, మనసుని మనకు బానిస చేసుకోగలిగితే.."

గణేశ్ కి పీకల దాకా కోపం వచ్చింది. "చెప్పటం తేలికే సార్. అనుభవిస్తే తెలుస్తుంది బాధ!" అన్నాడు.

వాతావరణాన్ని తేలిక చేయాలన్నట్టు నవ్వాడు అభినవ్. ఒక నిమిషం వ్యవధి ఇచ్చి, అన్నాడు,

"మన అనుభవం మనకు నేర్పే పాఠాలు ఏకపక్షంగా ఉంటాయి. ఎదుటివారి అనుభవాలనుంచి నేర్చుకునే పాఠాలు కొత్త కోణాలు చూపుతాయి. నువ్వెప్పుడన్నా, ఒకప్పుడు రంజీ ట్రోఫీల్లో హీరోగా వెలిగిన ఫాస్ట్ బౌలర్ గాంధీ పేరు విన్నావా?" తలూపాడు క్రికెట్ అభిమాని అయిన గణేశ్.

"అతడు దేశం తరఫున ఎందుకు ఆడలేక పోయాడో తెలుసా?"

"నేషనల్ టీం కి సెలెక్ట్ అయ్యాడు గానీ, రోడ్ యాక్సిడెంట్ లో గాయపడి, ఛాన్స్ పోగొట్టుకున్నాడని చదివాను."

"యస్. నీకు అతడి కథ చెబుతాను, విను."

ఎందుకు చెబుతున్నాడో తెలియక పోయినా, తప్పదు గనుక మౌనంగా విన్నాడు గణేశ్.

***

వేగంగా వచ్చిన కారు ఆ హాస్పిటల్ ఆవరణలో ఆగింది. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ నేషనల్ క్రికెట్ ప్లేయర్ గాంధీని స్ట్రెచర్ పై లోపలికి తీసుకు వెళ్ళారు.

గాంధీ ఇంటి ముందరే జరిగింది ఆ ప్రమాదం.

రంజీ ట్రోఫీల్లో వికెట్ల మీద, వికెట్లు తీస్తూ మెరుస్తున్న గాంధీ, మొదటిసారిగా నేషనల్ టీం కి సెలెక్ట్ అయ్యాడు. ఆస్ట్రేలియాలో జరగనున్న బైలేటరల్ సిరీస్ కోసం నాలుగు రోజుల్లో మెల్ బోర్న్ వెళ్ళే ప్రయాణ సన్నాహాల్లో ఉన్న గాంధీ, ఆ ఉదయం బయటకు వెళ్ళేందుకు ఇంటి గేటు తెరుస్తుండగా కనిపించిందా దృశ్యం. చేతిలో నుంచి తప్పించుకున్న బెలూన్ ని వెంటాడుతూ అకస్మాత్తుగా రోడ్డు మీదకు వచ్చాడు ప్రక్క ఇంటి వాళ్ళ నాలుగేళ్ల బాబు. అదే సమయానికి వేగంగా వస్తున్న కారుని గమనించిన గాంధీ, వాయు వేగంతో ముందుకు ఉరికి ఆ పసివాడిని పట్టుకుని అవతలికి తోసేశాడు. బ్రేక్ వేసుకున్న కారు గాంధీని బలంగా గుద్దుకుని గానీ ఆగలేదు. బంతిలాగా ఎగిరి, అల్లంత దూరాన పడిన గాంధీ మెడ అక్కడున్న బండరాయికి విసురుగా తాకింది. కళ్ళ ముందే క్షణాల్లో జరిగిన ఘోరానికి, గాంధీ కుటుంబం నిర్విణ్ణులయ్యారు.

అనుకోకుండా క్షణాల్లో సంభవించిన ఆ ఘోర ప్రమాదంతో కోమాలోకి వెళ్ళిన గాంధీ, బయటపడటానికి వారం రోజులు పట్టింది. కళ్ళు తెరిచి చూసుకుని అతడు గ్రహించినది - తను మెల్ బోర్న్ స్టేడియంలో లేడు, నిర్వీర్యంగా హాస్పిటల్ బెడ్ మీద ఉన్నాడు! చేతిలో బంతి లేదు, మణికట్టుకి ఇంట్రావీనస్ ఇంజెక్షన్‌లకోసం

పెట్టిన బ్యాండేజీ  కనిపించింది. ఏం జరిగిందో అర్ధం కావటానికి సమయం పట్టింది. క్రమ క్రమంగా, వాస్తవం లోకి వచ్చాడు.

'భారత్ తరఫున ఆడే అవకాశం చెయ్యి జారిపోయింది. మళ్ళీ తను కోలుకుని, బాగుపడి, బంతి పుచ్చుకుని, తనను తను ఋజువు చేసుకున్నప్పటి మాట!' నిరాశ అతడి మనసుని కమ్మేసింది.

ఆ అవకాశం ఇక ఎప్పటికీ లేదన్న కఠోర వాస్తవం త్వరలోనే అతడికి తెలియక తప్పలేదు.  ఆ ప్రమాదంలో అతడి మెడ ఎముక విరిగింది. అది పక్షవాతానికి దారి తీసింది. ఎడమ చేయి, కాలు చచ్చుబడి పోయాయి. కనీసం లేచి కూర్చొనే స్థితి అయినా ఎన్నాళ్ళకి వస్తుందో తెలియని స్థితి. గాంధీ జీవితం హాస్పిటల్ బెడ్ కి పరిమితమై పోయింది. క్రికెట్ స్టేడియం  ఒక కలగా మిగిలిపోయింది.

మూడు నెలల పాటు మగత... శరీరం నిస్సత్తువ తాలూకు మగత... మందుల ప్రభావం వలన మగత.. తెలిసీ తెలియని అవస్థలో వారాలు దొర్లిపోయాయి. ఆ తరవాత క్రమంగా మగత వీడిన మనసు ఆశ్రయించిన మౌనం. వ్యాపకాలకై వెతుకులాట.  చూసినంత సేపు, బెడ్ ఎదురుగా అమర్చబడ్డ టి.వి. లో స్పోర్ట్స్ చానెల్. అలసటగా తోస్తే, కళ్ళు మూసుకుని దైవ ధ్యానం. మనసు కుంగిపోకుండా, ఏకాగ్రతకోసం మానసిక వ్యాయామం.  ఊహలోనే స్కిప్పింగ్ చేసేవాడు. ఒకటి...రెండు...మూడు...వంద పూర్తి అయ్యాక, రివర్స్ స్కిప్పింగ్...రివర్స్ కౌంట్... నూరు...తొంభై తొమ్మిది...తొంభై ఎనిమిది...మరోసారి, మరోరోజు మరో ప్రయోగం.  గుండె చప్పుడు లెక్కించే మెషిన్ తాలూకు...బీప్...బీప్...బీప్... నిముషానికి ఎన్ని ? తదేకంగా మనసు లగ్నం చేసి లెక్క పెట్టటం. అయిదు నిమిషాల కౌంట్. నిమిష నిమిషానికి ఎన్ని కౌంట్లు తేడా? తేడా ఒకేలా ఉందా, లేదా?

క్రికెట్ గ్రౌండ్ లో పరుగుల లెక్క లాగే, మనసుని కేంద్రీకరిస్తూ! ఒక్క క్షణం కూడా మెదడుని ఖాళీగా ఉంచకుండా, నిరాశ వైపుకి మళ్ళనీయకుండా సకారాత్మక ఆలోచనల్లో మమేకమై పోతూ!

నెలలు గడిచి గడిచి... ఏడాదిగా రూపు దిద్దుకున్నాయి. ఏడాదిగా ఒకే వ్యాపకం. దాన్ని వ్యాపకం అనవచ్చునా?

ఇరవై నాలుగు గంటలూ  మంచమూ, మందులూ, నర్సులూ, డాక్టర్లూ, ఎదురుగా తడి కళ్లతో తల్లీ, అప్పుడప్పుడు తండ్రీ... ఇదీ జీవితం. ఇదే జీవితం!

ఒకసారి తల్లిని దగ్గరకు పిలిచాడు, "అమ్మా."

"ఏం బాబూ?" కన్నీళ్లతోనే చేరువగా వచ్చింది ఆమె.

"ఎందుకమ్మా ఆ కన్నీళ్ళు?" అడిగాడు.

"కన్నీళ్ళు కాక ఏం మిగిలింది బాబూ? ప్రాణాధికమైన నువ్వు మంచానికే అంకితమైపోయాక, బంగారం లాంటి నీ భవిష్యత్తు చీకటై పోయాక..."

"అమ్మా..." తల్లిని వారించాడు గాంధీ, "ఎందుకమ్మా అలాగనుకుంటావు? నేను పుట్టి పంథొమ్మిదేళ్ళయింది. పద్ధెనిమిదేళ్ళపాటు అందరి లాగే ఆరోగ్యంగానే తిరిగాను. మీకు ఆనందాన్ని పంచాను. ఒక్క ఏడాది నుంచే కదా ఈ ఇబ్బంది! అంటే, అంటే, గడిచిన జీవితంలో కేవలం ఐదు శాతం! ఇప్పుడైనా, ఇబ్బంది తప్ప , మృత్యువు రాలేదు కదా"

"గాంధీ-" అతడి నోటికి చెయ్యి అడ్డం పెట్టి, ఆపేసింది అతడి తల్లి, "నువ్వామాట కలలో కూడా అనబోకు. నువ్వెప్పుడూ బతికే ఉండాలి."

"నేను చెప్పేదీ అదేనమ్మా. నేనేమీ శాశ్వతంగా ఈ హాస్పిటల్ బెడ్ కి అంకితమై పోను. ఏడాది క్రిందట, ప్రమాదం జరిగిననాడు ఉన్న స్థితిలో ఇవాళ లేను. ఇవాళ ఉన్నట్టు మరో మూడు నెలలకి ఉండను. మూడు నెలలు కాకపోతే, ఆరు.. లేదా మరో ఏడు నెలలు...బయటపడక పోతానా? పరిపూర్ణ ఆరోగ్యం రాకపోవచ్చు. కొన్ని అవయవాలు మాట వినక పోవచ్చు. గుండె, మెదడు పని చేస్తుంటే చాలమ్మా. మిగతా వాటి లోటుని అధిగమించే ప్రయత్నం చేస్తాను. నాకింకా చాలా జీవితం ఉందమ్మా. ఆ జీవితాన్ని ఆనందంగా గడపాలన్న కోరిక ఉంది. గడపగలనన్న నమ్మకం ఉంది. నువ్వు కన్నీళ్ళు పెట్టుకుంటే మాత్రం, నా మనసు బలహీనపడుతుంది. అందుకే, నువ్వు ఏడవ వద్దు. అందరికీ అన్నీ ఉండవు. ఎందరికో ఏమీ ఉండవు. కాని, అందరూ జీవిస్తూనే ఉన్నారు. ఉన్నంతలో సుఖపడాలనే ప్రయత్నిస్తున్నారు. ఎన్ని కష్టాలెదురైనా, కన్నీళ్ళు పెట్టని వాడే ధన్యుడు. చిరునవ్వులున్న వాడే అదృష్టవంతుడు. మానసిక స్థైర్యమే కన్నీళ్ళని దూరం పెడుతుందమ్మా, చిరునవ్వులు చిందించగల బలాన్నిస్తుంది. ఆ బలంతోనే మనం ముందుకు కదులుదాం.'

విస్మయంతో చూస్తోంది అతడి తల్లి, 'ఇంతగా దెబ్బతిన్న కొడుకేనా ఇంత ధైర్యంగా మాట్లాడుతున్నది!'

"ఈ నాటి ఈ పరిస్థితిని గూడా నువ్వు సానుకూల దృక్పథం తో చూడు. నన్నొక్కడినే చూస్తూ కుమిలిపోకుండా, ఈ హాస్పిటల్ కి వస్తున్న అందరినీ చూడు. బాధపడుతున్న వారికి ధైర్యం చెప్పు. కోలుకుని వెళ్ళిపోతున్న వారి సంతోషం పంచుకో. ఈ పరిస్థితి ఎల్లకాలం ఉండనట్లే, ఈ అవకాశమూ ఎల్లకాలం ఉండదు. ఉన్నంతకాలం అందులోనే ఆనందాన్ని వెతుక్కో."

తాను కొడుకుకి చెప్పవలసిన ధైర్య వచనాలు కొడుకే తనకి చెప్తుంటే, ఆ తల్లి ఆశ్చర్య పడింది. ఆ వెనక సంతోషపడింది. ఆ మాటలు ఆమెలో కొత్త ఆశలు నింపాయి.

"తప్పకుండా బాబూ, నువ్వు త్వరలోనే లేచి తిరుగుతావు. నేను ఇప్పటి నుంచీ కళ్ల నీళ్ళు పెట్టుకోను" అంటూ, కళ్ళు తుడుచుకుంది.

మరో తొమ్మిది నెలలు గడిచేక, వీల్ చైర్ లో ఆ హాస్పిటల్ గేటు దాటాడు గాంధీ. ఎడమ చేయి, కాలు శాశ్వతంగా అవిటివైపోయాయి. మెడకాయ నిటారుగా నిలబడే సత్తువ కోల్పోయింది. మెదడు మాత్రం

కథా మంజరి
మంచి కథల సమాహారం

మరింత పదును తేలింది. మనసు సమస్యలని ఎదుర్కొనే స్థాయి పెంచుకుంది. ఒక నెల రోజులపాటు, ఇంట్లో కూర్చునే, బుర్రకి పని చెప్పాడు. ఒక పథకంతో బయటకు అడుగు పెట్టాడు.

తమ ఇన్నోవా వాన్ లో డ్రైవింగ్ సీట్ తను నడపటానికి అనువుగా మార్పించుకున్నాడు. వెనుక సీట్లు తీయించి, వీల్ చైర్ పట్టేలా ఏర్పాటు చేయించాడు. మొదటగా తనకు చిరపరిచితమైన క్రికెట్ క్లబ్ కు వెళ్ళాడు. బౌలర్లకు మెళకువలు నేర్పుతానన్నాడు. గాంధీకి అక్కడ అపారమైన సానుభూతి లభించింది. అది అతడికి అవసరం లేదు. అతడాశించిన అవకాశం మాత్రం లభించలేదు. అతడు కృంగిపోలేదు - అతడిని కృంగదీయగల శక్తి ఈ భూమిమీద లేదని నమ్మాడు గనుక!

ఒక స్పోర్ట్స్ మాన్ గా రూపు దిద్దుకున్న క్రమంలో, తను నిరంతరం శిక్షణ పొందిన ఫిట్‌నెస్ సెంటర్ లను గుర్తుకు తెచ్చుకున్నాడు. వెళ్ళి వారిని కలిశాడు. అతడికి ఇప్పుడు ఎలాంటి పని ఇవ్వగలవో, వాటికీ అర్థం కాలేదు.

గాంధీకి మాత్రం స్పష్టమైంది- తనకి ఎవ్వరూ పని కల్పించలేరని. తన కోసం తనే పని చూసుకోవాల్సి ఉంటుందని.

ఆలస్యం చేయకుండా, పథకం రూపొందించుకున్నాడు. తండ్రిని ఆశ్రయించాడు. తమ మేడమీది గదులని కలిపేస్తూ, ఒక పెద్ద హాలుగా మార్పించాడు. చిన్నపాటి జిమ్ కి అవసరమైన వెయిట్స్ దగ్గర నుంచీ, వివిధ ప్రెస్ ల వరకూ కొనుగోలు చేశాడు. అతని కలలకి రూపమిస్తూ స్వంత జిమ్ రూపు దిద్దుకుంది. చుట్టుపక్కల అందరికీ పాంప్లెట్స్ పంచాడు.

మొదటి రోజు పదిమంది లోపే వచ్చారు. వచ్చినవాళ్లు ఎవరైనా ట్రైనర్ ఉంటాడనుకుని వచ్చారు. గాంధీ శిక్షణ ఇస్తాడని తెలిసి, పెదవి విరిచి వెళ్ళిపోయారు. వారం పాటు ఇలాగే జరిగింది. కొత్తవాళ్లు రావటం, వెనక్కి మరలి పోవటం.

గాంధీ బెదిరిపోలేదు, 'మెడకి తగిలిన దెబ్బ కన్నా, ఈ తిరస్కారం పెద్ద దెబ్బ కాదు గదా!' అని నవ్వుకున్నాడు.

'డబ్బు ఖర్చుపెట్టి, శిక్షణ పొందాలని వచ్చిన వాళ్ళు, తన రూపాన్ని చూసి, సామర్థ్యాన్ని శంకించటంలో అసంబద్ధత లేదు' అనుకున్నాడు. ప్రయోగం విఫలమైన సైంటిస్ట్ లాగా, కొత్త ఫార్ములా కోసం ఆలోచించాడు. ఆ మర్నాడు, తన జిమ్ ఒక నెల రోజులపాటు అందరికీ ఉచితం అని ప్రచారం చేశాడు. ట్రెయినర్ అంటూ ఉండడనీ, సరికొత్త పరికరాలు వాడుతూ, ఎటువంటి నిబంధనలూ లేకుండా, ఎవరికి వారే వ్యాయామాలు చేసుకోవచ్చని, వివరించాడు.

'ఉచితం' సహజం గానే, పలువురిని ఆకర్షించింది. జనం రావటం మొదలు పెట్టారు. తను అక్కడే కూర్చొని, తనకు వీలయిన ఎక్సర్ సైజులు చేస్తూ, సభ్యుల అటెన్షన్ రాబట్టేవాడు. అలాగే, వాళ్ళు అడగకపోయినా, వాళ్ళు చేస్తున్న ఎక్సర్ సైజుల్లోని లోపాలు ఎత్తి చూపుతూ, కొత్త మెలకువలు సూచించసాగాడు. గాంధీ మాట తీరు, సహనం, చాకచక్యం, వ్యాయామ నైపుణ్యం, క్రమంగా సభ్యులను ఆకట్టుకున్నాయి.

నెల రోజుల ఉచిత పథకం ముగిశాక, జిమ్ మెంబర్ షిప్ కి కొద్దిగా ఫీజ్, అదీ మిగతా జిమ్‌లకన్న బాగా తక్కువగా నిర్ణయించాడు. సభ్యులెవరు ఫీజ్ కట్టటానికి వెనుకాడలేదు. నెమ్మదిగా సభ్యుల సంఖ్య పెరిగింది. బిజినెస్ పెరగటంతో, ఒక ట్రెయినర్ ని కూడా పెట్టాడు గాంధీ. మూడేళ్లలో పెట్టిన పెట్టుబడి వచ్చేసింది. బ్యాంక్ లోనుతో జిమ్ మరిన్ని కొత్త పరికరాలతో, మరి నలుగురు శిక్షకులతో, మరో అంతస్థుకి విస్తరించింది. గాంధీ వికలాంగుడు అన్నమాట మరుగున పడిపోయి, కార్య సాధకుడు అన్న గుర్తింపు వచ్చింది.

***

చెప్పదలుచుకున్నది పూర్తి చేసి, మందహాసం చేస్తూ, గణేశ్ వైపు చూశాడు అభినవ్ గాంధీ. గణేశ్ అభినవ్ ముఖంలోకి చూడటం లేదు. అపనమ్మకంగా, ఓ అద్భుతాన్ని చూస్తున్నట్టు, అభినవ్ కూర్చున్న వీల్ ఛైర్ వైపు చూస్తున్నాడు.

'ఈ అవకరాలన్నీ పుట్టుకతో వచ్చినవి కావా?! క్రికెట్ లో అంతర్జాతీయ స్థాయికి చేరుకున్న వ్యక్తి, అంత ప్రమాదానికి గురి అయినా, అంతటి ఉజ్వల భవిష్యత్తు చేజారిపోయినా, మానసిక తౌల్యం కోల్పోలేదు! ఆ మనసు మీద, ఆశలమీద జరిగిన ఆకస్మిక దాడిని ఏ కవచం కాపాడింది? అలాంటి కవచం తనకెక్కడ, ఎలా దొరుకుతుంది?

ఆయన యాక్సిడెంట్ ఒక ప్రాణాన్ని కాపాడటానికి జరిగింది. తన యాక్సిడెంట్ ఒక ప్రాణం తీసుకోవటానికి జరిగింది. యాక్సిడెంట్ లో ప్రాణం పోనందుకు తను కృంగిపోయాడు. యాక్సిడెంట్ లో బంగారు భవిష్యత్తు బలి అయిపోయినా, ఆయన చెక్కు చెదరలేదు! తను, తనలాటి ఎందరో... అభినవ్ సర్ నుంచి నేర్చుకోవలసింది భౌతిక వ్యాయామం కాదు - మానసిక శిక్షణ! జీవితాన్ని ఎదుర్కునే ధైర్యం. బ్రతుకును ప్రేమించే లక్షణం!'

గణేశ్ ఆలోచనా ధోరణిలో చోటు చేసుకుంటున్న మార్పు అతడి ముఖంలో స్పష్టంగా కనబడుతుంటే, సంతృప్తిగా అతడికేసి చూస్తుండిపోయాడు అభినవ్ గాంధీ.

కథా మంజరి
పది కథల సమాహారం

***0***

# దాతే ఓ విధాత



## గంగాధర్ వడ్లమన్నాటి

మూర్తి గారి గురించి నాకు బాగా తెలుసు. ఆయన, చాంతాండు పొడవు చాదస్తం గల మనిషి. అదే విషయం చాలా మంది చెప్పగా విన్నాను కూడా. అలాంటి వ్యక్తిలో కొద్ది నెలల వ్యవధిలోనే ఇంత పెద్ద మార్పా! ఎలా సాధ్యమై ఉంటుందీ. అయినా అశోకడంతటి వాడే యుద్ధం వద్దని బుద్ధం శరణం గచ్ఛామి అన్నాడు. అందులో ఏవుందీ? అని ఓ క్షణం అనుకున్నాను. మరి కొద్ది క్షణాల్లోనే నాకో ఉపాయం తట్టింది. అశోకుడు మారడానికి ఓ బలమైన కారణం ఉంది. అంటే ఈయన మారడానికీ ఓ బలమైన కారణం ఉండే ఉంటుంది.

అది కనుక్కుంటే చాలు. అవయవదానం చేయడానికి ముందుకు రాని వారికి .. ఈయన్ని ఓ ఉదాహరణగా చూపించి ఉతికారేయొచ్చు. ఈయన కారణాన్నే వివరించవచ్చు. అయితే, ఇది వరకు ఆయన ఇలా ఉండేవారు కాదు. అవయవ దానం అంటే పెదవి విరిచేవారు. ఇంకా దాని గురించి మాట్లాడితే మండిపడేవారు. అలాంటిది, ఆయన తదనంతరం అవయవ దానం చేయడానికి ముందుకు రావడమే కాక, అందరూ ఇందులో బాగం పంచుకోవాలని, ఇపుడు సమావేశాలు పెట్టి మరీ జనాల వెంటపడుతున్నారు. దాంతో నన్ను ఆకాశమంత ఆశ్చర్యం ఒకేసారి పలకరించింది. ఓ సారి నాకు బాగా గుర్తు, ఆయన తదనందరం అవయవ దానానికి సుముఖం అనే అంగీకార పత్రంపై ఓ సంతకం చేయమని అడిగానంతే, దానికాయన నా వంక నమిలి తినేసేలా చూస్తూ, “చూడు నాయనా, మనం బ్రతికినంత కాలం ఎలా అయితే చక్కగా సంపూర్ణ అవయవ సంపదతో బ్రతుకుతామో, పోయేప్పుడు కూడా అలానే సంపూర్ణ అవయవ సంపదతోనే మట్టిలో కలిసి పోవాలి. లేదంటే అది సృష్టి విరుద్ధం అవుతుంది. దేవుడు ఎవరి ఖర్మని బట్టి వారికి జన్మని ఇవ్వడం జరుగుతుంది. అందుకే కొందరు ధనికులుగా, కొందరు పేదలుగా పుడతారు. కొందరు సంపూర్ణ ఆరోగ్య వంతులుగా, కొందరు పుట్టుకతోనే అనారోగ్యంతో పుడతారు. మరికొందరు కంటి చూపో, కాలు వాపో, మతిమరుపో, మతి తప్పో, కొందరు గొప్ప అందంతోనూ, కొందరు మామూలుగానూ పుడతారు. అది వారి వారి పూర్వజన్మ పాప పుణ్యాల కర్మ ఫలితం. ఆ ప్రారబ్దం ఎవరైనా అనుభవించే తీరాలి. నేటి తరం వారు సైన్స్ తో కూడేసి చెప్పే విషయాలు నాకూ తెలుసు. అయినా నేను నమ్మేది నేను నమ్ముతాను. కొందరు అతి పోకడలకి పోయి అవయవ దానం చేయమంటారు. కొందరు పేదలు డబ్బుకి ఆశపడి ఆరోగ్యం పణంగా పెట్టి అలాంటివి చేసి ప్రాణం మీదకి తెచ్చుకోవడం లేదూ. మరికొందరు దానిని వ్యాపారం చేయడం లేదూ. కనుక ఇలాంటివి కూడా కొన్ని జీవితాలని కంచికి చేర్చేయగలవు. కనుక ఇది

ఎటునుండి ఎటు చూసినా సమాజానికి బోలెడు కీడు కూడా చేస్తోంది. అందుకని, నేను నమ్మే విషయంలో ఎటువంటి మార్పూ లేదు" అని ఆయన నాతో అనడమే కాక, ఆ విషయాన్ని కొన్ని సభల్లో నొక్కి వక్కాణించి ప్రసంగించారు కూడా. అలాంటిది ఆయన ఇలా ఎలా మారిపోయారు అని తల బాదుకున్నా నాకు బోధపడలేదు. పైగా ఈ తలపులతో నా తల బోడైపోతుందేమోనని భయపడ్డాను కూడా. ఓ క్షణం తరువాత, ఈ విషయం నేరుగా ఆయనతోనే చర్చించాలి. ఆయన మూఢత్వం గురించి ఇంకా ఘాడంగా తెలియాలంటే, ఇక్కడ ఓ ఉదాహరణ నోదాహరణంగా వివరించాల్సిందే. ఆయన భార్య ప్రస్తుతం ఆయనతో ఉండటం లేదు. ఉండటం లేదు అనేకంటే ఈయనే ఉండనివ్వలేదనడం సబబు. దానికేం పేద్ద కారణం లేదు. ఆమె అభిమానించే కథానాయిక ముక్కులాంటి అందమైన ముక్కు ఉంటే బావుండునని ఆమె కలలు కనేదట. సూటిగా సన్నగా ఉండే ముక్కు కోసం ఆమె చాలా మంది డాక్టర్లని కూడా కలిసిందట. సరిగ్గా అలాంటి సమయంలోనే, మాట్లేస్తాం బ్యూటీ పార్లర్ వారి ప్రకటన చూసిందట. వారిని సంప్రదించి మాట్లాడగా, ఓస్ అదెంత పనీ, ఆ ముక్కుని చక్కగా చెక్కేసి సన్నగా చేసేద్దాం అన్నారట. కాకపోతే కొంత పెద్ద మొత్తం అడిగారట. దాంతో ఆమె ఏడు వారాల నగలూ అమ్మేసి, ముక్కుని చక్కగా ప్లాస్టిక్ సర్జరీ చేయించుకోవాలని నిర్ణయించుకుంది. అయితే అప్పుడే మూర్తిగారు ఓ మూడు నెలలు ఆఫీసు పని మీద చెన్నయ్ వెళ్ళడంతో, ఆమె చక్కగా నగలు అమ్మేయడం, ముక్కు సర్జరీ చేయించుకోవడం లాంటివన్నీ చకచకా జరిగిపోయాయి. తిరిగి వచ్చిన మూర్తిగారు, ఆమె ముక్కు చూసి గుక్క తిప్పుకుని మరీ తిట్టి పోసారట. కోపంతో భగ భగా మండిపోతూ, భగవంతుడు ఇచ్చిన దానిని మార్చడానికి మనమెవరం. ఇలాంటి కృత్రిమ పోకడలకి నేను వ్యతిరేకం అని తెలిసి కూడా నువ్వు ఇలా తెగించావంటేనే తెలుస్తోంది నీ తెగింపు. సన్నబడింది నీ ముక్కే కాదు, నేను నీమీద పెట్టుకున్న నమ్మకం కూడా. నువ్వు చేసిన ఈ పని ముమ్మాటికీ చాలా తప్పు అని తెగేసి మరీ చెప్పేసాడాయన. కానీ ఆమె తను చేసింది తప్పు కాదని వాదించింది. ఆ మాట అతన్ని వేధించింది. దాంతో, తప్పు చేసానని ఒప్పుకుంటేనే తన ఇంటి కప్పు కింద ఉండమనీ, లేదంటే తన జీవితం నుండి తప్పుకోమని తెగేసి చెప్పేయడంతో, ఆమె బయటికి వెళ్ళిపోవాల్సి వచ్చింది. అలా ఆయన ఒంటిపిల్లి రాకాసిలా మిగిలిపోవడానికే ఇష్టపడ్డాడు కానీ అతను నమ్మిన దాని నుండి కొంచెం కూడా సడలలేదు.

అలాంటి మనిషి ఇలా మారడానికి గల కారణం కనిపెడితే, రేపు దానిని ఉదహరించి ఇంకొందరిని అవయవ దానం వైపు మొగ్గేలా చేయవచ్చునని నా ఆలోచన. అనుకున్నట్టే ఆయన్ని కలవానుకుంటున్నట్టుగా, మూర్తి గారి వీధిలోనే ఉంటున్న నా స్నేహితుడితో ఆయనికి అభ్యర్దన పంపాను. ఆయన కూడా సానుకూలంగా స్పందించి, సరే సాయంత్రం రమ్మని చెప్పమనడంతో చాలా సంతోషపడిపోయాను. రమ్మన్నదే తడవుగా ఆ సాయంత్రం ఆయన ఇంటికి వెళ్ళాను. ఇల్లంతా చాలా చక్కగా సర్ది పెట్టి ఉంది. హాల్లో షోకేసు కింద అరలో చాలా పుస్తకాలు ఉన్నాయి. అన్నీ కొంచెం పాత పుస్తకాలే. ఆయన ఒక్కరే ఉంటున్నారు. వారి అమ్మాయి అమెరికాలో ఉంటుంది. భార్య విడిపోయింది కనుక, ఒక్కరే ఉండటంతో

ఎక్కువగా ఇంట్లో ఉండరని ఆయన స్నేహితులు అంటుంటారు. ఎప్పుడూ సభలకో, సమావేశాలకో, గ్రంధాలయాలకో వెళ్ళి వస్తుంటారట. నేను ఇలా అనుకుంటుండగానే ఆయన, అప్పుడే లోపలి నుండి వచ్చి ఎదురుగా కూర్చుంటూ,

"ఆ శేఖరంగారూ బావున్నారా, నేను మీలాగే ఇప్పుడు అవయవ దానం అనే గానం అందుకున్నాను. నాకు వీలైనంతలో జనాల్ని ఘనంగా చైతన్య పరుస్తున్నాను. మీ అంత కాదు లెండి. ఏదో మిడతా భక్తిగా. అన్నట్టు నిన్న మీ స్నేహితుడు చెప్పాడు. మీరు నన్ను కలవానుకుంటున్నట్టుగా. చెప్పండి విషయం ఏవిటీ" అడిగారాయన నవ్వుతూ.

"అదీ మరీ" అన్నాను చేతులు పిసికేసుకుంటూ కాస్త చిన్న గొంతుతో.

"మరేం పర్వాలేదు స్వేచ్ఛగా అడగండి" మరోసారి చిరు నవ్వు నవ్వుతూ అన్నాడాయన.

అప్పటికి నాలోని బెరుకు కాస్త తగ్గి, "ఏవీ లేదండీ. ఇది వరలో అవయవ దానం అంటేనే కొత్త ఆవకాయ తిన్నట్టు మండి పడిపోయేవారు. అలాంటిది ఇలా మీరు ఎలా మారి పోయారా అని" అడిగాను నేను.

"అదా! నాలో ఈ మార్పుకి కారణం" అని ఓ క్షణం ఆగి, "ఇదిగో మా ఇంట్లో ఉన్న ఆ పాడైపోయిన టివి" చెప్పాడాయన. ఓ మూలగా ఉన్న పాడైన ఓ పెద్ద టీవిని చూపుతూ.

మనిషి పొడుగరి కావడంతో ఏ గుమ్మానికో, చెట్టు కొమ్మకో గుండు తగిలి మతి గతి తప్ప లేదు కదా అని మనసులో అనుకుని, "మీలో ఇంత గొప్ప మార్పుకి ఆ పాడైన డొక్కు టీవి కారణమా, ఎలా? అసలు ఈ రెంటికీ ఏవిటి సంబంధం?" అడిగాను ఆ టీవీ వంకా, ఆయన వంకా ఓ సారి మార్చి, మార్చి చూసి.

"ఈ టీవిని మా అమ్మాయి అమెరికా నుండి నాకోసం పంపింది. తన మొదటి రెండు నెలల జీతాన్ని వెచ్చించి కొని నాకు ఎంతో ప్రేమగా పంపానంది. అయితే కేవలం టివినే కదా అనుకోవద్దు. అది నాకెంతో అపురూపం. కారణం, ఇదివరలో మా అమ్మాయితో కలిసి ఇంట్లో నేను ఎప్పుడైనా పాత సినిమాలు చూస్తున్నపుడు అంటుండేవాడిని. ఇలా చిన్న చిన్న టీవీల్లో కాదమ్మా, పెద్ద టీవీ... అంటే డెబ్బైఇంచిల టీవీలో పాత మాయాబజార్ సినిమాని రంగుల్లో చూడాలమ్మా. అప్పుడు ఆ యాక్టర్లంతా మనింట్లోనే ఉన్నట్టు అనిపిస్తుంది. అదేకాదు, ఇంకా అలాంటి సినిమాలు చాలా చూడాలి అనేవాడ్ని. అయితే అలాంటి టివి కొనాలంటే చాలా డబ్బు ఖర్చు కనుక అప్పట్లో నాకు కుదరలేదు. అది గుర్తుపెట్టుకున్న మా అమ్మాయి ఈ టీవిని కొని పంపిందట. మాయాబజార్ సినిమా చూడు డాడి అని ఓ చీటీ రాసి అందులో పెట్టింది కూడా. ఆ క్షణంలో నా మనసు నిండిపోయింది. అయితే అనుకోకుండా డెలివరీ చేస్తున్నపుడో, మరెప్పుడో గానీ ఆ టివి డిస్ప్లే కొంచెం దెబ్బ తిని బొమ్మ రావడం ఆగిపోయిందనుకున్నాను. కొత్త టివి అంతా ఎంతో బావుంది. కానీ బొమ్మ లేదు. ప్రాణం ఉసూరుమంది. ఆ టివికి సరిపోయే డిస్ప్లే కోసం చాలా చోట్ల ప్రయత్నించాను. ఎక్కడా దొరకలేదు. ఆ టివి లాంటి మరో టివి విడి బాగం తీసి పెట్టడం గానీ లేదా ఆ టివి తయారైన కంపెనీ వారిని గాని సంప్రదించమన్నారు. దాంతో చేసేది లేకపోయింది. టివి రోజు రోజుకీ అలా బూజు పట్టి, ఎలకలు

కోరికి మొత్తం పాడయి పోయింది. ఒక్క చిన్న విడి బాగం కోసం అంత టివి పోయిందే అని బాధ పడ్డాను. ఆ తర్వాత ఆలోచనలో పడ్డాను. ఒక విడి భాగం దొరక్క టివి మొత్తం నిష్కారణంగా పోతేనే నా మనసు ఇంతలా విలవిల్లాడిపోయి, ఓ మట్టి ముంతలా ముక్కలై పోయింది. అలాంటిది, ఇలాంటి కష్టం మనుషులకొస్తే, వారూ .. వారి వారూ ఇంకెంత బాధపడతారో కదా అనిపించింది. మనలాంటి వాళ్ళం చేసే అవయవ దానంతో వారు మళ్ళీ కొత్త జీవితాలు ప్రారంభిస్తారు. మరెన్నో సాధిస్తారు. వారనే కాదు, ఇలా చాలా మంది కళ్ళల్లో కోటి ఆశలతో, విధాతే ఓ దాత రూపంలో వచ్చి వారి రాత మారుస్తాడని ఎదురు చూస్తుంటారు. మంటల్లోనో, మట్టిలోనో, కలిసే అవయవాలని దానం చేస్తే, అవి పవర్ కట్ జీవితాల్లో ఓ ఇన్వర్టర్ లా మారి, ఎల్.ఈ.డీ వెలుగులు నింపుతాయని ఆలోచించాను. మన పాత నమ్మకాలు ముమ్మాటికీ మంచివే. కానీ ఇలాంటివి కూడా ప్రోత్సహించాలి అని ఆలోచించాను. మన నీతి శాస్త్రంలో, సుకృతం దుష్కృతం చైవ గచ్ఛన్తమనుగచ్ఛతి అని కూడా అన్నారు. అంటే మనం చేసే పుణ్యకార్యాలు మాత్రమే, మనతో పోయాక వస్తాయని. దాంతో ఇలా మారి ప్రచారం మొదలు పెట్టానయ్యా శేఖరం. అన్నట్టు మా శ్రీమతిని మళ్ళీ నా జీవితంలోకి రమ్మని ఆహ్వానించాను కూడా" చెప్పాడాయన చిన్నగా సిగ్గుపడుతూ.

"మొత్తానికి మీ అమ్మాయి పంపిన టీ.వీ. పాడయిపోవడం కారణంగా మీలో ఈ మార్పు వచ్చిందన్న మాట" అన్నాన్నేను.

ఆ మాటకాయన మరోసారి చిన్నగా నవ్వుతూ, "నేనూ మొదట అలానే అనుకున్నాను. కానీ నాలో ఈ మార్పు తీసుకురావడానికి గాను, తను పంపడమే పాడయిపోయిన టీ.వీ. ని పంపిందట. నేను, ఆమె చెబితే వినలేదని ఇలా చేసిందట. ఎంతైనా సైకాలజీ స్టూడెంటు కదా. ఈ అవయవదానం ఇంకా ముందుకు ఎలా తీసుకువెళ్ళవచ్చో నీతో కూడా ఓసారి మాట్లాడాతనందిలే!" చెప్పాడాయన.

"అంతకన్నా సంతోషవా సార్!" చెప్పాన్నేను మహదానందంగా.

***0***

కథా మంజరి
పది కథల సమాహారం

# మూడో కోణం

## పి ఎస్ ఎం లక్ష్మి



ఇది కరోనా ముందర కాలం కధండోయ్. కరోనా అనే చిన్న సూక్ష్మ క్రిమి ఎంతటి ప్రాధాన్యతను సంతరించుకుంది! ఇదివరకు ఎక్కడికన్నా వెళ్ళాలన్నా, ఏమయినా చెయ్యాలన్నా భగవంతుడి దయ అనుకునేవాళ్ళు నాలాంటి చాదస్తులు. ఇప్పుడు మేము కూడా కరోనా దయకి మారి పోయాం. క్రీస్తు పూర్వం, క్రీస్తు శకంలా కరోనా పూర్వం అని కాలానికి ఒక గుర్తింపు... మరి తర్వాత ఎలా వుంటుందో. ఇప్పుడయితే రోడ్డుకి నాలుగైదు టులెట్ బోర్డులు కనబడుతున్నాయి గానీ, కరోనాకి పూర్వం వాటికోసం చాలా వెతకాల్సి వచ్చేది.

అలాంటి శుభప్రదమైన రోజుల్లో, ఒక ఆదివారం ఉదయం .. అంటే నేను అన్ని పనులూ నెమ్మదిగా చేసే రోజు. శ్రీమతి మాత్రం రోజంతా తెగ హడావిడి పడిపోయే రోజు!! మరి నేను, పిల్లలు, ఇంట్లో వుండే రోజు కదా!!! మేమింట్లో వుంటే, మా శ్రీమతికి హడావిడి ఎందుకంటారా? మాకేవేవో చేసి పెట్టాలని తన తపన. ఈ ఆడవాళ్ళకి మొగుడికీ, పిల్లలకీ అన్నీ తానే అయి చూడాలనే తపన పుట్టుకతో వస్తుందో, పెళ్ళయ్యాక వస్తుందో, పిల్లలు పుట్టాక వస్తుందో తెలియదుగానీ, వాళ్ళకుండే ఈ ఆరాటంవల్లే నాలాంటి మగవాళ్ళు బద్ధకస్తులుగా మారటం జరుగుతోందనిపిస్తుంది. మా ఆవిడ కూడా ఉద్యోగం చేస్తోంది. అయినా సరే.. మిగతా రోజుల్లో ఆఫీసులో, ఇంట్లో కలిసి పడే శ్రమకన్నా ఎక్కువ సెలవు రోజుల్లో పడుతుందనిపిస్తుంది. పైగా వర్కింగ్ డేస్ లో నేను సహాయపడాలంటుంది గానీ, హాలీడేస్ లో నాకూ, పిల్లలకి కూడా హాలీడే ఇచ్చేస్తుంది. పిల్లలూ ఇప్పుడే కదా సుఖపడేది. వాళ్ళ సంసారాలు వాళ్ళకేర్పడ్డాక, వాళ్ళకి తీరిక వుండదు కదా అంటుంది. మరి నీకెప్పుడు హాలీడే అంటే, మీకందరికీ ఒక్క రోజయినా అన్నీ చేసి పెడితే నాకు హాలీడే అని నవ్వేస్తుంది.

అందుకే నా సగ భాగం మాకిచ్చిన ఆ హాలీడేని సద్వినియోగం చేసుకుంటూ పిల్లలు ఇంకా నిద్ర లేవలేదు. నేను కాఫీ తాగుతూ తీరిగ్గా పేపరు తీశాను. మా ఆవిడ కేరాఫ్ వంటిల్లు అని చెప్పాను కదా. అప్పుడొచ్చింది మా ఇంట్లో పనిచేసే బూబమ్మ వాళ్ళ అక్కని తీసుకుని. వాళ్ళ అక్క కూడా మా కాలనీలోనే వుంటుంది. తనూ ఇళ్ళల్లో పని చేస్తుంది. అంత మటుకే నాకు తెలుసు. తన పని అయిపోయి వెళ్ళాక మళ్ళీ ఎందుకొచ్చిందా అని సందేహం వచ్చినా, పేపర్ లోంచి తల బయట పెట్టలేదు .. అది శ్రీమతి డిపార్టుమెంటు

తనే చూసుకుంటుందని. కానీ బూబమ్మ నా దగ్గరే ఆగింది. ఒక నిముషం చూసింది నేను తలెత్తుతానేమోనని. అంతకన్నా ఆగే ఓపిక, సమయం బూబమ్మ దగ్గర వుండవు. అందుకే సార్ అని పిలిచింది. నేను తలెత్తకుండానే అమ్మ లోపల వుందన్నాను.

"అమ్మ కోసం కాదు సారూ, మీతోనే మాట్లాడాల. కింద పోర్షను కాళీగా వుంది గదా కిరాయికిస్తారేమోనని!" నిముషం వృథా చెయ్యదు బూబమ్మ.

"ఇస్తాం! ఎవరికి కావాలో వాళ్ళని తీసుకురా!"

"ఇదో మా అక్కా వాళ్ళకే కావాల. అక్కా వాళ్ళంటే వాళ్ళబ్బాయికి. సాఫ్ట్ వేర్ పని చేస్తాడు. మీటింగులకీ వాటికీ ఇంట్లో కుదరటం లేదు. అందుకే ఇదడుగుదామని..."

ఆశ్చర్యం, ఆనందమే కాదు, అసూయ కూడా కలిసిన భావమేదో నాలో పెల్లుబికింది. నేనూ, మా ఆవిడా కొంచెం దేశోద్ధారకులంలెండి. పని మనుషులు పని మనుషుల్లాగే వుండకూడదనీ, వాళ్ళు పిల్లలని బాగా చదివించి, మంచి ఉద్యోగాల్లో చేర్పించాలనీ అవకాశం వున్నప్పుడల్లా, మా పని మనుషులందరికీ క్లాసు పీకుతూ వుంటాము. మా అభ్యుదయ భావాలకి తగ్గట్లు ఒక పనిమనిషి తన కొడుకుని చదివించి, సాఫ్ట్ వేర్ ఉద్యోగస్తుణ్ణి చేసిందంటే చాలా సంతోషం అనిపించింది. ఇలాంటి వాళ్ళని చూసి ఇంకొంత మంది తమ పిల్లలను చదివిస్తారు అనిపించింది. కానీ, పని మనిషి కొడుక్కి నా ఇల్లు అద్దెకివ్వాలా .. అంతరాంతరాల్లో ఏదో అడ్డంకి .. నా అహంకారమా??

ఆ ఒక్క క్షణంలోనే నాలో అనేక ఆలోచనలు. మా ఆవిడ ఏమంటుందో. ఏమన్నా పని సహాయం కావలసి పిలిస్తే పలకటానికి ఎవరన్నా దగ్గర తోడుంటారనుకుంటుందేమో. ఛ ఛ ఇలా ఆలోచిస్తున్నానేమిటి? చదువుకుని, మంచి ఉద్యోగం చేసుకునే బూబమ్మ అక్కయ్య కోడలిని అవసరానికి పిలిస్తే పలుకుతుందా అనే ఆలోచనేమిటసలు? ఇంట్లోకి అద్దెకొచ్చాక వాళ్ళనీ మిగతా అద్దెకున్న వాళ్ళ లాగానే చూడాలి కదా. పని మనిషి రాలేదనో, పనెక్కువగా వుందనో పిలిస్తే ఏమనుకుంటారు .. అసలు ఎలా పిలవాలి?

అయినా నాకెందుకు ఈ గోలంతా. ఇంటి యజమానికే (ఇల్లు మా ఆవిడ పేరున వుంది లెండి..నేను తప్పించుకోవచ్చు) అప్పజెప్తే పోలా.. అని సుజాతా అని లోపలికి చూస్తూ ఓ కేక వేసి, నా బాధ్యత బదిలీ చేసుకున్నాను.

ఎప్పుడొచ్చిందో, మా ఆవిడ గుమ్మంలో నిలబడి "మన రహీమ్ వాళ్ళకేనా" అని అడిగింది బూబమ్మని. తనకి తెలుసనుకుంటాను వాళ్ళ కుటుంబమంతా.

అసలీ ఆడవాళ్ళున్నారే .. వంటిట్లోవున్నట్లే వుంటారు గానీ గూగుల్ కన్నా ఎక్కువ సమాచారం ఎలా సేకరిస్తారో ఏమో!!

"అవునమ్మా వాళ్ళకే" బూబమ్మ సమాధానం.

"అయ్యో నిన్న పొద్దున్న అడిగినా ఇచ్చేవాళ్ళం బూబమ్మా. నిన్న సాయంకాలమే వేరే వాళ్ళకిచ్చేశాము. సార్ కి ఇంకా తెలియదు. ఇప్పుడే లేచారుగా. నేనూ పని హడావిడిలో చెప్పలేదు."

కథా మంజరి
ప్రతి కథల సమాహారం

ఇంటి విషయాల నిర్ణయాలలో మేజర్ వాటా మా శ్రీమతిదే. అందుకే వాళ్ళకే అనుమానం రాలేదు గానీ, నాకు మాత్రం గట్టి అపనమ్మకమే. తుది నిర్ణయం శ్రీమతిదైనా, నా సలహాలేందే ఇలాంటి విషయాల్లో నిర్ణయాలు తీసుకోదుమరి.

"పోన్లేమ్మా ఏం చేస్తాం. మీ ఇల్లయితే అన్ని విధాలా బాగుటుందనుకున్నా. ప్రాప్తం లేదు!" మా ఆవిడ పెట్ డైలాగుల్లో ప్రాప్తం కూడా ఒకటి. ఇన్నేళ్ళనుంచీ మా ఇంట్లో పని చేస్తున్న బూబమ్మకీ వంటబట్టిందీ డైలాగు.

వాళ్ళు వెళ్ళగానే అన్నాను.. "నాకు తెలియకుండా ఇన్నాళ్టికి ఒక పని చేశావన్నమాట .. శభాష్.."

"శభాషూ లేదు గోంగూర కట్టా లేదు. మీకు చెప్పకుండా నేనేమీ ఎవరికీ ఇవ్వనూ లేదు."

"మరి?" నా ముఖంలో ఎన్నో ప్రశ్నార్థకాలు గమనించి, నేనెక్కువ మాట్లాడే అవకాశం ఇవ్వకుండానే చెప్పింది శ్రీమతి.


"మనిల్లు ఇంతమటుకూ వేరే మతం వాళ్ళకివ్వలేదు. పండగలూ, పబ్బాలూ ఏమైనా తేడాలొచ్చినప్పుడు లేనిపోని మాటలొచ్చే అవకాశాలున్నాయి."

"అదేంటి? నీకీ తేడాలెప్పటినుంచి?" విస్తుపోయాను! మరి మా ఇద్దరిలో ఎవరికీ కుల మతాల పట్టింపు లేదు. నా ప్రశ్నకి సమాధానం ఇవ్వకుండానే తన ధోరణి సాగించింది శ్రీమతి..

"పైగా బూబమ్మ మనింట్లో పని చేస్తోంది. చెప్పకుండా సెలవు పెడితేనో, పని సరిగ్గా చెయ్యక పోతేనో ఇద్దరి మధ్యా ఏదన్నా ఒక మాట వస్తుంది. అద్దెకున్న వాళ్ళతో ఇలాంటివి గట్టిగా చెప్పలేము కదా. వాళ్ళీ ఇంట్లో వుంటే మనపని మింగాలేక కక్కాలేక అన్నట్లవుతుంది. ఇవ్వన్నీ చాలా సున్నితమైన విషయాలు. పైగా బూబమ్మా, వాళ్ళక్కా, నాలుగిళ్ళల్లో కష్టపడి పనిచేసి పిల్లల్ని పైకి తెచ్చుకుంటున్నారు. మీ పాత పేంట్లు తొడుక్కుని ఆ అబ్బాయి కాలేజ్ కి వెళ్ళేవాడు. వాళ్ళ కష్టం ఫలించి ఇప్పుడు సెటిల్ అయ్యారు. ఇప్పుడొచ్చి మనింట్లో వుంటే, అతని మనసులో ఎప్పుడన్నా తక్కువ భావం రావచ్చు, అలాగే మనకీ అహం రావచ్చు. అభివృద్ధిలోకొచ్చిన పిల్లాడు, ఎక్కడోక్కడ ఇల్లు దొరక్కపోదు. దూరంగా వుంటేనే వాళ్ళకీ, వాళ్ళ పాత జ్ఞాపకాలు గుర్తు రాకుండా కొత్త బతుకు బతకచ్చు. మనకూ అతని అభివృద్ధిలో మనవంతూ వుందనే అహంకారం రాదు. ఎక్కడివాళ్ళు అక్కడుంటేనే నయం కదూ!"

పెద్దవాళ్ళు చెప్పిన సామెతల వెనక ఎన్ని జీవిత సత్యాలు వున్నాయో అనిపించింది.. మా ఆవిడ ఆఖరి మాట వింటే. అంతే కాదు .. మంచీ, చెడూనే కాకుండా తనలోవున్న మూడో కోణం దూరాలోచన కూడా తొంగి చూసింది అనిపించింది. వాళ్ళూ పైకి వస్తున్నారనే అసూయతో వాళ్ళకి ఇల్లు ఇవ్వ లేదనుకున్నాను గానీ, ఆ ఒక్క క్షణంలో ఇంత దూరాలోచన చేస్తుందనుకోలేదు. వృద్ధిలోకి వస్తున్న వాళ్ళు చిన్న చిన్న కలతలతో వీగిపోక, న్యూనతా భావంతో కించ పడక, ఇంకా వృద్ధిలోకి రావాలని ఎంత సున్నితంగా ఆలోచించింది. శభాష్ శ్రీమతీ అనకుండా వుండలేక పోయాను.

***0***



# మలి సంధ్య

## పెనుమాక నాగేశ్వర రావు

"అన్నపూర్ణా .. ఇంకా ఎంతసేపు ఈ ప్రయాణం!" అసహనంగా అడిగాడు మాధవరావు

"బాగుంది సంబడం .. రైలు కదిలి గంటసేపు కూడా కాలేదు. తొమ్మిది గంటల ప్రయాణం. మీరు అప్పుడే ఇంకా ఎంతసేపు అని అడిగితే ఎట్లా?" అనునయంగా భర్తతో అన్నదామే.

"నాలుగయినట్లుంది, ఆ కాఫీ కాసిని యిద్దూ, ఓ పనైపోతుంది!" భార్య కళ్ళల్లోకి చూస్తూ అడిగాడు

"నాలుగు కావటానికి ఇంకా పది నిముషాలుంది. అయినా తాగేసెయండి. మీకూ కాస్త కాలక్షేపం అవుతుంది"

"వద్దు, వద్దు నాలుగూ కానీ, ఈ పది నిముషాలు కాఫీ కోసం ఎదురుచూస్తూ గడిపేస్తాను"

"అయితే సరే"

"అవును గానీ అన్నపూర్ణా .. రేపటినుంచీ కాఫీ నువ్వే పెట్టి ఈయాలి నాకు. ఆ కోడలు పిల్ల పెట్టే కాఫీ నాకు రుచిగా వుండదు. ఆ మాటకి వస్తే నీ చేతి కాఫీ ముందు ఎవ్వరు పెట్టినా నాకు బాగుండదు!"

పసిపిల్లాడిలా మాట్లాడుతున్న భర్త వంక ప్రేమగా చూసి ముసి ముసిగా నవ్వింది

"ఆ అమ్మాయితో కూడా ఇదే మాట చెప్పేస్తా .. ఏమంటావ్"

"ఆ పని మాత్రం చేయకండి. నేనే ఏదో రకంగా వీలు చేసుకుని మీకు కాఫీ కలిపి తీసుకు వస్తా. మీరలా ముఖం మీదే అనేస్తే, ఆ పిల్ల నొచ్చుకోవచ్చు!" కాస్తంత మందలింపు ధ్వనించింది ఆమె గొంతులో.

అప్పటికే కాఫీ, టీ అంటూ ఇద్దరు ముగ్గురు వచ్చి వెళ్లారు. సమోసాలు, జామ కాయాలూ కూడా వచ్చినై. రైళ్లల్లోనూ, బస్సుల్లోనూ కొనుక్కుని తినరు వీలయినంతవరకు. అందుకే ఇంటి నుంచి ఫ్లాస్కులో కాఫీ పోసుకుని తెచ్చింది అన్నపూర్ణ. పైగా బయటి కాఫీ భర్తకి రుచించవు కూడా.

"సరే సరే నువ్వెలా చెబితే అలా .. నాలుగయిందా?"

"ఆ .. అయింది" అంటూనే గ్లాసులో కాఫీ పోసి ఆయనకు ఇచ్చింది. సిగిరెట్ అలవాటు వున్న మనిషి ఆఖరి పఫ్ ఎంత ఆప్యాయంగా పీలుస్తాడో, కాఫీ ప్రతి సిప్పూ అంతే ఆప్యాయంగా ఆస్వాదిస్తూ తాగేస్తాడు మాధవరావు. అరమోడ్పు కన్నులతో ఆయనలా కాఫీ తాగటం అన్నపూర్ణకు కొండంత సంబరంగా

వుంటుంది. అంతే కాదు కాఫీ తాగటం పూర్తయిన ప్రతిసారి "అద్భుతం" అనకుండా మాత్రం వుండడు. ఆమె నవ్వుకోకుండానూ వుండదు. అది ఆ ఇంట్లో నిత్యకృత్యం.

మాధవరావు "అద్భుతం" అంటూ ఖాళీ గ్లాసు అన్నపూర్ణకు అందించాడు. అదే గ్లాసులో తానూ కాసిని కాఫీ పోసుకుని తాగింది. గ్లాసు కడుక్కుని వచ్చి కూర్చుంది

"మనం అక్కడ ఇమడగలం అంటావా?" బేలగా అడిగాడు మాధవరావు

"మీరు వూర్కెనే కంగారు పడిపోయి, నన్నూ కంగారు పెట్టకండి బాబు, మీకు పుణ్యం వుంటుంది. అంతా బాగానే వుంటుంది, మీరు ధైర్యంగా వుండండి .. నాకూ ధైర్యంగా, ఆనందంగా వుంటుంది!"

"ఎంతయినా మనింట్లో మనం వున్నంత హాయిగా వుంటుందా?"

"అది కూడా మన ఇల్లే అనుకుంటే బాగుంటుంది. మనం పరాయివాళ్ళ ఇంటికేమీ వెళ్ళటం లేదుగా. మన అబ్బాయి దగ్గరకు వెళుతున్నాం. అంతేగా! చిన్నప్పుడు మనతో పిల్లలు, పెద్దప్పుడు పిల్లలతో మనం. రెండూ ఒకటే. మీరు అనవసరంగా ఏవేవో వూహించుకుని బాధపడకండి. అంతా సవ్యంగా సాగిపోతుంది!" భర్తకి భరోసా ఇచ్చింది.

"నువ్వు నా పక్కన వుంటే ఎక్కడయితే నాకేమిటిలే" స్వగతంలో అనుకున్నట్లుగా అన్నాడు మాధవరావు.

"అదీ .. ఆ మాట అనుకోండి. ప్రశాంతంగా వుంటుంది!" అని భర్త చేతిని ప్రేమగా స్పృశించింది అన్నపూర్ణ.

అవును మరి అయిదు దశాబ్దాల వైవాహిక జీవితం. అప్పట్లో అబ్బాయిలకి ఇరవై ఏళ్ళు రావడం ఆలస్యం .. పెళ్లి చేసేవాళ్ళు. భ్రూణ హత్యలు చేసి అమ్మాయిల్ని వద్దనుకున్న మూర్ఖపు రోజులు కాదు కదూ, అందుకే కావలసినంతమంది అమ్మాయిలు, అబ్బాయిలు వున్న కాలం అది. వాళ్ళిద్దరూ ప్రేమించి పెళ్లి చేసుకోలేదు. పెళ్లి చేసుకున్న దగ్గర్నుంచీ ప్రేమించుకుంటూనే వున్నారు.

అలాగని వాళ్ళు ఎప్పుడూ వాదులాడుకోలేదని కాదు. వాదులాట ఏమిటి పోట్లాటలు, చిన్న చిన్న కొట్లాటలు కూడా చోటు చేసుకున్నై, అయితే మాత్రం ఏం? వాళ్ళు ప్రేమించుకుంటూనే వున్నారు. అపార్థాలు, అనుమానాలు, అపోహలు అన్నీ కలిగినై, తొలగినై. అర్థం చేసుకుంటూ సర్దుకుపోతూ, సరిపుచ్చుకుంటూ, సర్దిచెప్పుకుంటూ సరిసమానంగా గౌరవించుకుంటూ ప్రేమించుకుంటూ, బ్రతుకుతున్న సగటు భార్యాభర్తలు వాళ్ళు. అన్యోన్య దాంపత్యమే వాళ్ళది. ఆదర్శ దంపతులే వాళ్ళు.

పెళ్ళయిన మూడేళ్లకు కోరి కోరి కొడుకును కన్నది అన్నపూర్ణ. మరో రెండేళ్ళకి కూతుర్ని కన్నది. నియంత్రణంటూ ఏమీ లేకపోయినా ఆ ఇద్దరు పిల్లలే కలిగారు. పిల్లలు కలిగాక వాళ్ళిద్దరి మధ్యన కలతలు దాదాపు సమసిపోయినయ్యనే చెప్పాలి. వయసు కూడా పెరిగిన కారణంగా ఇద్దరి మధ్యా సయోధ్య కూడా పెరిగింది. సహనం పెరిగింది. పిల్లల్ని ప్రేమగా, గారాబంగా పెంచారు. అయినా క్రమశిక్షణగానే వుంచారు. గవర్నమెంటు నౌకరీ చేసి, రెటైరవ్వక ముందే పిల్లలిద్దరికీ పెళ్లిళ్లు చేసేశారు. వాళ్లూ స్థిరపడ్డారు. వీళ్లూ తృప్తిపడ్డారు.

వుద్యోగం కారణంగా కొన్నేళ్లు, పనులంటూ, ఇల్లంటూ కొన్నేళ్లు .. ఆ ఇద్దరూ అలా కట్టుకున్న ఇంట్లోనే వుండిపోయారు ఇంతకాలం. ఇప్పుడు కదలక తప్పలేదు. అదే ఈ ప్రయాణం.

మొన్నామధ్యన ఓ పది రోజులు శెలవ పెట్టుకుని కొడుకు, కోడలు తమ పిల్లలతో సహా వచ్చి గడిపి వెళ్లారు. పిల్లలతో గడపటం ఆ దంపతులిద్దరికీ అంతులేని ఆనందం కలుగచేసింది. వాళ్ళు ప్రతిదానికీ పదే పదే 'నానమ్మా, తాతయ్యా' అంటూ గారాలు పోవటం మాధవరావుకు, అన్నపూర్ణకూ మహదానందాన్ని కలుగచేసిన మాట నిజం.

అయితే ఓ సాయంత్రం వేళ, కొడుకు పిల్లల్ని తీసుకుని బయటకు వెళ్ళాడు. ఆత్తా కోడలు వంట గదిలో ఏవో పనులు చేసుక్కున్నారు. మాధవరావు మాగన్నుగా వాలుకుర్చీలో పడుకుని ముఖం మీద దినపత్రికని ఉంచుకున్నాడు.

"అది కాదత్తయ్యగారూ! మీరు ఓపిక వున్నది కదా అని ఇక్కడే వుండిపోయి, రేపెప్పుడో ఓపిక పోయినప్పుడు తప్పక మా దగ్గరికి వస్తామంటే నాకు మాత్రం బాగుండొద్దూ, మా అవసరాలకు మీరు సాయంగా వుంటే రేపు మీకు ఏమైనా ఉపచారాలు చేయాలంటే నాకూ చేయబుద్ధి అవుతుంది. బాగా ఆలోచించుకోండి. మామయ్యగారిని ఎలా ఒప్పిస్తారో మీ ఇష్టం. నేను ఆయనతో మాట్లాడలేను ఈ విషయాలు. మీ అబ్బాయికి కూడా నేను మీతో ఇలా అన్నానని చెప్పవద్దు. మా ఇద్దరి మధ్యన వాదులాటలు జరుగుతై!"

"నువ్వు చెప్పేవన్నీ ఒప్పుకుంటానమ్మా, కానీ ఆయనకు ఈ వూరు వదిలి రావటం అసలేమాత్రం ఇష్టం వుండదు. ఆయన ఒప్పుకుంటారని నేను అనుకోవటం లేదు. ఆయన సరే అంటే నాకు ఏ అభ్యంతరమూ వుండదు. నువ్వో, మా అబ్బాయో ఆ పని చేయండి, నేను మారు మాట్లాడకుండా బయలుదేరుతా!" చెప్పింది అన్నపూర్ణ

'అందుకే ఆ బాధ్యత మీకే అప్పజెప్పాను అత్తయ్యగారూ. మీరు ఏమి చెప్పి మామయ్యగారిని ఒప్పిస్తారో మీ ఇష్టం. మీరు ఇప్పుడు వస్తేనే, తర్వాత్తార్వత అవసరం అయితే నేనేమన్నా చేయగలను. అది గుర్తుపెట్టుకోండి. ఈ విషయం మన ఇద్దరి మధ్యనే వుండాలి. మర్చిపోవద్దు" అంటూ కోడలు మరోసారి అత్తగారికి చెప్పి, మాధవరావు కుర్చీ దగ్గరకు వచ్చి ఆయన్ను నిద్ర లేపి మరీ కాఫీ కప్పు అందించింది. అప్పుడే మెలకువ వచ్చినట్లు నటిస్తూ కాఫీ కప్పు అందుకున్నాడు మాధవరావు.

వారిద్దరి సంభాషణా భర్త వినలేదని అన్నపూర్ణ అభిప్రాయం. కోడలి మాటలు తను విననట్లే భార్య అనుకోవాలని మాధవరావు కోరిక.

'ఏమండీ మీరేమీ అననంటే నేనో మాట చెప్తాను!" వాలు కుర్చీ పక్కనే కూర్చుని అన్నది అన్నపూర్ణ

"అంటే మాత్రం నీకు అవమానం ఏమిటిలే చెప్పు"

"అట్లా కాదు. నేనో మాట చెప్తాను, మీరు సరే అనాలి"

కథా మంజరి
పది కథల సమాహారం

"సరే"

"ముందు నన్ను చెప్పనివ్వండి"

"చెప్పు .. చెప్పిన తర్వాత ఆలోచిస్తాను!"

"ఏమీ లేదండీ .. నా కెందుకో  మనం కొద్ది రోజుల్లో అబ్బాయి దగ్గరకు వెళ్లిపోవాలనిపిస్తున్నది. అక్కడే వుండిపోవాలనిపిస్తున్నది. పిల్లల్తో ఓ పది రోజులు గడిపిన తర్వాత, ఇక్కడకొచ్చి ఇలా మన ఇద్దరం వుండటం ఏమిటనిపిస్తున్నది. వాళ్ళతో పాటు అక్కడ వుంటే, పిల్లలు మనకి దగ్గర అవుతారనిపిస్తున్నది. వాళ్ళ పిలుపు మళ్ళీ మళ్ళీ వినాలనిపిస్తున్నది. అందుకే మనం అక్కడికి వెళ్లిపోదామండీ...."

"ఈ ఇల్లు, ఈ మనుషులు, ఈ వాతావరణం, ఈ ఊరు .. ఇవన్నీ విడిచి వెళ్లాలని ఎలా అనిపిస్తున్నది అన్నపూర్ణా.... వెళ్ళినా ఓ వారమో, పది రోజులో, పోనీ ఓ నెలో రెండు నెలలో వుండి,  మళ్ళీ వద్దామంటే అదో రకం.  కానీ ఇక అక్కడే వుండిపోవటం అంటే అంతా తేలికా చెప్పు!" ఎంత నిగ్రహంగా మాట్లాడినా ఆయన గొంతులో కాస్తంత గాద్గదికత చోటు చేసుకున్నది.

నిజం చెప్పలేక, నిష్ఠూరమాడలేక వచ్చే దుఖాన్ని ఆపుకోక తప్పలేదు ఆమెకు.

"సరే ఓ పని చేద్దాం.  ప్రస్తుతానికి  ఓ రెండు నెలలు వుండి వద్దాం.  బాగుంటే మళ్ళీ వచ్చి, సామనంతా సర్దుకుని వెళ్లిపోదాం. లేకుంటే మనకు అక్కడ ఇబ్బందిగా అనిపిస్తే ఇక్కడికే వచ్చేసి వుండిపోదాం .. ఏమంటావ్?" అడిగి భార్య కళ్ళల్లోకి చూశాడు మాధవరావు

"ఆలోచిస్తా!" అంటూ అక్కడినుంచి లేచి వంటగదిలోకి వెళ్ళి కళ్ళు వత్తుకుంది అన్నపూర్ణ

ఓ ఆడదానిగా కోడలి మాటల్లో తప్పు చూడలేకపోయింది, ఓ ఇల్లాలుగా భర్త అంతరంగాన్ని అర్థం చేసుకోకుండానూ వుండలేకపోయింది అన్నపూర్ణ.  అందుకే ఆ ఇద్దరి మధ్యనా న్యాయనిర్ణేతగా మనలేక ఇబ్బంది పడింది.

పోనీ మధ్య మార్గంగా భర్త చెప్పినట్లే  ప్రస్తుతానికి ఓ రెండు నెలలకు ఒప్పుకున్నాడు కాబట్టి,  వెళ్ళాక మరో రెండో, మూడో నెలలకు ఒప్పించటమో, తనకే ఇష్టం కలగటమో జరిగితే కాగల కార్యం గంధర్వులే తీర్చిన చందంగా తన పని సానుకూల పడవచ్చుకదా.. అనే ఆలోచన కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది అన్నపూర్ణకు.

మరిక ఆలస్యం చేయకుండా జరిగిన విషయం కోడలికి ఫోను చేసి చెప్పేసింది.

"ఈ బలవంతపు బాట ఎందుకత్తయ్యా, అసలు విషయం చెప్పేయ్యక పోయారా!"

"చూడమ్మా నువ్వయినా, నేనయినా, ఆ మాటకు వస్తే ఏ ఆడది అయినా మగవాడి మాట వింటున్నట్లు నటిస్తూనే మన మాట వాళ్ళు వినేటట్లు చేసుకోవాలమ్మా ..  ఈ రహస్యం తెలియక చాలామంది కష్టాలు కొని తెచ్చుకుంటున్నారు. దీన్లో న్యాయాన్యాలేమీ వుండవు. అంతా సమర్ధించుకోవటం, సరిపుచ్చుకోవటం అంతే .. సరే ఇప్పటికీ ఈ సమస్య ఇలా పరిష్కరించుకుందాం. ఆ తర్వాత సంగతి తర్వాత ఆలోచిద్దాం!" అంటూ ఫోను పెట్టేసింది

ఆలోచనలతోనే చిన్న కునుకులోకి జారుకున్న అన్నపూర్ణ  ఎదురుగా మరో రైలు పెద్ద శబ్దం చేస్తూ వచ్చేసరికి ఉలిక్కిపడి లేచింది. తననే చూస్తూ కూర్చున్న భర్త వంక ఏమిటన్నట్లు తల వూపింది.  ఏమీ లేదన్నట్లు తల అడ్డంగా వూపాడు మాధవరావు.

“కొన్నాళ్లు వంట కూడా నువ్వే చేస్తే మంచిదేమో పూర్ణా!” దిగులుగా అన్నాడు మాధవరావు

“ఎందుకు అట్లా అంటున్నారు?”

“ఏం లేదు.  ఎంత కాదన్నా కొన్నాళ్ళ వరకు మన వూరి మీద, ఇంటి మీద గుబులు మళ్లుతూనే వుంటుంది. దిగులు దిగులుగానే వుంటుంది. అన్నం తినబుద్ధి కాకపోవచ్చు. ఆకలి లేకపోవచ్చు. దానికి తోడు ఒకవేళ ఆ అమ్మాయి వంట నాకు నచ్చలేదనుకో .. ఎందుకొచ్చిన తంటా .. నువ్వే కొన్నాళ్లు వండితే పోలా .. కాస్తో కూస్తో తిని కడుపు నింపుకుంటాను!”

“సరే మీకు నచ్చకపోతే అలానే చేస్తాలెండి. మీరేం బెంగ పెట్టుకోవద్దు. మీ పక్కన నేనుండి అన్నీ చూసుకుంటాగా. అంతగా ఇంటి మీద బెంగగా వుంటే మధ్యలో ఓ సారి మనిద్దరం వెళ్ళి వద్దాం. లేకపోతే అబ్బాయి, మీరు వెళ్ళిరావచ్చు. అన్నీ సక్రమంగానే జరుగుతాయి, మీరు వర్రీ అవకండి!” అనునయంగా అన్నది అన్నపూర్ణ.

“నువ్వు నా పక్కన వుంటే నాకింకా వర్రీ ఎందుకు పూర్ణా, అదేం లేదు. పడుకునేందుకు ఇంకా ఎంత సమయం వుండాలి చూడు!”

“ఒక్క అరగంట ఓపిక పట్టండి, పడుకుందురు. అలవాటయితే అక్కడా బాగానే వుంటుంది. పిల్లలతో మీకు బోలెడు కాలక్షేపం. మిమ్మల్ని వదిలిపెట్టరు చూస్తూండండి. స్కూలు టయిములో తప్ప మిగిలిన సమయం అంతా మీ తోనే వాళ్ళకి!”

రైలు దిగుతూ వుండగానే కొడుకు, కోడలు, పిల్లలు నవ్వు ముఖాలతో కనిపించేసరికి కొండంత ధైర్యం వచ్చింది ఆ ఆలుమగలకి. ఆప్యాయంగా దగ్గరకి వచ్చి పలుకరించింది కోడలు. పిల్లలు ఇద్దరూ చెరోకర్నీ చుట్టేశారు. కొడుకు ముఖంలో కనిపించిన ఆనందం ఎనలేని తృప్తి నిచ్చింది అన్నపూర్ణకు, మాధవరావుకు. అందరూ కార్లో ఇంటికి చేరారు. దారిపొడుగూతా పిల్లలిద్దరూ నానమ్మ, తాతయ్యలకు ఏవేవో కబుర్లు చెబుతూనే వున్నారు. దారిలో వాళ్ళ స్కూలు చూపించారు.  వాళ్ళ టీచర్ల గురించి చెప్పారు.

ఇల్లు చేరుకుని కాసేపు సేద తీరారు. అంతలోనే కాఫీ తీసుకు వచ్చి అత్త మామలకు అందించి వంటగదిలోకి వెళ్లిపోయింది కోడలు. పిల్లలు కూడా స్నానాలకని వెళ్ళిపోయారు.

ఎవరి టయిములువారివి. ఎవరికి వారు తయారవ్వాల్సిందే.

“నాన్నా ..  ఇదిగో మీకు ఈజీ చెయిర్, మీ కోసమే.  నిన్న మాధవి చెబితే తెచ్చాను!” గదిలో నుంచి తెచ్చిన ఈజీ చెయిర్ చూపిస్తూ చెప్పాడు కొడుకు వివేక్

“కొడుకులకంటే కోడళ్లే నయం. అత్త మామలకి ఏవేవీ అవసరమో కనిపెట్టి కొనిపెడతారు!” అని నవ్వాడు మాధవరావు.

"కొడుకులు మీ అలవాట్ల గురించి మాకు చెబితేనేగా మాకు తెల్సింది మామయ్యగారూ!" అంటూ పిల్లలకి క్యారేజీలు సిద్ధం చేసి తెస్తూ అన్నది మాధవి.
"మాధవి .. నువ్వు వంట ఎలా చేసినా, నాన్నకు కాఫీ మాత్రం సూపర్ గా వుండాలి గుర్తుపెట్టుకో!" చెప్తూ షూ వేసుకున్నాడు వివేక్
"కాఫీ పెట్టె పని రేపటినుంచి నే తీసుకుంటాలే మాధవి!" అన్నది అన్నపూర్ణ
"నా కాఫీ మామయ్యగారికి నచ్చకపోతే మీరే పెడుదురు గాన్లే!"
"నాన్న నే వస్తా. రేపు ఎటూ సండే కదా. ఈ రోజు వెళ్లి వస్తే రేపు ఇంట్లోనే వుంటా, మాట్లాడుకుందాం. అమ్మా వస్తా!" చెప్పి ఆఫీసుకు వెళ్లిపోయాడు వివేక్.
'అదుగో స్కూల్ బస్. బై తాతయ్యా, బై నానమ్మ" అంటూ పరుగు తీశారు పిల్లలిద్దరూ
"మీరు కాసేపు రెస్ట్ తీసుకోండి అత్తయ్యా. నేను ఈ రోజు సెలవ పెట్టాను. కాసేపాగి వంట మొదలు పెడతాను. పని మనిషి ఇంకాసేపట్లో వస్తుంది!" కబుర్లు చెబుతూనే మరోసారి కాఫీ కలుపుకు తెచ్చింది మాధవి. ప్రాణం లేచి వచ్చింది మాధవరావుకు. మనసు తేలికపడింది అన్నపూర్ణకు.
పేపర్ చూస్తూ, వాలు కుర్చీలో పడుకున్న మాధవరావు మెల్లగా నిద్రలోకి జారుకున్నాడు. స్నానం చేసి దేవుడి ముందు కూర్చుంది అన్నపూర్ణ.

మొదటి రోజు గడిచేసరికి ఓ వారం ఇల్లు విడిచినట్లు అనిపించింది ఇద్దరికీ. రెండో రోజు, మూడో రోజు .. అలా ఓ వారం గడిచింది. కోడలు కూడా ఉద్యోగానికి వెళ్ళటం మొదలు పెట్టటంతో పగలంతా వాళ్ళిద్దరే వుంటున్నారు. రాత్రి నుంచి సందడిగా వుంటుందనుకుంటే, పగలంతా అలసిపోయి ఇంటికి చేరిన వాళ్ళు ఎవరి పనుల్లో వాళ్ళు తీరిక లేకుండా వుండేవాళ్లు. హోం వర్క్ పేరుతో పిల్లలు పెద్దలకంటే బిజీ. పగలంతా ఒంటరిగా గడిపి, ఎప్పుడెప్పుడు సాయంత్రం అవుతుందా పిల్లలు, తల్లులూ ఇంటికి చేరతారా అని చకోరపక్షుల్లా ఎదురుచూస్తూ గడిపే ఇలాంటి వృద్ధులకు, వాళ్ళ రాక పూర్తి సంతృప్తిని కలిగించటం లేదు. ఏదైనా అడిగితే సమాధానం చెప్పే తీరికే గానీ పక్కన కూర్చుని కబుర్లు చెప్పే ఓపికా, తీరికా వాళ్ళకు వుండవనే విషయం ఆ ఇద్దరికీ అర్థం కావటానికి ఎక్కువ రోజులు పట్టలేదు. ఇది ఎవరి తప్పూ కాదు. పరిస్థితులు అలాంటివి. అంతే! అన్నపూర్ణ, మాధవరావులు ఆమాత్రం ఆలోచన లేని మనుషులు, అర్థం చేసుకోలేని మనుషులూ కాదు. అందుకే సమస్యలు లేవు. సంతోషంగానే వున్నారు.

ఓ నెల రోజులు గడిచినాయి. ఇంటి మీద గుబులు మళ్ళింది ఇద్దరికీ. మాధవరావు బయటపడ్డాడు, అన్నపూర్ణ బయటపడలేదు. అంతే తేడా. కానీ ఎలా? అక్కడే వుండిపోవటానికి రమ్మంది కోడలు. ఎలాగో ఒప్పించి ముందు రెండు నెలలకని వచ్చి, తర్వాత స్థిరంగా వుండిపోదామని ఆ పిల్లకి చెప్పింది.

ఇప్పుడు భర్తకే కాదు, తనకూ ఇంటి మీదా, వూరి మీదా మనసు మళ్ళింది. తన మనసులో మాట భర్తకి చెబితే అసలు ఒక్క రోజు కూడా ఆలస్యం చేయకుండా తిరుగు ప్రయాణానికి సిద్ధపడతాడు. అందుకే ఆమె ఆ విషయం మాధవరావు దగ్గర ప్రస్తావించదలుచుకోలేదు.

వున్నట్లుండి మాధవికి కడుపులో నొప్పి విపరీతంగా రావటంతో హాస్పిటల్కి తీసుకు వెళ్లారు. తోడుగా అన్నపూర్ణ కూడా వెళ్లింది. రకరకాల పరీక్షలు చేసి, యక్సరేలు తీయించి, చివరికి ఆమెకు ఆపరేషన్ చేయాలని తేల్చారు డాక్టర్లు. వెంటనే ఏర్పాట్లు జరిగిపోయినై. కోడలికి పక్కనే వుండి, ధైర్యం చెబుతూ, కావలసిన ఉపచారాలు చేయసాగింది అన్నపూర్ణ. తల్లి లేని మాధవి నిజంగా అత్తగారు దగ్గర వుండి, అలా తనను ప్రేమగా, బాధ్యతగా కనిపెట్టుకుని వుండటం ఎంతో హాయిని, తృప్తిని కలిగించింది. అత్తగారి మీద గౌరవం రెట్టింపయ్యింది. అంతే కాదు ఆమె పట్ల ప్రేమ కూడా కలిగింది. కోడలు ఇంటికి వచ్చాక కూడా కాలు కింద పెట్టకుండా జాగ్రత్తగా చూసుకుంది. ఆమెకు పూర్తి ఆరోగ్యం వచ్చేవరకూ తనకు తెలిసిన చిట్కా వైద్యాలను ప్రయోగించి, కోడలికి కూడా కొన్ని నేర్పింది. పిల్లలకి చిన్న చిన్న అనారోగ్య సమస్యలు వస్తే గాబరా పడకుండా ఇంట్లోనే ఎలా ఉపశమనం కలింగించవచ్చో ఓ అవగాహన కల్పించింది కోడలికి.

మాధవి పూర్తిగా కోలుకుని ఆఫీసుకు వెళ్ళటం పిల్లలూ, పెద్దలూ యధావిధిగా ఎవరి పనుల్లో వారు బిజీ కావటం, మళ్ళీ ఆ ఇంట్లో మామూలు వాతావరణం నెలకొన్నది.

ఓ రోజు కొడుకు అన్నపూర్ణ కోరిక మేరకు గుడికి తీసుకు వెళ్ళాడు. పిల్లలు కూడా గొడవ చేయటంతో వాళ్ళనీ వెంట తీసుకు వెళ్ళాడు. ఇంట్లో మాధవరావు, మాధవి ఇద్దరే వుండిపోయారు. సరిగ్గా అలాంటి అదను కోసమే వేచివున్న మాధవరావు, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు. ఒక్క నిముషం కూడా వృధా కాకూడదని కోడల్ని పిలిచాడు.

వంట గదిలో పనిలో వున్న మాధవి మామగారి పిలుపు విని హాల్లోకి వచ్చింది

"ఏంటి మామయ్యగారూ పిలిచారా?"

"అవునమ్మా .. పిలిచాను. నిజంగా ఈ సందర్భం కోసం నేను వచ్చిన రోజు నుంచి ఎదురుచూస్తున్నాను. ఇప్పటికీ కుదిరింది. నీతో కొన్ని విషయాలు మాట్లాడాలమ్మా!"

"చెప్పండి మామయ్యా!"

"మీ అత్తయ్య ఒట్టి అమాయకురాలమ్మ. మీరన్నా, పిల్లలన్నా పిచ్చి ప్రేమ. మీ ఆయనంటే వల్లమాలిన ప్రేమ., కాదు కాదు ప్రాణం. చిన్నప్పటి నుంచీ వాడ్ని అలాగే పెంచింది, పెద్ద చేసింది…"

"అవును మామయ్యా… ఆయనా సందర్భం వచ్చినప్పుడల్లా చెబుతూనే వుంటారు!"

"నువ్వు పోయిన సారి మన వూరు వచ్చి, మీ అత్తయ్యతో ఏం మాట్లాడావో నాకు తెలియదని అనుకుంటున్నది పాపం ఆ పిచ్చి మనిషి. కానే నేను నీ మాటలు విన్నానమ్మా. విన్నట్లు ఆమెకు

చెప్పలేదు. చెబితే తాను తట్టుకోలేదు. అందుకే నేను మౌనంగా వుండిపోయాను. నన్ను ఆ వూరినుంచి ఇక్కడికి తీసుకు రావటానికి ఎంత కష్ట పడిందో నాకు తెలుసు. ఆమెను ఎక్కువ ఇబ్బంది పెట్టకూడనే నేను వెంటనే ఒప్పేసుకున్నాను."

"ఇప్పుడిదంతా ఎందుకు చెపుతున్నానంటే ప్రేమ అనేది షరతులతో వుండకూడదమ్మా. ముఖ్యంగా ఈ వయసులో మా బోటివారికి ఎక్కడ వుంటే మానసికంగా ఎక్కువ ఆనందంగా వుంటుందో, అక్కడే వుండనీయాలి. ఇప్పుడు అన్నీ సదుపాయాలు అన్నిచోట్లా అమరినై. డబ్బులుంటే హాస్పిటల్లోనే మందుల షాపు, హోటల్, రోగితో వచ్చినవారికి వుండటానికి, పడుకోవటానికి, తినటానికి లోటు లేని విధంగా అన్నీ ఏర్పాట్లు చేశారు. ఒకవేళ నేనో, మీ అత్తయ్యో మంచాన పడితే, నువ్వు వస్తే, ఉద్యోగం మానేసి ఎన్నాళ్లు వుండగలవు! మహా అయితే ఓ నెల .. అదీ ఎక్కువే, అప్పుడు తప్పక మేమే మీ దగ్గరకు వస్తే, మీకు కొంత వెసులుబాటు కలుగుతుంది. చిన్నప్పటి నుంచీ వున్న వూరు. ఆ వాతావరణం, ఆ మనుషులూ, ఆ పలకరింపులూ .. అవే అవే మాకు కాస్తంత రిలీఫుని కలుగచేస్తాయి. మానసికంగా ఆనందంగా వుంటే సగం ఆరోగ్యం వున్నట్లేనమ్మా. సంతోషం సగం బలం అన్నారుగా మరి. మా జీవితాలు చివరి దశకు చేరుకుంటున్నాయి. ఈ మసక మసక చీకటిలో కాస్తంత వెలుతురు కావాలంటే మాకు మనసులు ఆనందంగా వుండాలమ్మా. చూడు మాధవీ క్షమాపణలూ, పశ్చాత్తాపాలూ కాదమ్మా .. నేనో మాట చెప్తాను చూడు. కష్టాలు కూడా మనిషికి మంచినే చేస్తాయి కొన్నిసార్లు. నీకు అనారోగ్యం చేయబట్టి, మీ అత్తయ్య నిన్ను ప్రేమగా చూసుకోబట్టి, ఆమె ప్రేమను నువ్వు అర్థం చేసుకోబట్టి అత్తలో అమ్మను చూడగలిగావు. అవునా .. అంటే నీ అనారోగ్యం ఓ ఆరోగ్యకరమైన ఆలోచన కలిగించింది. అదే ఏ అనారోగ్యమూ కలుగకపోయినా మనం ఎప్పుడూ ఆరోగ్యకరమైన ఆలోచనలే కలిగివుంటే, ఇంకా ఎంత బాగుంటుందో అర్థం చేసుకోవాలి. ఒకరి సంతోషం కోరుకుంటూ వున్నవాళ్లకి ఎప్పుడూ రోజులు సంతోషంగానే గడిచిపోతాయమ్మా. అది గుర్తుపెట్టుకుంటే చాలు. మేము ఇలాగే వస్తూ పోతూ వుంటాం. మీరూ వచ్చి వెళ్తూ వుండండి. అందరం హాయిగా ఉందాం. మాకు మంచానపడే దశ రాదని ఆశిద్దాం. ఎప్పుడో ఏదో జరుగుతుందని భయపడి అనవసర సమస్యల్ని సృష్టించుకోవటం ఎందుకు!"

"మరొక్క మాట. మనం ఇవన్నీ మాట్లాడుకున్నాం అని మీ అత్తయ్యతో చెప్పకూ. నిన్ను కష్టపెట్టి ప్రయాణం చేయించానని నన్ను సతాయిస్తుంది. ఇది మనిద్దరి మధ్యనా రహస్యంగా వుంచాలి. నా పుత్ర రత్నానికి కూడా తెలియనీకు. వాడికసలే ఆవేశం ఎక్కువ!"

మామగారి మాటలకు నవ్వకుండా వుండలేకపోయింది మాధవి

ఓ వారం రోజుల తర్వాత మాధవరావు భార్యతో తన వూరికి తిరుగు ప్రయాణం అయ్యాడు

రైలు కూతలు వేసుకుంటూ గమ్యం వైపు పరుగులు తీస్తున్నది .

***0***

కథా మంజరి పది కథల సుమహారం

# జారుడు బండ



గండ్రకోట సూర్యనారాయణ శర్మ

సాయంత్రం వాకింగ్ అలవాటున్న నేను, మా ఇంటి దగ్గరున్న పార్కు వైపు వెళ్ళాను. అక్కడో పిల్లాడు జారుడు బండ మీద నుంచి కిందికి జారి, మళ్ళీ వెళ్ళి మెట్లెక్కకుండా, ఆ జారుడు బండ పైకి ఎదురు ఎక్కుతున్నాడు. కొంతదూరం ఎక్కి, పట్టు దొరక్క కిందికి జారి కింద పడుతున్నాడు. మళ్ళీ లేచి పైకెక్కుతున్నాడు. వాడలా జారిపడుతుంటే నవ్వుతూ చూస్తున్న వాడి తల్లిదండ్రుల్ని చూస్తుంటే నాకు వొళ్ళుమండింది. వెళ్ళి వాళ్ళిద్దరినీ కడిగేయాలనిపించింది. కానీ నాకెందుకులే అని ఆగిపోయాను.

ఇంటికొచ్చి విశ్రాంతి తీసుకుంటుండగా సుబ్బు వచ్చాడు. వస్తూ వస్తూనే "వదినా పిచ్చి ఆకలేస్తుంది. అన్నం పెట్టు" అన్నాడు వంటిట్లో ఉన్న సుమతితో. వాడి చనువు చూస్తే నా శ్రీమతికి తగని వొళ్ళు మంట. ఏదో స్వంత ఇంట్లోకి వచ్చినట్లు రావటం "వదినా అది చెయ్యి, వదినా ఇది చెయ్యి" అంటూ ఎక్కడలేని చనువును ప్రదర్శిస్తుంటే తను చాలా విసుక్కునేది. కానీ నా మొహం చూసి అగిపోయేది.

"ఏంట్రా ఉన్నట్లుండి ఊడిపడ్డావు? నీ బిజినెస్ బాగా సాగుతోందా?" అడిగాను నవ్వుతూనే.

"లేదురా. నా పార్టనర్ మోసం చెయ్యటంతో బాగా నష్టమొచ్చింది!" అన్నాడు.

"మరి వాడినెందుకు వదిలిపెట్టావు? కోర్టుకీడవాల్సింది!" అన్నాను.

"పోనీలేరా... పిల్లలు కలవాడు... కక్కుర్తి పడ్డాడు!"

"బాగుందిరా.. ఇలా జాలి పడితే ఇక నువ్వు బిజినెస్ చేసినట్టే!" అన్నాను.

"అందుకే బిజినెస్ వదిలేశాన్లే. ఇప్పుడు మన ఊరి సర్పంచిగా పోటీ చేస్తున్నాను. ఎన్నికల రోజు నువ్వూ, వదినా మన ఊరికి తప్పకుండా రావాల్రోయ్!" అన్నాడు.

"సరిపోయింది. బిజినెస్ అయింది.. ఇప్పుడు రాజకీయాలా? ఒక చోట స్థిరంగా ఉండొచ్చు కదరా. ఎందుకిలా అన్నింట్లోనూ వేలు పెడతావు!" కాస్త కోపంగానే అన్నాను.

"బిజినెస్ మనకి సరిపడదులేరా .. తిరిగే కాలూ, తిట్టే నోరూ అంటారుగా. మనదీ అదే టైపు. అది సరేగానీ ఎన్నికల రోజు మాత్రం రావటం మర్చిపోకురోయ్. వదినా! నువ్వుకూడా తప్పకుండా రావాలి!" అని ఇద్దర్నీ హెచ్చరించి, భోజనం చేసి వెళ్ళిపోయాడు.

***

సుబ్బు అసలు పేరు సుబ్రహ్మణ్యం. వాడు మా బాబాయి కొడుకే. చిన్నప్పట్నుంచీ వాడి జాతకమే అంత. జీవితంలో ప్రతి దశలోనూ బొక్కబోర్లా పడటం, మళ్ళీ లేచి దులుపుకుని పరిగెత్తటం వాడికి అలవాటైపోయింది. దెబ్బ తిన్నాకైనా కుదురుగా ఉంటాడా అంటే అదీ లేదు. మళ్ళీ ఏదో ఒక దాన్లో వేలు పెడుతూనే వుంటాడు. ఇలాంటి వాళ్ళని దేవుడెందుకు పుట్టిస్తాడో నాకిప్పటికీ అర్థం కాని ప్రశ్నే. ఒక రకంగా వాడంత దురదృష్టవంతుడీ భూప్రపంచంలో లేడని ఘంటాపథంగా చెప్పవచ్చు. అయితే జీవితంలో ఎన్ని ఢక్కామొక్కీలు తిన్నా, పైకి మాత్రం వాడెప్పుడూ సరదాగా నవ్వుతూ కనిపించేవాడు.

వాడీ భూమ్మీద పడగానే వాడి తల్లి కన్ను మూసింది. వాడి ఆలనాపాలనా చూసే దిక్కు కోసం మా బాబాయి మళ్ళీ పెళ్ళి చేసుకోక తప్పింది కాదు. సవతి తల్లి కావటంతో మా పిన్ని వాడితో ఇంటెడు చాకిరీ చేయిస్తూ, నానా అగచాట్లూ పెట్టేది. ఆ పరిస్థితుల్లో వాడి చదువు ఎలా సాగిందో నేను విడిగా చెప్పాల్సిన పని లేదు. స్కూల్లో వాడు నేను ఒకే క్లాసు. నేనెప్పుడూ క్లాస్ ఫస్టే. వాడికి మాత్రం ప్యాస్ మార్కులు రావటం కూడా గగనమయ్యేది. అయితే మా హెడ్ మాస్టర్ గారు జాలిపడి, వాడిని పై క్లాసుకి ప్రమోట్ చేస్తుండేవాడు. పదో తరగతి కొచ్చేసరికి, పరీక్షల ముందు వాడు నాతో "ఒరే ప్రసాదూ! ఈ పరీక్షల్లో ఏ ఏ ప్రశ్నలొస్తయ్యో చెప్పరా. అవి చదివితే కనీసం ప్యాసన్నా అవుతాను!" అని అడిగాడు. నేను కొన్ని ప్రశ్నలు చెబితే అవి మాత్రమే చదివి, ఏదో అత్తెసరు మార్కులతో మొత్తానికి  బయటపడ్డాడు.

మా స్కూల్ చదువులైపోయాక ఇద్దరమూ కాలేజీలో చేరాము. నేను సైన్స్ సబ్జెక్ట్ తీసుకుంటే, వాడు హిస్టరీ తీసుకున్నాడు. రెండేళ్ళ తర్వాత నేను డిగ్రీ కెళ్ళిపోయాను కానీ .. వాడు మాత్రం ఇంటర్ గట్టెక్కలేక చదువు మానేసి పెట్టే బేడా సర్దుకుని, ఎర్ర బస్సెక్కేశాడు.

నేను సిటీలో రూం తీసుకుని ఉంటూ కాలేజీకి వెళ్ళేవాడ్ని. వీడు సిటీ వచ్చినప్పుడల్లా నా రూం లోనే దిగేవాడు. ఒకసారి వచ్చినప్పుడు ఏదో వ్యాపారం చేస్తున్నాననేవాడు. మరోసారి వచ్చి, పాతది వదిలేసి, కొత్త వ్యాపారం చేస్తున్నానని చెప్పేవాడు. పిన్నీ, బాబాయి పోయాక ఉన్న ఆస్తిని ఇలా తగలేస్తున్నడన్న బాధతో "ఎందుకురా కుదురుగా ఒక చోట స్థిరంగా ఉండక, పిల్లి పిల్లలతో మకాం మార్చినట్లు మాటిమాటికీ ఆ బిజినెస్, ఈ బిజినెస్ అంటూ డబ్బు తగలేస్తావు?" అనడిగితే నవ్వేసి, "మనం చేసేదేదైనా సరే మన మనసుకు నచ్చాలిరా. లేకుంటే అది చేసీ వేస్ట్!" అనేవాడు.

"ఇన్ని సార్లు ఓడిపోతుంటే బాధగా లేదారా?" అంటే తేలిగ్గా నవ్వేసి, "అలవాటైపోయిందిరా" అనేవాడు.

డిగ్రీ అయ్యాక పీజీ కూడా చేశాక, పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ టూ పరీక్షల్లో ఉత్తీర్ణుడినై గెజిటెడ్ ఆఫీసర్ హోదా ఉద్యోగం రావటంతో, నేను సిటీలో స్థిరపడిపోయాను. ఆ తర్వాత ఒక స్కూల్ ప్రిన్సిపల్ గా పనిచేస్తున్న నా క్లాస్ మేట్ సుమతితో నా పెళ్ళి జరిగిపోయింది.

ఈ మధ్యనే వాడి పెళ్ళి కూడా జరిగింది. జీవితంలో ఏ రకంగానూ స్థిరపడని అలాంటి వాడికి పిల్లనెవడిచ్చాడా? అని నేను ఆశ్చర్యపోయాను. తీరా తెలిసిందేమిటంటే వాడిది ప్రేమ వివాహమట. పెళ్ళికి వెళ్ళాను. అమ్మాయి చామనచాయలో చాలా సాధారణంగా ఉంది. మొత్తానికీ గంతకు దగ్గ బొంతలాగా ఇద్దరి జోడీ సరిపోయిందనిపించింది నాకు.

***

తీరా మా ఊరి సర్పంచి ఎన్నికల సమయానికి నేను ఆఫీసు పనిలో బిజీగా వుండి, అక్కడికి వెళ్ళలేకపోయాను. తర్వాత తెలిసింది వాడు ఘోరంగా ఓడిపోయాడని. నాకు కాస్త బాధ అనిపించింది. వాడికి మొహం ఎలా చూపించాలో అర్థం కాలేదు. నాలాంటి దగ్గరి చుట్టాలు కూడా ఓటెయ్యకుండా ఎగ్గొడితే, ఇక వాడు మాత్రం ఎలా గెలుస్తాడు?

ఆ తర్వాత వారం రోజులకి మళ్ళీ వచ్చాడు. నన్ను ముక్కచివాట్లు పెట్టటానికే వచ్చాడని ఊహించి, నేనూ తిట్లు తినటానికి రెడీ అయ్యాను. కానీ విచిత్రంగా వాడు నన్ను ఒక్క మాట కూడా అనలేదు. అసలు ఓడిపోయానన్న దిగులు వాడి ముఖంలో మచ్చుకి కూడా కనబడలేదు. ఏమీ జరగనట్లు మామూలుగా మాట్లాడి వెళ్ళిపోయాడు. అలా ఓడిపోయినా .. వాడు రాజకీయాలను మాత్రం వదిలి పెట్టలేదు. రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలో చేరి, తిరగటం మొదలుపెట్టాడు.

"ఆ చేరేదేదో అధికార పార్టీలో చేరి వుంటే, ఏ కార్పొరేషన్ పదవోదక్కేదిగదరా!" అని నేనంటే, "అధికార పార్టీ సిద్ధాంతాలు నాకు నచ్చలేదురా. అందుకే చేరలేదు!" అన్నాడు. వాడి మాటలకు నాకు ఆశ్చర్యమనిపించింది. 'అబ్బో! వీడికీ కొన్ని సిద్ధాంతాలూ, రాద్ధాంతాలూ ఉన్నాయన్నమాట' అనుకున్నాను. ఇది వాడిలో నేను చూసిన కొత్త కోణం.

***

కాలం అనేది బ్రేకుల్లేని బండిలాంటిది. అది ఆగకుండా గిర్రున తిరుగుతూనే వుంటుంది. దాన్నెక్కి తిరిగేవాళ్ళు కొందరైతే, దాని చక్రాల కింద పడి నలిగిపోయేవాళ్ళు కొందరు. నా జీవితం మాత్రం ఆ బండి మీదెక్కి జల్సాగా సాగిపోసాగింది. ఉద్యోగంలో నేను అంచెలంచెలుగా పైకెదిగాను. సిటీలో ఖరీదైన ఏరియాలో స్థలం కొని, బ్రహ్మాండమైన ఇల్లు కట్టుకుని స్థిరపడిపోయాను. కవల పిల్లలకు తండ్రినయ్యాను. కొడుకు, కూతురు ఇద్దరూ చాలా తెలివైనవాళ్ళు. ఎంతైనా నా పిల్లలు కదా! 'పండిత పుత్రః పరమ శుంఠః' అనే నానుడిని అబద్ధం చేస్తూ, వాళ్ళిద్దరూ చదువులో సాఫీగా ముందుకు సాగిపోతున్నారు.

అటు సుబ్బిగాడికీ ఒక కొడుకు పుట్టాడనీ, వాడూ తండ్రిలాగానే చదువులో అంతంత మాత్రమేననీ తెలిసి, నాకు నవ్వొచ్చింది. జీన్స్ అనేవి తల్లిదండ్రుల నుంచే కదా పిల్లలకు సంక్రమించేది .. వాడి కొడుకూ వాడిలాగే తాడూ బొంగరం లేనివాడిలా తయారవుతాడనిపించింది. పిల్లల్ని పట్టించుకోకుండా తండ్రి రాజకీయాల్లో పడి తిరుగుతుంటే, ఇక ఆ పిల్లలు మాత్రం ఎలా పైకొస్తారు?

ఉన్నట్టుండి వాడు ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నాడని తెలిసి నేను ఆశ్చర్యపోయాను. అంటే మనవాడు రాజకీయాల్లో కాస్త ఎదిగాడన్నమాట. ఇక ఆ ఎన్నికల పనిలో పడి వాడు చాలా బిజీ అయిపోయి, మా ఇంటికి రావటం కూడా తగ్గించేశాడు. అప్పుడప్పుడూ ఫోన్ చేసి, రాజకీయ నాయకులకుండే కష్టనష్టాలను నా దగ్గర ఏకరువు పెడుతుండేవాడు.
ఈ సంగతి వినగానే సుమతి నాతో "ఊరి సర్పంచిగా కూడా గెలవలేనివాడు, ఎమ్మెల్యేగా గెలుస్తాడని ఆ పార్టీవాళ్ళు ఎలా అనుకున్నారండీ?" అన్నది నవ్వుతూ.
ఆ మాట నాకూ నిజమే అనిపించింది కానీ "వాడొచ్చినప్పుడు ఈ మాట వాడిముందు అనేవు!" అన్నాను.
"ఛ. నేనెందుకంటానూ... నాకామాత్రం తెలీదా?" అంది.

***

కాలమనే బండి మీద ఎక్కి హాయిగా సాగిపోతున్న నాకు తెలీదు... అప్పుడప్పుడు ఆ బండి పైనున్నవాళ్ళని కూడా కింద పడేసి, వాళ్ళ మీద నుంచి వెళ్తుందని.
ఉన్నట్టుండి ఇన్కమ్ టాక్స్ వాళ్ళు మా ఇంటి మీద రెయిడ్ చేశారు .. ఆదాయానికి మించిన ఆస్తులున్నాయని! నా కష్టార్జితంతో పాటు, మా ఊర్లో ఉన్న పొలాలన్నీ నేను అమ్మి, తక్కువ రేట్లు ఉన్నప్పుడు స్థలాలూ, బంగారం కొనటం జరిగింది. ఉన్న ఇల్లు మొత్తం నా కష్టార్జితమే. వాటన్నింటినీ ప్రస్తుత మార్కెట్ రేటుకి లెక్కవేసి, నా సంపాదనంతా అక్రమార్జితమేనని తేల్చారు. అయితే ఈ కుట్ర వెనక నా జూనియర్ ఒకతని హస్తం ఉందని నాకు తెలుసు. నేను అడ్డు లేకపోతే అతనికి ప్రమోషన్ వస్తుంది. అందుకని నా మీద లేనిపోని నేరారోపణలు చేసి, నన్ను నిందితుడిగా చిత్రించాడు. అతని వెనక అధికార పార్టీ ప్రముఖుడొకడున్నాడని నాకు తెలిసింది. రాజకీయ నాయకులు తలచుకుంటే సాధ్యం

కానిదేముంటుంది! నన్ను సస్పెండ్ చేశారు. కొద్ది రోజుల్లో నన్ను కోర్టులో ప్రవేశపెడతామని తాఖీదు కూడా వచ్చింది. సిటీ వదిలి వెళ్ళవద్దని అల్టిమేటం ఇచ్చారు పోలీసులు. నాకేం చెయ్యాలో పాలుపోలేదు.
ఆఫీసులోనూ నాకు లంచగొండినన్న అపప్రథ వచ్చింది. సమాజంలో తలెత్తుకుని తిరగలేకపోయాను. నా భార్యగా స్కూల్లో సుమతికి అవమానాలు మొదలయ్యాయి. మొహం గంటు పెట్టుకుని ఇంటికొచ్చింది. కాలేజీకెళ్ళిన పిల్లలు ఇంటికొచ్చి భోరుమన్నారు.
ఇన్నాళ్ళూ సమాజంలో గౌరవంగా బ్రతికిన మా కుటుంబం పరువు వీధిపాలయ్యింది. ఇంత గౌరవంగా బతికి ఇప్పుడీ స్థితిని ఎలా తట్టుకోవాలో మాకు అర్థం కాలేదు. ఇంట్లో నవ్వుల పువ్వులన్నీ వాడిపోయాయి. బృందావనంలాంటి ఇల్లు ఎడారి సదృశంగా మారిపోయింది. ఇంట్లో ఒకరితో ఒకరికి మాటలు లేవు. ఇలాంటి దుస్థితిని దేవుడు మా కుటుంబానికే ఎందుకు కల్పించాడో నాకు అర్థం కాలేదు. ఇక మాకు ఆత్మహత్య తప్ప వేరే మార్గం కనపడలేదు.

అప్పుడొచ్చాడు సుబ్బు. "వదినా! చాలా ఆకలిగా ఉంది. ఈ ఎలక్షన్ల గొడవలో పడి తిండీ తిప్పలూ మర్చిపోయాను. అన్నం పెట్టు!" అంటూ హడావుడి పెట్టాడు. పిల్లలకు ఏవో రాజకీయాలకి సంబంధించిన జోక్స్ చెప్పాడు. వంట పూర్తవగానే "రండి. అందరం కలిసి తిందాం!" అన్నాడు. మా ఎవ్వరికీ అన్నం సహించకున్నా, బలవంతాన మమ్మల్ని లేపాడు.
డైనింగ్ టేబుల్ మీద వడ్డన చెయ్యబోతుంటే "వదినా! హాయిగా కింద కూర్చుందాం" అంటూ వంట పాత్రలన్నీ కిందికి చేర్చాడు. రోజు వాడికెదురయ్యే సంఘటనలని హాస్యభరితంగా చెప్తూవుంటే మేము మా బాధ మరచిపోయి వాడితోపాటే తినేశాం.
ఆ తర్వాత అందరం హాల్లో సోఫాల్లోకి చేరాం. అప్పుడడిగాడు వాడు "ఈ మధ్య ఏదో జరిగిందట?"అని. జరిగిందంతా తెలిసి సానుభూతి చెప్పటానికి వచ్చాడనిపించి, జరిగింది సూచనాప్రాయంగా చెప్పాను.
అంతా విని "ఓస్ ఇంతేనా? ఈ మాత్రం దానికేనా ఏదో పోగొట్టుకున్నట్లు అందరూ మొహాలు వేలాడేసుకున్నారు? ఆ లెక్కన చూసుకుంటే జీవితంలో నాకెదురైన కష్టాలకు నేనేనాడో ఆత్మహత్య చేసుకుని వుండాల్సింది. పోరాడాలిరా. తప్పు చెయ్యనప్పుడు ఎందుకు తల దించుకోవాలి? ఇలాంటప్పుడే మనిషికి గుండె ధైర్యం కావాలి. గడ్డు పరిస్థితులను ఎదురించాలి. నీకొచ్చిన కష్టం చిన్నదని నేననను. ఎప్పుడూ గెలుపు మాత్రమే తెలిసిన నీకు, ఇప్పుడు ఓటమి తన రుచి చూపించింది. మళ్ళీ గెలిచేవరకూ నీ శత్రువు మీద యుద్ధం ప్రకటించు. చివరివరకూ పోరాడు!" అన్నాడు.
"ఈ కేసులో గెలుస్తాననుకుంటావా?" అనుమానంగా అడిగాను.
"జయాపజయాలు దైవాధీనాలు. అయినా నువ్వు నిజాయితీపరుడివి. అది నిరూపించుకోవటానికి యుద్ధం చెయ్యి. గెలుస్తావో లేదో తర్వాత సంగతి. ముందు యుద్ధమైతే చెయ్యాలిగా!" అన్నాడు. గీతోపదేశం చేసే కృష్ణుడిలా వాడు చెప్పదలచుకున్నది చెప్పేసి "మరి నేను వస్తాన్రా .. గెలిచిన ఎమ్మెల్యేగానో, ఓడిపోయిన


ఎమ్మెల్యేగానో మళ్ళీ కలుస్తా!" నవ్వుతూ అనేసి వెళ్ళిపోయాడు. ఏమీ చేతగానివాడని మొదట్నుంచీ చిన్నచూపు చూస్తూ, వాడ్ని చూసి నవ్వుకునే వాడిని. కానీ వాడు అనుభవంతో చెప్పిన మాటలు నాలో ఉత్సాహాన్నీ, ఉత్తేజాన్నీ నింపి, ఇలా కనువిప్పు కలిగిస్తాయని నేనెన్నడూ ఊహించలేదు.

నిజమే. ప్రతి మనిషీ తన జీవితంలో సుఖమూ దుఃఖమూ, లాభమూ నష్టమూ, తీపీ చేదూ అన్నీ రుచి చూడాలి. సుఖాల పడవలోనే నా జీవన ప్రయాణమంతా సాగిపోయింది. చేదు రుచే నాకు తెలీలేదు. ఓటమి అనే పదానికి నా నిఘంటువులో చోటే లేకుండాపోయింది. కష్టమనేదొకటి ఉంటుందని కూడా తెలీనంతగా, సుఖం మత్తులో మునిగిపోయాను. ఇప్పుడు ఉన్నట్లుండి నా పడవ ఒక చిన్న సుడిలో చిక్కుకుంది. నా దృష్టిలో అది చాలా పెద్ద కష్టం. అందుకే దాన్నసలు తట్టుకోలేక పోతున్నాను. ప్రతి మనిషీ తప్పనిసరిగా ఓటమినీ, కష్టాన్నీ అనుభవించాలి. అప్పుడే మనిషి రాటుదేల్తాడని నాకు తెలిసొచ్చింది.
దేవుడు తెలివితేటలనే శస్త్రాస్త్రాలన్నీ నాకు ఎప్పుడో ఇచ్చేశాడు. వాటి అవసరం లేదని నేనే వాటిని కట్టగట్టి ఏ జమ్మిచెట్టుమీదనో దాచిపెట్టాను. వాటిని బయటకు తియ్యాలి. సమర్ధవంతంగా ఉపయోగించుకోవాలి. యుద్ధం చెయ్యాలి. ఇన్నాళ్ళూ గెలుపుకి మాత్రమే అలవాటుపడ్డ నాకు, ఈ అనుభవం ఒక కొత్త పాఠాన్ని నేర్పింది. ఆత్మహత్య దాకా ఆలోచించానంటే విజయం ఇచ్చిన సుఖం మత్తులో నేనెంతగా మునిగిపోయానో నాకు అర్థమైంది.
"అవునండీ. మీ తమ్ముడు చెప్పినట్లు ఏ తప్పూ చేయని మనమెందుకు భయపడాలి? ఈ గడ్డు పరిస్థితిని ఎదుర్కొందాం" అంది సుమతి.
"అవును నాన్నగారూ! మనమెవ్వరికీ భయపడాల్సిన అవసరం లేదు" అన్నారు పిల్లలిద్దరూ.

పార్కులో జారుడు బండ మీద ఎదురెక్కుతున్న ఆ పసివాడు చూపిన పట్టుదల గుర్తుకొచ్చి, నాలో కూడా ఎక్కడలేని ధైర్యం వచ్చింది. పోరాడటానికి సిద్ధమయ్యాను. నేను చెయ్యబోయే ఆ పోరాటానికి ఆసరానివ్వటానికి నా వెనుక భార్యా, పిల్లలనే సైన్యం వుంది. ఇక భయపడేదేముంది!

***0***

కథా మంజరి
మంచి కథలు సమాహారం



# పాము చచ్చింది

## పి రాజేంద్ర ప్రసాద్

నరిసిగాడొక్కడే కొంపలో ఉన్నాడు. అలా అన్డానికి వీల్లేదు. కుంటి నరిసిగాడికి తోడు చంటి పిల్లోడు. ఆడికింకా పూర్తిగా రెండేళ్లు నిండలేదు. ఈ వానకీ, చలికీ జ్వరమొచ్చి వాడి ఒళ్ళు పెనంలా కాలిపోతూ ఉంది. పాత గుడ్డ ఒకటి కిందేసి, నేల మీద పడుకోబెట్టి ఆళ్ళమ్మ ఎంకి కూలీ కెళిపోయింది. దానికి ఇష్టం ఉండీ, కావాలనీ కాదు. వేరే దిక్కులేక. బొట్టిగాడు కడుపులో పడ్డ మూణ్ణెళ్లకి మాయదారి రోగమేదో వచ్చి అత్తమ్మ పైకెళ్లిపోయింది. నరిసి గాడు చూస్తే కుంటాడు. ఎంకి కూలికెళ్ళాల్సొచ్చింది. ముందు నించీ నరిసిగాడు కుంటోడు కాదు. బాగానే పని చేసుకునేవాడని ఎంకిని ఆడికిచ్చి చేశారు. ఇప్పుడంటే ఆడి బతుకిలా కాలిపోయింది.

పెళ్లయ్యేనాటికి నరిసి గాడు లారీ డ్రైవింగు చేసేవాడు. ఆడి కింద క్లీనరు సత్తి గాడు. ఆ రోజు నరిసిగాడి ఖర్మ కాలిన రోజు. ఆ రోజు క్లీనరు సత్తిగాడు డ్యూటీ ఎగ్గొట్టేశాడు. అయినా సరే లారీ తీసికెళ్లాల్సిందేనని ఓనరు గొడవ పెట్టాడు. నరిసి గాడికి తప్పలేదు. ఏలూరెళ్లి అక్కడ రైసుమిల్లు దగ్గర లెఫ్టుకి కోస్తూ ఉంటే, కింద నిలబడి రైటు చెప్పేవాడు, హోల్డాన్ చెప్పేవాడు ఎవడూ లేడు. ఎలాగో తనకు తానే మెడను వీలైనంత వెనక్కు తిప్పి చూసుకొని .. చూసుకొని స్టీరింగు తిప్పుతూ ఉంటే, లారీ కాస్తా జారిపోయి వెనక చక్రం పక్కనున్న కాలవలోకి కూరుకుపోయింది. ఏమైందా అని వెనక్కెళ్లి ఎనక డోరు మీద చెయ్యేసి వంగి చూస్తుంటే గొళ్ళెం ఊడింది కాబోలు .. డోరు దానంతటదే తెరుచుకుపోయి ఒక్కపాటుని పైనించీ బియ్యం బస్తాలన్నీ కాలి మీద పడిపోయాయి. ఎడంకాలు నుజ్జునుజ్జు అయిపోయింది. అక్కడే హాస్పిటల్లో చేర్చి, బంగారం లాంటి కాలు తీసేశారు. నరిసిగాడు అక్కడ్నించి వచ్చేటప్పటికి ఉన్న బాకీలన్నీ ఓనరుగారు దయతో సెటిల్ మెంటు కింద వచ్చిన సొమ్ముతో తీర్చాడు. వచ్చేనాటికి ఎంకి పురిటి నెప్పులు పడుతూ ఉంది. ఇరుగమ్మ పొరుగమ్మ సాయం పట్టి కానుపు చేస్తే, ఎర్రగా పిచ్చిక పిల్ల లాంటి చంటోడు బయట పడ్డాడు. ఇప్పుడు అటూ ఇటూ కదలకుండా గుడ్డ మీద పడుకున్నది వాడే.

మూడు రోజుల బట్టీ వాన వదలకుండా కురుస్తోంది. రోడ్డు మీద వాన. పొలంలో వాన. చెట్టు మీదా పుట్ట మీద వాన. కొండా కోనల్లోనూ, వాగు వంకల్లోనూ పోటెత్తి కురుస్తోంది. టీ వీ ల్లోనూ, పేపర్లలోనూ వాన గురించి తెగ చూపిస్తూ, రాస్తూ ఉన్నారు. అంతకంటే కొంచెం ఎక్కువగానే కురుస్తోంది వాన. వాన ధాటికి చెరువులూ, వాగులూ కట్టలు తెగిపోయాయి. కూలి జనానికి మామూలు కూలిపనులు, నాట్లూ, కోతలూ, ఇళ్లు కట్టడాలూ, రోడ్లెయ్యడాలూ ఇవేవీ లేవు. బ్రిడ్జీ కాడ చెరువు గట్టు తెగిందంట. దానికి అడ్డెయ్యడానికి లారీలల్లో ఇసుక బస్తాలూ, సిమెంటు బస్తాలూ వచ్చాయి. అవెయ్యడానికి కూలీ జనం కావాల్సొచ్చారు. ఆడదానివి నువ్వేం మోస్తావే అంటే "అన్నా, అన్నా నేను మొయ్యగల" నని బ్రతిమలాడుకొని మరీ కూలీకెళ్లింది ఎంకమ్మ.

నరిసి గాడి గుడిసె రోడ్డు మట్టానికుంది. కిందంతా పల్లమే. అందుకని వాన నీరు నరిసి గాడింట్లోకి వచ్చినా, అదే వేగంతో కొట్టుకు పోయింది. చెంబులూ తప్పేలాలూకొట్టుకు పోయాయి. గుడిసె పక్కనే ఓ చెట్టుంది. ఎత్తుగా వేసిన రోడ్డు కంటే గుడిసే, చెట్టూ కూడా పల్లంలోనే ఉన్నాయి. వాన నీటికి వరద వేగానికి రకరకాల జీవాలు కొట్టుకొస్తూ ఉన్నాయి. పాములూ, తేళ్ళూ, కప్పలూ, జర్రులూ రకరకాల పురుగులూనూ. రోడ్డు మీదకి కొట్టుకొచ్చినవి వాననీటితో పాటు కిందికి జారిపోయాయి. కిందికి జారినవి చెట్టుమీదా అక్కడ్నించి మరింత కిందికీ నేల మీదికి పడి, బతుకు జీవుడా అంటూ తుప్పల్లోకీ, పుట్టల్లోకీ పారిపోయాయి. వాటిల్లో ఒక పాము మాత్రం కట్లపాము. అది పామంటే పాము కాదు. పాము పిల్ల. అది చెట్టు మీంచి నరిసి గాడి గుడిసె కప్పు మీదకి పడింది. పడ్డం పడ్డమే సరిగ్గా పరవని గడ్డి మధ్యలోకి అటూ ఇటూ కాకుండా పడి ఇరుక్కు పోయింది. నాగుపాముకున్న స్పీడు కట్ల పాముకుండదు. అవి సహజంగా మెల్లగా ఉంటాయి. అలాగ ఇరుక్కుపోయిన పాము, ఎటో అటు పారిపోదామని ప్రయత్నిస్తోంది. గడ్డి కట్టలు ఒక దాని పక్కన ఒకటీ, ఒక దాని మీద ఒకటీ వేసి, ఏదో తనకి వచ్చినట్టు గుడిసె మీద పై కప్పు తయారు చేసుకుంటే, ఆ కప్పులో గడ్డి మధ్యలో నల్లగా బారుగా తోక మాత్రం కనిపిస్తూ జారుతూ, పైకెళుతూ, మళ్లీ జారుతూ పైకెళుతోందో, కిందకొస్తోందో తెలియకుండా ఉన్న ఆకారం. అది నరిసి గాడి కంట పడనేపడింది."ఓలమ్మో! నేనేటి సేతును?" అనుకున్నాడు నరిసి గాడు.

అసలు నరిసిగాడిది గుడిసె కాదు. డ్రైవింగు చేసే రోజుల్లో రెండు గదుల అద్దెకొంపలో ఒద్దిగ్గా ఉండేవోడు. కాలూ, ఉద్యోగమూ రెండూ ఒకేసారి పోయి, ఇంట్లో కూలికెళ్లే నరిసి గాడి అమ్మ చనిపోయినందుకు ఆ ఇంటా ఈ ఇంటా పనిచేయడానికీ, అక్కడా ఇక్కడా కోతలనీ, ఊడ్పులనీ, నాట్లకనీ కూలీ కెళ్లడానికీ ఎంకి ఒక్కత్తే అయిపోయింది. ఇల్లు రెండు గదుల నుండి పోరంబోకు స్థలంలో గుడిసెగా మారింది. వారం దినాలుగా ఎడతెరిపిలేని వాన. కూలీల్లేవు. దానికి తోడు గుడిసెంతా చెమ్మ చెమ్మ. ఈ రోజు కూలీ దొరికేటప్పటికి రెండు మెతుకులు ఉడకేసి, బొట్టిగాడికి తినిపించి మొగుణ్ణి తినమని చెప్పి హడావుడిగా ఎల్లిపోయింది ఎంకి. అప్పట్నుంచీ అక్కడే బొట్టిగాణ్ణి చూసుకుంటా కూర్చుని ఉంటే, ఎప్పుడు చేరిందో మాయదారిది. పై కెళుతోంది. అలాగని పూర్తిగా పైకి పోవడం లేదు. గబుక్కున కిందకి జారిపోతోంది.

అప్పుడే నరిసిగాడి గుండె కాస్తా జారిపోతోంది. కుంటి నరిసిగాడు ఓ పట్టాన లేవలేడు. ఎవరన్నా చెయ్యందించాలి. అలాగ అలవాటైపోయింది. ఇప్పుడు ఇంట్లో ఎంకి లేకపోయేటప్పటికి నరిసిగాడికి ఒక్కసారి హఠాత్తుగా లేవగలనా అని అనుమానంగా ఉంది.
అదిగో అది కిందకి జారింది. నరిసిగాడు "ఓలమ్మో! దాన్ని కొట్టాల .. లేద్దాం" అనుకున్నప్పుడు మళ్లీ పైకి పోయింది. "ఛస్...మళ్లీ పైకెళతాంది" అనుకున్నాడు. ఇది నాలుగో సారో ఐదోసారో అలా అనుకోవడం. అది పామేమోనన్న భయం. పాము కాదేమో పందికొక్కు తోకేమోనన్న ఆశ. ఒక వేళ పామే అయితే .. పైనించి కింద పడితే, కింద నేల మీద పాత గుడ్డ మీద పడుకోబెట్టిన బొట్టి గాడి మీద పడితే? "అమ్మో!" అన్న భయం. కుంటికాలితో వెంటనే లేవలేనన్న భయం. తన చేతుల్లో ఏమీ లేదనుకొని, ఏమీ చేయలేనందువల్ల వచ్చిన భయం.

కుంటికాలిచ్చిన దేవుడి మీద కోపం. కుంటికాలోడ్నీ, చంటి పిల్లాడ్నీ ఒంటరిగా వదిలేసి కూలికెళ్లిన పెళ్ళాం మీద కోపం. ఇద్దర్నీ వదిలేసి వానలో, గాలిలో, గాలివానలో తనొక్కత్తే కూలి కెళ్లాల్సొచ్చిన ఎదవన్నర ఎదవ బతుకు మీద కోపం. తన చేతుల్లో ఏమీ లేదనుకొని, ఏమీ చేయనందువల్ల వచ్చిన కోపం.

భయం....భయం వల్ల నిస్పృహ కలుగుతుంది. నిస్పృహతో నీరసం వస్తుంది. నీరసం వల్ల నిస్సత్తువ వస్తుంది. నీరసం వస్తే, నిస్సత్తువ వస్తే ఏ పనీ చేయలేం. అదృష్టం కొద్దీ నరిసిగాడికి కోపం వచ్చింది. కోపం వస్తే భయం ఎక్కడికో పోతుంది. ప్రశ్నించే కోపానికి భయం కూడా భయపడుతుంది. భారత దేశంలో ఎవరికీ తెలియని ఏ మూలో ఉన్న అల్లూరి సీతారామరాజుకి కోపం వస్తే, వేల మైళ్ళ దూరాన ఉన్న ఢిల్లీ పీఠం పునాదులు కదిలాయి. ఎక్కడో సముద్రాలకవతల ఉన్న బ్రిటిష్ రాణి ఉలిక్కిపడింది. ఆంగ్లేయ పాలకుల గుండెల్లో వణుకు పుట్టింది. అదీ కోపానికి, ధైర్యానికీ, సాహసానికీ ఉన్న శక్తి . దేశానికి ఇంకో మూలన ఉన్న భగత్ సింగుకి కోపం వస్తే ఒక ఆంగ్లేయుడి తల పేలిపోయింది. వేలమందికి ధైర్యం వచ్చింది. ఆంగ్లేయుల మదమణగి దేశం దాస్య విముక్తిని పొందింది. అణగదొక్కబడితే కోపం వస్తుంది. బంతిని నేలకేసి కొడితే అంత వేగం గానూ పైకిలేస్తుంది. కోపం ధైర్యం గానూ, ధైర్యం సాహసం గానూ మారతాయి.

అప్పుడు మనిషిని వెనక్కిలాగే భయం ఆమడ దూరానికి పారిపోతుంది. తరతరాలుగా ఇదే జరుగుతున్నా మామూలుగా భయానిదే పై చెయ్యిగా ఉంటుంది. కింది వాడికీ, మధ్యతరగతి వాడికీ భయమెక్కువ. వాడికి కోపం రాదు. కోపం వచ్చినా అమ్మో అని భయపడి కోపాన్ని దాచుకుంటాడు. అట్టడుగున ఉండి అణగదొక్కబడ్డవాడికే కోపం వస్తుంది. ప్రశ్నించే దమ్ము వస్తుంది. నువ్వెవడివిరా అని అడిగే ధైర్యం వస్తుంది. మనిషే వాహనంగా అంతెత్తు నిలబడ్డ వాణ్ణి కిందకు లాగి, కాలితో తన్ని, దాసోహం అనిపించే సాహసం వస్తుంది.

కోపం వల్ల పట్టుదల వస్తుంది. శత్రువుని వదలకూడదని పట్టుదల. చిన్నదైనా భయమే శత్రువు. దాన్ని చంపితే సగం విజయం వచ్చినట్టే.  నరిసిగాడికి విశ్లేషణ రాదు. భయపడితే పాము మరింత భయపెడుతుందనీ, వెనక్కి తగ్గితే అదును చూసుకొని కాటేస్తుందనే స్పృహ ఉంది వాడికి. శత్రువును గుర్తించగల స్పృహ ఉంటే, వాడి బలమేంటో, బలహీనతేంటో తెలిస్తే భయం పారిపోతుంది. ధైర్యమూ, దానితో పాటు సాహసమూ వస్తాయి. నరిసిగాడు పామునే చూస్తూ కూర్చున్నాడు. అది అప్పుడప్పుడూ కదులుతోంది. బయటకొస్తోంది మనిషి ఆశలాగా. లోపలికి పోతోంది నిస్పృహ లాగా. చేతకానితనం లాగా. అది బయటకొచ్చినప్పుడల్లా నరిసిగాడు దూకడానికి సిద్ధమౌతున్నాడు. చంకల కింద పెట్టుకోడానికి అప్పుడెప్పుడో గవర్నమెంటోళ్లిచ్చిన కర్రని సిద్ధంగా పట్టుకున్నాడు. నడవడానికి అదెప్పుడూ ఉపయోగపడలేదు. చంకలో గుచ్చుకొనేది. అది గుచ్చుకోకుండా గుడ్డలు చుడితే చంటోడికి పనికొస్తాయని పెళ్ళాం తీసేసింది. ఇప్పుడైనా, ఇందుకైనా పనికొస్తుందా? పనికొస్తుందో లేదో నరిసిగాడికి తెలీదు. కర్రలు పాముని కొట్టడానికి పనికొస్తాయని తెలుసు. ఇదీ కర్రేగా! తప్పకుండా పనికొస్తుందని నమ్మేడు. నమ్మకం వల్ల ధైర్యమూ, ధైర్యం వల్ల సాహసమూ, వస్తాయి. సాహసం చేస్తే, పాముని కొట్టగలనని నరిసిగాడు నమ్మేడు.

వర్షం పెరిగింది. కుండపోతగా కురుస్తోంది. బీదవాడికి ధైర్యం వచ్చినప్పుడు ధనవంతుడికి, వాడి మీద పట్టు తప్పిపోయినట్టు, తిరగబడే భార్య మీద తాగుబోతు భర్తకు పట్టు తప్పిపోయినట్టు, పాముకు గడ్డి మీద పట్టు జారిపోతోంది. అల్లరి చిల్లరి కుర్రాడిమీద స్కూలు మేష్టారికి పట్టు తప్పిపోయినట్టు, యూనియన్ లీడరైన ఉద్యోగి మీద యజమానికి పట్టు తప్పిపోయినట్టు, పాముకు గడ్డి మీంచీ, కప్పు మీంచీ పట్టు తప్పి పోతోంది. పట్టు తప్పినప్పుడల్లా జారిపోతోంది. జారినప్పుడల్లా నరిసిగాడు కర్రతో సిద్ధమౌతున్నాడు. తన రాజ్యం లోకి వస్తే, తన కొడుకు మీద పడేటట్టుంటే, దాని సంగతి చూడాలని పట్టుదలగా ఉన్నాడు.

పాముకు ఇన్ని తెలివితేటల్లేవు. ఇప్పుడొక ఆధారం మీద ఉంది. ఆ ఆధారం నుండి జారిపోతే ఎక్కడ పడతామో, అక్కడ ఆధారం ఉంటుందో ఉండదో దానికి తెలీదు. దానికి ఉన్నదల్లా భగవంతుడు అన్ని జంతువులకీ ఇచ్చిన ఇన్ స్టింక్ట్. చిన్నప్పుడు మనం చదువుకున్న అసంకల్పిత ప్రతీకార చర్య. ఇన్ వాలంటరీ రిఫ్లెక్స్ యాక్షన్. చిన్న మెదడులోనో, మెడుల్లాఆబ్లాంగేటా లోనో ఉంటుంది. మనుషుల కన్నా జంతువులకన్నిటికీ ఇదే బాగా పనిచేస్తుంది. ఇన్ స్టింక్ట్ తోటే పెంపుడు జంతువులు యజమానుల్నీ, వాళ్లకు కావాల్సిన వాళ్ళనీ గుర్తు పడతాయి. అందుకని పాము పడిపోకుండానూ, జారిపోకుండానూ ప్రయత్నిస్తోంది. నరిసిగాడికి ఎంతసేపటికీ బొట్టెడికి ఏవన్నా అవుతుందన్న ఆత్రం. అదే వాడి సమస్య.

కథా మంజరి
పది కథల సమాహారం

పాముకి జీవన్మరణ సమస్య. కింద పడితే దేనిమీద పడతామో, దేన్లో పడతామో, బతుకుతామో, చస్తామో తెలియని సమస్య.

వర్షం అంతకంతకూ పెరుగుతోంది. నల్లమబ్బులు యముడి భటుల్లా సూర్యుడి మీదకు వచ్చేస్తున్నాయి. ఆకాశం చీకటైపోతోంది. మబ్బులు రాకపోయినా సాయంత్రమవుతోంది. సూర్యుడు హడావుడిగా వేరే ఊరికి పరిగెడుతున్నాడు. కొంతమందుంటారు. అన్నీ పర్ ఫెక్టుగా చేస్తాము, అవతలవాళ్ళలా పోతే ఏంటీ మనకి మనం డిసిప్లిన్ గా ఉండొద్దా అంటారు. హరి వచ్చి గిరి మీద పడ్డా, గిరి వచ్చి హరి మీద పడ్డా, పక్కవాడిల్లు కాలిపోతున్నా, ప్రపంచం మునిగిపోతున్నా మన పని మనదే అంటారు. లెక్క ప్రకారం చేసుకుని పోతూ ఉంటారు. అదిగో, అలాంటి వాడే సూర్యుడు. ఇన్ని కోట్ల సంవత్సరాల నుండీ నేను క్రమం తప్పానా, ఈ రోజు తప్పడానికి. వానొస్తే నాకేంటి? వరదొస్తే నాకేంటి? నరిసిగాడింట్లో పాముంటేనూ, అసిరిగాడింట్లో తేలొస్తేనూ, నా పని మానేసుకుంటానా ఏంటి? అని చిరాకు పడుతూ హడావుడిగా వెళ్లిపోతున్నాడు. సింహం లేని అరణ్యంలో నక్కలదే రాజ్యమౌతుంది. వెలుతురు లేని లోకంలో చీకటిదే రాజ్యమవుతుంది. సూర్యుడు వెళుతూ వెళుతూ వెలుతుర్ని తనతోపాటు తీసికెళ్లిపోతున్నాడు.

జ్ఞానం లాంటి వెలుతురు అంతరించిపోతే అజ్ఞానం లాంటి చీకటి విజృంభిస్తుంది. కాటుక లాంటి చీకటి. ఏమీ తెలియనివ్వని చీకటి. అజ్ఞానం విజృంభించే చీకటి. డబ్బు గల వాడి బలం చీకటి. డబ్బుని ఇనప్పెట్టి లాకర్ చీకట్లోనూ, స్విస్ బాంకు చీకట్లోనూ ఉంచితే పెరుగుతుంది. చీకట్లో చీకటి వ్యాపారం చేస్తేనూ పెరుగుతుంది. బలహీనుడ్ని అదును చూసి కొట్టాలంటే, ధైర్యం లేని వాణ్ణీ, కోపం తెచ్చుకోలేనివాణ్ణీ వెనకనించి దెబ్బ తీయాలంటే చీకటిని మించింది లేదు.

చీకటైతే నల్లని పాము కనబడదేమోనని నరిసి గాడు ఖంగారు పడుతున్నాడు. వాడి ఖంగారుతో సంబంధం లేకుండా చీకటి దూసుకొస్తూనే ఉంది. నరిసి గాడు క్షణం ఆలోచించాడు. శత్రువుకీ, తనకీ ఉన్న బలాబలాలు బేరీజు వేసుకున్నాడు. ఏ యుద్ధమైనా మనకీ శత్రువుకీ ఉన్న బలాబలాలు తెల్చుకోకపోతే శత్రువుకే విజయావకాశాలు ఎక్కువుంటాయి. అందుకని జాగ్రత్తగా ఆలోచించాలి. తన దగ్గర కర్ర ఉంది. పాముకి సర్రున పారిపోయే ఒడుపుంది. కర్ర విసిరి అది తగలకపోతేనో? ఏం జరుగుతుంది? కిందపడ్డ పాము పరిగెడుతుంది. బొట్టి గాడివైపు పరిగెడితేనో? అమ్మో! కొంప మునిగిపోదూ! సీతమ్మోరిని లచ్చుమయ్య వదిలిపెట్టిసినాడు. కానీ, బొట్టిగాణ్ణి నేనొదిలిపెడ్తే ఎట్టా! ఊహూ! కర్ర ఇసరకూడదు. కర్ర ఇసిరినాక పాము పరిగెడితే బొట్టిగాడికేది దిక్కు? నాకేది దిక్కు? నానే కిందపడతాను కదా! ఇది నాబంనేదు. కఱ్ఱ బోటెట్టుకొని ఒక్కసారిగా లేసి, పాముని ఏసెయ్యాల? ఎట్టా? అనుకున్న నరిసి గాడికి కర్తవ్యం చప్పున స్ఫురించింది. ఇంత సేపు ఆలోచన రాలేదు. ఒచ్చిన వెంటనే ఇక ఆలీసం సెయ్యకూడదనుకొన్నాడు.

కర్ర తీసుకొని చంక కింద పెట్టుకున్నాడు. నెమ్మదిగా బొట్టిగాడు పడుకున్న గుడ్డని కుడి చేత్తో లాగాడు. అమ్మయ్య! బొట్టిగాడు లేవలేదు. పాము వంక చూశాడు. అది పైకెళుతోంది. మళ్ళీ కిందకి జారుతుందని సిద్ధంగా ఉన్నాడు. అదిగో! ఒక్కసారిగా కిందకు జారింది. నరిసి గాడి కుడి సేతి కింద బోటెట్టుకున్న కర్ర మీంచి ఒక్కసారిగా పైకి లేచాడు. పట్టు సడలకూడదు. గురి తప్పకూడదు. ఎడం చేత్తో పాము తోక పట్టుకొని ఒక్కసారిగా కిందికి గుంజాడు. చెయ్యి జారినట్టనిపించి గుండె గుభేలుమంది. ఓడిపోకూడదు. పట్టు బిగించాడు. "థూ! నీ యవ్వ! సావేనంజకానా!" అంటూ కసి తీరా నేల మీద బాదేడు. అట్టా బాదుతూనే ఉన్నాడు. పాము చచ్చిందని నమ్మకం కుదిరాక బయటకిసిరేసి "థూ!" అన్నాడింకోసారి.

ఎంకి లోనకొచ్చింది. "ఏటి మావా! ఏటైనాది? ఒగురుస్తా ఉండావు?" అంది.

సమాధానంగా చచ్చిన పాముని చూపించాడు నరిసిగాడు.

"వామ్మో! సంటోడు!" అంది గుండెలు బాదుకుంటూ.

"ఏహె! ఆడికేటి కానేదులే!" అన్నాడు నిబ్బరంగా నరిసి గాడు.

"పావు సచ్చిందా మావా?" సందేహంగా అడిగింది ఎంకి.

"సచ్చిందిలేయే! రేపటి కాన్నించి నేను రైస్ మిల్లులో పనికెళతా!" మీసం మీద చెయ్యేస్తూ అన్నాడు నరిసిగాడు.

"అదేంటి మావా! నీకు కాలోటి బానేదు కందా?!" సందేహంగా అంది ఎంకి.

"అసెయ్! మళ్ళీ అదే కూత కూస్తావేందే. కాలు బానేపోతే ఏమాయె? ఇంకో కాలున్నాది. రెండు సేతులుండాయి. మిల్లులో కూసుని తూకమేస్తా. నేపోతే కూలోళ్లందరికీ రోజుకూలి డబ్బులిచ్చే పని సేస్తా. నేను సేస్తానంటే అయ్యగోరు నాకేదో పనియ్యకపోరులేయే!" అన్నాడు ఆత్మ విశ్వాసంతో.

"సర్లే మావా! నువ్వట్టంటే నాకూ సంతోసమేగందా!"

ఎంకి పొంగిపోతూ దీపం ఎలిగించింది. అది ఒక్కసారిగా భగ్గుమని మండి, ఆనక కుదురుకొని గుడిసంతా ఎలుతురొచ్చింది. వర్షం ఆగిపోయింది. ఆకాశంలో మబ్బులు కరిగిపోయాయి. చంద్రుడొచ్చి.."సూర్యుడు లేకపోతేనేం నేనున్నాను!" అంటూ వెలుగులు చిమ్మాడు.

***0***

శ్రీ కాళీపట్నం రామారావు గారి

# కథాకథనం



కొన్ని తరాల తెలుగు కథాభిమానులచే "కారా మాష్టారు" అని పిలిపించుకునే, శ్రీ కాళీపట్నం రామారావు గారిని తెలియని తెలుగు కథాసాహితీ ప్రియులు ఉండరనడంలో అతిశయోక్తి లేదు. గడిచిన ఏడు దశాబ్దాల కాలంలో మాష్టారి కలం నుండి జాలువారిన కథలు 'రాసి' తక్కువైనా, 'వాసి'లో వేల విలువలను ఇచ్చాయి. 1966 లో మాష్టారు రాసిన "యజ్ఞం" కథ తెలుగు పాఠకుల్ని ఐదు దశాబ్దాలుగా రంజింప చేస్తూనే ఉంది. 1995లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించిన ఈ కథ గురించి జరిగిన చర్చ, బహుశ తెలుగులో ఏ కథ మీద జరగలేదు. ఆ కథకి వచ్చిన బహుమతి డబ్బులతో, శ్రీకాకుళంలో "కథానిలయం" అనే ఓ నిజమైన 'నివాసాన్ని' తెలుగు కథకి నిర్మించారు. అక్కడ దొరకని తెలుగు కథ ఉండదు. ప్రచురితమైన ప్రతీ కథ, అక్కడ నిలయమై ఉండాలనే, ఓ మహత్తరమైన మాష్టారి ఆలోచన, నిన్న నేడు రేపటి తరాల వాళ్ళకి తెలుగు కథను సజీవంగా అందిస్తున్నదంటే, తెలుగువారు ఆయనికి ఏమిచ్చి ఋణం తీర్చుకోగలరు! బహుశా ఇలాంటి 'నిలయం' ఏ భాషా కథలకి లేదనడంలో అతిశయోక్తి లేదు.

అలా నిజమైన కథా'యజ్ఞం' చేస్తున్న మాష్టారు, కథలు రాసేవారికి, రాస్తున్న వారికి, రాద్దామనుకునే వారికి ఉపయోగపడేలా 'కథాకథనం' అందించారు. ఇది అందరు చదవాలి. అందుకే, "కథా మంజరి" దీపావళి ప్రత్యేక సంచికతో పాటు, మాష్టారి కథాకథనంలో కొన్ని భాగాలను అందిస్తున్నాం. తప్పకుండా ఇది అందరికి దీపావళి కానుకగానే అలరిస్తుందని ఆశిస్తున్నాం.

ఈ భాగాలను ప్రచురించడానికి అమూల్యమైన అనుమతిని అందించిన మాష్టారికి, "కథానిలయం" కార్యనిర్వాహకులకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం.

"కథా కథనం కోసం ఇక్కడ క్లిక్ చేయండి"

# ధన్యవాదాలు



# దీపావళి శుభాకాంక్షలు